

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

నల్లగొండ

: fb.com/vaartha Digital

1-6-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 121 పేజీలు: 8+16 వెల: 6.50

Published from Nalgonda, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Tadepalligudem, Srikakulam



ఆసిఫాబాద్ జిల్లాలో నేడు సిఎం రేవంత్ పర్యటన 2

విద్యార్థులకు అండగా ఉంటాం: రాహుల్ గాంధీ 5


వరుసగా రెండోసారి ఐపిఎల్ టైటిల్ గెలిచిన ఆర్సీబీ

ఫైనల్లో 75 పరుగులతో వీరవిహారం చేసిన విరాట్ కోహ్లీ

బ్యాటింగ్, బౌలింగ్‌లో తేలిపోయిన గుజరాత్ టీం



# ఛాలెంజర్సే.. ఛాంపియన్లు!

ఆటలో



క్వాలిఫయర్-1 ఫలితమే ఫైనల్లో మరోసారి రిపీటైంది. తుదిపోరులో.. గుజరాత్ టైటాన్స్‌పై గర్జించింది. మొదట బౌలింగ్, ఆ తర్వాత బౌలింగ్‌లో ఆర్సీబీ మెరవడంతో ఫైనల్ వన్‌సైడ్ వార్‌గా మారింది. డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూర్ కప్ నిలబెట్టుకుంది. 2025లో మొదటిసారి ఐపీఎల్ ట్రోఫీ నెగ్గిన పాటిదార్ సేన లీగ్ స్టేజ్ నుంచి క్వాలిఫైయర్, ఫైనల్ వరకూ దుమ్మురేపింది.



## గ్రామాల్లో కొత్తగా విలేజ్ కరెంట్ ఆఫీసర్లు

### 12 వేల పోస్టుల భర్తీకి కసరత్తు

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో కొత్తగా ఉద్యోగాలను భర్తీ చేసేందుకు విద్యుత్ శాఖ కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా విలేజ్ కరెంట్ ఆఫీసర్ల పోస్టులను భర్తీ చేసేందుకు సిద్ధమవుతోంది. తెలంగాణ మొత్తంగా ఈ కరెంట్ ఆఫీసర్ల ఉద్యోగాలకు సంబంధించి 12 వేల పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించింది. ఈ విలేజ్ కరెంట్ ఆఫీసర్లు గ్రామీణప్రాంతాల్లో వ్యవసాయ విద్యుత్‌సరఫరా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాల్సి >>2


ఇంటర్ బోర్డు అనుమతి దొరకని 134 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు 7


# 'సాగు'తుందా!



వ్యవసాయంపై ఎల్‌నినో ఎఫెక్ట్ గట్టిగానే ఉంటుందని ఐఎండి అంచనావేసింది. ఇన్‌కాయిస్ ఇప్పటికే ఈ విషయమై హెచ్చరికలు కూడా చేసింది. ఈ యేడు తక్కువ వర్షపాతం నమోదవు తుందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

### వర్షపాతం తగ్గుతుందంటున్న ఐఎండి

### వ్యవసాయరంగంపై ఎల్‌నినో ప్రభావం

### ఖరీఫ్‌కు సన్నద్ధమవుతున్న తెలుగు రాష్ట్రాలు

### ప్రత్యామ్నాయ పంటలపై దృష్టిపెట్టే అవకాశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే31:** వచ్చే ఐదేళ్ల పాటు ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశాలున్నాయని ప్రపంచ వాతావరణ సంస్థ అంచనా వేసింది. వ్యవసాయంపై ఎల్‌నినో ఎఫెక్ట్ గట్టిగానే ఉంటుందన్న అంచనాలు ఆందోళన కలిగిస్తున్నాయి. భారత జాతీయ సముద్ర సమాచార సేవల కేంద్రం ఇన్‌కాయిస్ ఇప్పటికే ఈ విషయమై హెచ్చరికలు కూడా చేసింది. రుతుపవనాలు బలహీనపడే అవకాశాలు గట్టిగానే కనిపిస్తున్నాయి. భారత వాతావరణ శాఖ ఇప్పటికే ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవు తుందని అంచనా వేసింది. ఈనెల 26వ తేదీనే నైరుతి రుతుపవనాలు కేరళ తీరం దాటతాయని ఐఎండీ మొదట ప్రకటించింది. కానీ రుతుపవనాల రాక మరింత ఆలస్యం కానుందని అంచనాలు సవరించింది. జూన్ 4, 5వ తేదీల్లో కేరళ తీరాన్ని తాకే అవకాశముందని వెల్లడించింది. ఇప్పుడు సూపర్ ఎల్‌నినోగా మారే అవకాశాలు ఉన్నాయని అంచనాలు వేస్తున్నారు. అదే జరిగితే తరచూ వడగాలులు వస్తాయి. గాలిలో తేమశాతం తగ్గిపోతుంది. ఒక్కోసారి పరిస్థితులు ఇందుకు భిన్నంగా కూడా ఉండొచ్చు. గాలిలో ఉండాల్సిన తేమ కంటే ఎక్కువ కావచ్చు. ఉన్నట్టుండి భారీ వర్షాలు కురిసే అవకాశమూ ఉంటుంది. ఈ అంచనాలే ఖరీఫ్ సీజన్‌ను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ఈ ఏడాది జూన్ 2 నుంచి ఖరీఫ్ సీజన్ >>2



## ఎండలు మండుతున్నాయ్ జాగ్రత్త!

### వేసవి తీవ్రతపై మన్‌కీబాత్‌లో ప్రజలకు సూచించిన ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, మే 31:** వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్నందున దేశ ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, వేసవి వేడికి అనేక రుగ్మతలు ఎదురవుతాయని, ప్రజలు నిరంతరం జాగ్రత్తలు పాటించాలని ప్రధానిమోడీ కోరారు. ఆదివారం నిర్వహించిన 134వ మన్‌కీబాత్ ఎపిసోడ్‌లో ఆయన పలు అంశాలను ప్రస్తావించారు. ముందుగా వేసవి ఉష్ణోగ్రతలపైనే ఆయన ప్రజలను అప్రమత్తంచేసారు. అవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని, ఉదయం 10 గంటల >>2

## ఇక కాంగ్రెస్ మరింత బలోపేతం

### ఖర్గేతో భేటీ అయిన సిఎం రేవంత్, పలువురు నేతలు

### పార్టీ అభివృద్ధిపై చర్చలు



శంషాబాద్ విమానాశ్రయంలో ఖర్గేకు స్వాగతం పలుకుతున్న సిఎం రేవంత్, పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి తదితరులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే31:** హైదరాబాద్ మీదుగా గుల్బర్గా వెళ్లిన కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేను శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కలిశారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టిపిసిసి ప్రోటోకాల్ విభాగం చైర్మన్, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాలరావు తదితరులు ఆయనకు పుష్పగుచ్చం ఇచ్చి ఆప్యాయంగా స్వాగతం పలికారు. తర్వాత కొద్దిసేపు రాష్ట్ర రాజకీయాలపై మల్లిఖార్జున ఖర్గేతో చర్చించారు. పార్టీ బలోపేతానికి నేతలు కృషి చేయాలని ఈ >>2



ఆదివారం సిద్దిపేటలో మీడియాతో మాజీ మంత్రి హరీష్‌రావు

## ఆర్‌పిడిసిఎల్ రద్దు కోసం పోరాటం

### 24 గంటలు ఉచిత విద్యుత్ ఇస్తేనే ఓట్లు అడుగుతాననే ధైర్యం సిఎంకు ఉందా?

### మాజీ మంత్రి హరీష్‌రావు సవాల్

### నా జీవితమంతా కెసిఆర్‌తోనే..

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** 24 గంటలు ఉచిత విద్యుత్ ఇస్తేనే వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడుగుతా లేకుంటే ఓట్లు అడగా అని చెప్పే దమ్ము, ధైర్యం సిఎం రేవంత్‌రెడ్డికి ఉందా అని మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటి ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్‌రావు సవాల్ విసిరారు. జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 24 గంటల ఉచిత విద్యుత్‌కు మంగళం పాడినారని మండిపడ్డారు. ఆర్‌పిడిసిఎల్ ఏర్పాటుతో 9 గంటల కరెంటు కూడా రాదని..ఆర్‌పిడిసిఎల్ అనేది తుగ్లక్ చర్య అన్నారు. 24 గంటల విద్యుత్ సరఫరాకే ఆర్‌పిడిసిఎస్‌అని సిఎం రేవంత్‌రెడ్డి చెప్పడం సిగ్గుచేటన్నారు. ఆర్‌పిడిసిఎల్‌తో కాళేశ్వరం, దేవాదుల, నెట్టెంపాడు, కల్వకుర్తి, భీమా, కోయిల్‌సాగర్, సీతమ్మసాగర్ లాంటి లిఫ్ట్ ఇరిగేషన్‌పై ఆధారపడిన సాగు, తాగు నీటి రంగాలకు శాపంగా మారబోతుందన్నారు. ఆర్‌పిడిసిఎల్‌తో తాగు, సాగు నీటి సరఫరకు కొరత తప్పదన్నారు. రాష్ట్రంలో ఏ ప్రాంతానికి వెళ్లిన 13 గంటలు విద్యుత్ రావడం లేదన్నారు. ఆర్‌పిడిసిఎల్ ఏర్పాటుతో 9 గంటలు కూడా కరెంటు రాదన్నారు. ఆర్‌పిడిసిఎల్ 24 >>2



## డిగ్రీ కాలేజీలకు వేసవి సెలవుల పొడిగింపు

**హైదరాబాద్, ప్రభాతవార్త, మే 31:** తెలంగాణ రాష్ట్రంలో వేసవి సెలవుల అనంతరం నేటి(జూన్1) నుంచి ప్రారంభం కావల్సిన డిగ్రీ కాలేజీలకు వేసవి సెలవులు పొడిగించారు. రాష్ట్రంలో గత కొద్ది రోజులుగా ఉష్ణోగ్రతలు ఎక్కు వగా ఉన్న నేపథ్యంలో డిగ్రీ కాలేజీలకు మరికొద్ది రోజులపాటు వేసవి సెలవులు కొనసాగిస్తూ యూనివర్సిటీలు నిర్ణయం తీసుకున్నాయి. కాకతీయ, శాతవాహన యూనివర్సిటీలకు ఈ నెల 5 వరకు వేసవి సెలవులు పొడిగించగా ఈ నెల 6 నుంచి డిగ్రీ కాలేజీలకు 2026-27 విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. ఉస్మానియా, మహాత్మాగాంధీ, పాలమూరు, తెలంగాణ యూనివర్సిటీలు ఈ నెల 6 >>2

## సంబురాలా! విధ్వంసమా?

### ఫ్రాన్స్‌లో పేట్రేగిన 'ఫుట్‌బాల్ మంటలు'

### 260కి పైగా కార్లు, విద్యుత్ బైకులు దగ్ధం


### 780 మందిని అరెస్టు చేసిన పోలీసులు

**ప్యారిస్, మే 31:** ప్రతిష్టాత్మకంగాజరిగిన ఫుట్‌బాల్ ఛాంపియన్స్ లీగ్‌లో టైటిల్‌ను ప్యారిస్ సెయింట్ జర్మన్ చేజిక్కించుకోవడంలో అభిమానుల ఆనందాలకు అవధుల్లేకుండాపోవడంతోపాటు వీధులన్నీ విధ్వంసానికి గురయ్యాయి. కేవలం ప్యారిస్ నగరంలోనే >>2



ఈఫిల్ టవర్ వద్ద దగ్ధమవుతున్న కారు

ఫ్రాన్స్‌లో ఫుట్‌బాల్ అభిమానుల ఆందోత్సాహాలు



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న నకిలీ జిఒ పత్రాలు, స్టాంపులు, ల్యాప్‌టాప్‌లు

## నకిలీ పత్రాలతో సర్కార్‌భూమి స్వాహా కుట్ర!

### మరో ఇద్దరు నిందితులు రాధాక్రిష్ణ, అతని డ్రైవర్ అరెస్టు

### గండిపేట కుట్రలో ఏపి మాజీ ఎమ్మెల్యే బ్రహ్మానాయుడు పాత్రపై ఆధారాలు: డిసిపి

### మొత్తం రూ. 12కోట్ల లావాదేవీలు జరిగినట్లు గుర్తింపు



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న డిసిపి శ్రీనివాస్ తదితరులు

**హైదరాబాద్ (గచ్చిబౌలి), మే 31 ప్రభాతవార్త:** ప్రభుత్వ రెగ్యులరైజేషన్ పేరిట నకిలీ జీవో పత్రాలు, ఐఎఎస్ అధికారుల ఫోర్జరీ సంతకాలతో తప్పుడు రికార్డులు సృష్టించి గండిపేటలో కోట్లాది రూపాయల విలువైన భూమిని ఆక్రమించేందుకు యత్నించిన కేసులో మరో ఇద్దరు నిందితులను సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. నకిలీ పత్రాల సృష్టిలో కీలకంగా వ్యవహరించిన ఆంధ్రప్రదేశ్ సెక్రెటేరియట్‌కు చెందిన మాజీ ఉద్యోగి రాధాక్రిష్ణతో పాటు అతని డ్రైవర్‌ను పోలీసులు తాజాగా అరెస్టు చేశారు. ఇప్పటికే సదరు భూమికి హక్కుదారులుగా ప్రకటించుకున్న గండిపేటకు చెందిన నిమ్మల కుటుంబ సభ్యులు ముగ్గురిని పోలీసులు రెండు రోజుల క్రితం అరెస్టు చేయడంతో ఈ కేసులో మొత్తం 5గురు నిందితులను పోలీసులు ఇప్పటి వరకు అరెస్టు చేశారు. కాగా ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే బ్రహ్మానాయుడు పాత్రపై పోలీసులకు కీలక ఆధారాలు లభించినట్లు శేరిలింగంపల్లి డిసిపి వెల్లడించారు. బ్రహ్మానాయుడు సూచనతోనే రాధాక్రిష్ణ సదరు భూమిపై నకిలీ జీవో పత్రాలు సృష్టించాడని, మొత్తం తతంగంలో దాదాపు 12కోట్ల లావాదేవీలు జరిగాయని పోలీసులు గుర్తించినట్లు >>2


లోయలో పడిన టూరిస్టు ట్యాక్సీ
డ్రైవర్, ఇద్దరు చిన్నారులు సహా 8 మంది మృతి 3



భువనేశ్వర్‌లో 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' గణన పత్రంపై సంతకం చేస్తున్న బిజు జనతా దళ్ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్

# రద్దు కోసం పోరాటం

>> గంటల ఉచిత విద్యుత్ రానే రాదు..ఉచిత విద్యుత్‌కు ఊరితాడు అవుతుందన్నారు. మహారాష్ట్ర, గుజరాత్ మాదిరి విద్యుత్ సంస్థను ప్రైవేటు పరం చేయడానికి కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. పగలు మాత్రమే ఉండే సోలార్ పవర్‌తో 24 గంటలు కరెంట్ ఎలా ఇస్తారో చెప్పాలని సిఎంకు సవాల్ విసిరారు. డిస్కాంల అప్పులపై సిఎం పచ్చి అబద్దాలు మాట్లాడుతున్నారని కాంగ్రెస్ హయాంలో యేటా రూ.10 వేల 113 కోట్ల బాకీలు చేశారని బిఆర్ఎస్ పాలనలో డిస్కాంలకు ప్రభుత్వం రూ.27.000 కోట్ల అప్పు ఉంటే కాంగ్రెస్ సర్కార్ రెండున్నర యేండ్ల పాలనలో డిస్కాంలకు ఏకంగా రూ.25.284 కోట్లు అప్పు చేసిందన్నారు.కాంగ్రెస్ పాలనలో యేడాదికి సగటున రూ.10.113 కోట్ల చొప్పున డిస్కాంలకు అప్పులు చేసిందని ఇది బిఆర్ఎస్‌తో పోలిస్తే 5 రేట్లు ఎక్కువేనని తెలిపారు.ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబరు 8లో స్పష్టంగా టిజిఆర్‌పిడిసిఎల్‌కు సోలార్ విద్యుత్ ఇస్తామని చెప్పారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే థర్మల్, హైడల్, సోలార్ విద్యుత్‌ను మూడు డిస్కాంలకు సమానంగా పంచాలన్నారు. రైతుల పాలిట పేను శాపంగా మారబోతున్న టిజి ఆర్‌పిడిసిఎల్‌ను రద్దు చేసే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. సిఎం రేవంత్‌రెడ్డి చిట్ చాట్ సందర్భంగా చేసిన వ్యాఖ్యలపై హరీష్‌రావు స్పందించారు. నా జీవితమంతా కెసిఆర్ గారి వెంటే..నా పుట్టక నా ప్రయాణం అంతా బిఆర్ఎస్‌తోనే అని వందసార్లు చెప్పాను మళ్లీ చెబుతున్నానని పేర్కొన్నారు. అబద్దాలు చెప్పడం సిఎంకు వెన్నతో పెట్టిన విద్య అని మండిపడ్డారు.సిఎం రేవంత్‌రెడ్డి రేపు ఏ పార్టీలో ఉంటారో తెలియన సిఎం ఇంటి పేరు అబద్దాల రేవంత్‌రెడ్డిగా మార్చుకోవాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు మారెడ్డి రవీందర్‌రెడ్డి, గుండు భూపేష్, కొండం సంపత్‌రెడ్డి, రాధాకృష్ణశర్మ, కాముని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ మరింత బలోపేతం

>> సందర్భంగా ఖర్గే సూచించినట్లు సమాచారం.

**మెరుగుపడిన పాఠశాల విద్య: సిఎం**

పాఠశాల విద్యలో తెలంగాణ రాష్ట్ర పనితీరు గణనీయంగా మెరుగుపడిందని తాజాగా కేంద్ర విద్య శాఖ 'ఫెర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ (పిజిఐ) లో పేర్కొనడంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం ట్విట్టర్ వేదికగా స్పందనను తెలియజేశారు. 'అభివృద్ధికి తొలి కొలబద్ద విద్య. విద్య ఒక్కటే పేదరికాన్ని నిర్మూలించి, సమాజాన్ని జాగృతం చేయగలదని నేను బలంగా విశ్వసించాను. ఆ దిశగా రెండేళ్లు ప్రజా ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోంది. ఏ ముఖ్యమంత్రి ఆలోచన చేయని విధంగా విద్యా శాఖ బాధ్యతలు స్వయంగా నేనే తీసుకున్నాను. గడచిన రెండేళ్లుగా తెలంగాణ మోడల్ స్కూళ్ల ఏర్పాటు, నూతన ఉపాధ్యాయుల నియామకం, డిజిటల్ విద్యకు ప్రాధాన్యత, ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ సదుపాయం, ఇతర మౌలిక సదుపాయాల కల్పన, డ్రాపౌట్ల నియంత్రణ వంటి అంశాల పై బలమైన కార్యచరణ తీసుకున్నాం. పాఠశాల విద్యలో తెలంగాణ రాష్ట్ర పనితీరు గణనీయంగా మెరుగుపడిందని తాజాగా కేంద్ర విద్య శాఖ 'ఫెర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ (పిజిఐ) లో పేర్కొనడం మా ప్రభుత్వ రెండేళ్ల కృషికి నిదర్శనం. గత పదేళ్లలో జరిగిన విద్య విధ్వంసం నుంచి విద్యా వికాస పునర్ నిర్మాణానికి మేం నడుం కట్టాం. తాజా ఫలితాలతో మేం సంతృప్తి పడటం లేదు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం పూర్తై భవిష్యత్‌లో ఈ పాఠశాలలు దేశ విద్యా వ్యవస్థలో తెలంగాణ స్థానాన్ని నెంబర్ వన్‌గా నిలబెడతాయన్న విశ్వాసం మాకు ఉంది. ఆ లక్ష్య సాధనలో కేంద్ర నివేదికలో పేర్కొన్న ఫలితాలు మాకు ప్రేరణ ఇచ్చాయి అని చెప్పారు.

# వేసవి సెలవుల పొడిగింపు

>> వరకు వేసవి సెలవులను కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 7న ఆదివారం కావడంతో.. జూన్ 8 సోమవారం నుంచి వేసవి సెలవుల అనంతరం 2026-27 విద్యా సంవత్సరం క్లాసులను ప్రారంభించనున్నారు. తెలంగాణ ప్రభుత్వ కళాశాలల గెజిటెడ్ అధ్యాపక సంఘం విజ్ఞప్తి మేరకు రాష్ట్రంలోని డిగ్రీ కళాశాలలకు వేసవి సెలవులను వారం రోజులపాటు పొడిగించారని అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కళాశాల విద్య జేఏసీ చైర్మన్ డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ కాలేజీలకు యూజీసీ నిబంధనల ప్రకారం ప్రతి సంవత్సరం 10 వారాలపాటు సెలవులు ఇవ్వాల్సి ఉండగా.. కేవలం మే నెల 1 నుంచి మే 31 వరకు మాత్రమే రాష్ట్రంలోని యూనివర్సిటీలు సెలవులు ప్రకటించాయన్నారు. అందులోనూ తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన విద్య వారోత్సవాలు, జనగణన విధుల్లో నిమగ్నమై ఉన్నందున, వేసవి వేడి ఎక్కువగా ఉన్నందున సెలవులను పొడిగించాలని రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్లకు, రిజిస్ట్రార్‌లకు విజ్ఞప్తి చేయడమే కాకుండా వారితో చర్చించి ఒక వారం రోజులపాటు సెలవులు పొడిగించుకోవడం జరిగిందని, సెలవులను పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్న యూనివర్సిటీ అధికారులకు తమ సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు.

# కొత్తగా విలేజ్ కరెంట్ ఆఫీసర్లు

>> ఉంటుంది. గాలివానలు వంటి విపత్తులు వచ్చి కరెంట్ స్తంభాలు కూలిపోతే మండల సిబ్బందిని ఒకేచోటికి చేర్చి త్వరగా మరమ్మతులు చేసేందుకు ఈ విలేజ్ కరెంట్ ఆఫీసర్ల వ్యవస్థ ఉపయోగపడుతుందని సర్కార్ భావిస్తోంది. కాగా కొత్తగా ఏర్పడిన ఉచిత విద్యుత్‌కు సంబంధించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పంపిణీ సంస్థ (డిస్కం)లో ప్రస్తుతం క్షేత్రస్థాయి శాశ్వత సిబ్బంది వెయ్యి మందే ఉన్నారు. దీంతో, ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజులు, లైన్ల మరమ్మతులు ఆలస్యమవుతున్నాయని విద్యుత్ పంపిణీ సంస్థల అధికారులు తెలంగాణ విద్యుత్ నియంత్రణ కమిషన్ (ఈఆర్‌సీ) దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో తెలంగాణ వ్యాప్తంగా 12 వేల మంది లోకల్ ఎలక్ట్రీషియన్లను ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన నియమించాలని విద్యుత్ శాఖ భావిస్తోంది. వీరికి నెలకు రూ.15 వేలు వరకూ కనీస వేతనం అందించనున్నారు. వీరికి వేతనాల కోసం ప్రతి నెలా రూ. 18 కోట్ల చొప్పున ఏడాదికి రూ.216 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. శాశ్వత ఉద్యోగులకు అయ్యే ఖర్చుతో పోల్చుకుంటే ఇది తక్కువే కనుక ప్రభుత్వం త్వరలోనే ఈ విలేజ్ కరెంట్ ఆఫీసర్ల వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు వేగవంతం చేసింది.

# సంబురాలా! విధ్వంసమా?

>> కాకుండా ఫ్రాన్స్‌దేశవ్యాప్తంగా అభిమానులు వీరంగం వేసారు. పీఎస్జీ జట్టు ఆర్సెనాల్‌ను 4-3 తేడాతో గెలుపొందడంతో ఒక్కసారిగా ఫ్యాన్స్ ఆనందంతో రెచ్చిపోయారు. బుడాపెస్ట్‌లోముగిసిన ఈ పోటీల్లో తమ దేశ పిఎస్జీ జట్టు ఛాంపియన్‌గా నిలవడం అభిమానుల్లో ఆనందోత్సాహాలను నింపింది. అంతేకాకుండా ఆనందం ఉద్రిక్తతలకు దారితీసి ఫ్రాన్స్ విధుల్లో భారీ ఎత్తున విధ్వంసానికి దారితీసింది. ఈఫిల్‌టవర్ ప్రాంతం మొత్తం కూడా నీలం, ఎరుపు రంగుల పొగతో నిండిపోయింది. ఇప్పటి వరకూ అందిన సమాచారం ప్రకారం ఒకవ్యక్తి మృతిచెందాడు. 264 కార్లు ధ్వంసం అయ్యాయి. మొత్తం 780 మందిని అరెస్టుచేసినట్లు ఫ్రాన్స్ పోలీసులు ప్రకటించారు. 20 వేలమందికిపైగా మద్దతుదారులు ఛాంప్స్ ఎలిసీస్ స్టేడియం వద్దకుచేరి ఆనందాలతతో ఉత్సాహంతో గంతులు వేయడం ప్రారంభించారు. విద్యుత్ బైకులను దగ్ధంచేసారు. గ్లాస్‌డోర్లు ఉన్న షాపులను పూర్తిగా ధ్వంసంచేసారు.పిఎస్జీ పార్క్ డెస్ ప్రిన్సెస్ స్టేడియం వద్ద ఉన్న ఒక బేకరీ, రెస్టారెంట్ పూర్తిగా ధ్వంసం అయ్యాయి.స్టేడియం బయట నాలుగునుంచి ఐదువేలమందికిపైగా గుమికూడి రాళ్లు, బంతులు వంటి సామగ్రిని విరుసుకోవడం ప్రారంభించారు. సుమారు 150 మంది ఫ్యాన్స్ స్టేడియం గేట్లు తోసివేసి లోనికిప్రవేశించి విధ్వంసం సృష్టించారని తేలింది. మొత్తం 22 వేలమంది పోలీసులను నియమించారు. వారిలో ఎనిమిది వేలమందిని ప్యారిస్‌లోనే నియమించారు. ట్రామ్‌లైన్లు సస్పెండ్‌చేసారు. మెట్రోస్టేషన్లు మూసివేసారు. బస్‌సర్వీసులు పూర్తిగా నిలిపివేసారు. ఛాంప్స్ ఎలిసీస్ చుట్టూ ఉన్న అనేక షాపులకు నిప్పుపెట్టారు. గతంలో కూడా పిఎస్‌జి విజయం సాధించినపుడు ఇదే తంతు కొనసాగింది. అంతర్గత వ్యవహారాల మంత్రి లారెంట్ న్యూనెజ్ మాట్లాడుతూ ఏడుగురు అధికారులు గాయపడ్డారని, ఇలాంటి పరిస్థితులు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని అన్నారు. భాష్పవాయుగోళాలు ప్రయోగించి గుంపులను చెదరగొట్టారు. ఒక్కరాత్రిలోనే 100కుపైగా బాణాసంచా, తీవ్రస్థాయి పేలుడు ఉత్పత్తులను సీజ్‌చేసినట్లు చెప్పారు. పీఎస్జీ జట్టు క్రీడాకారులు విక్టరీ మారథాన్ నిర్వహించేందుకు ఈఫిల్ టవర్‌నుంచే ర్యాలీలో పాల్గొనాలని నిర్ణయించారు. ఈ వేడుకలకు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ కూడా పాల్గొనాల్సి ఉంది. అయితే ఈలోపే తీవ్రస్థాయి ఉద్రిక్తతలు చోటుచేసుకోవడంతో అవన్నీ రద్దయ్యాయి. గతంలో 2009లో కూడా బార్సిలోనా గేమ్స్‌లో 3-1 తేడాతో పిఎస్జీ విజయం సాధించినపుడు కూడా అభిమానుల పిచ్చి పీక్‌స్టేజికి చేరింది.

## వారం - వర్జ్యం

01-06-2026, సోమవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, రోహిణి కార్తె
పాడ్యమి సా. 4.37
జ్యేష్ఠ రా. 7.08
వర్జ్యం : లేదు
దు.ము. 12.31-మ.1.23,
2) మ.3.07-3.59
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** సంస్థలలో పనిచేసేవారికి, యజమానులకు లాభము చేకూరు అవకాశములు గోచరిస్తున్నాయి.

**వృషభం:** కుటుంబ సభ్యులతో కలిసి కొంత సమయమును ఆనందంగా గడుపుతారు. శుభకార్యములకు హాజరవుతారు.

**మిథునం:** మిత్రుల సహకారము లభించుట వలన మీకు తెలియని ఏవో కొన్ని విషయములను తెలుసుకుంటారు.

**కర్కాటకం:** చేపట్టే సంస్థలకు రాజకీయ నాయకుల సహాయం లభిస్తుంది. ఆస్తి వివాదాలు తీరి లబ్ధిని పొందుతారు.

**సింహం:** మీకు ఇష్టము లేకపోయినా ఆత్మీయుల సమక్షములో ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంటారు. వాహన సౌలభ్యం కలదు.

**కన్య :** ఆదాయ వ్యయముల సమతుల్యత లేకపోయినా ఏ ఇబ్బంది లేకుండా డబ్బు సర్దుబాటు అవుతుంది. వస్త్రలాభం.

**తుల :** మీ నైపుణ్యమునకు తగిన ప్రతిఫలమును పొందుతారు. పెట్టుబడి పెట్టిన వారికి భాగములను ఇవ్వవలసి రావచ్చును.

**వృశ్చికం:** వ్యాపారములో ఆధునాతన సాంప్రదాయమును, సంస్కరణములు ప్రవేశపెతారు.ఇంటా బయట ప్రోత్సాహం.

**ధనుస్సు:** ఉద్యోగములో దాదాపుగా మీ వైపు నుండి మానసిక సహాయ నిరాకరణ చాలా మందికి ఎదురౌతుంది.

**మకరం:** వినోదములలో అధికభాగము ప్రయోజనములకే ప్రాధాన్యతలను ఇస్తారు. కుటుంబసభ్యుల సలహాలు పాటిస్తారు.

**కుంభం:** ముందు ఆలోచనలతో ప్రాధాన్యత లేని వ్యక్తులను అందలము లెక్కిస్తారు. అంతరంగిక వర్గములో స్థానమును ఇస్తారు.

**మీనం:** అవకాశములను మీరు పరిశీలించకొని జాగ్రత్తగా ఎంచుకున్న రంగములను బట్టి మీ అభివృద్ధి ఆధారపడి ఉంటుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# సర్కార్‌భూమి స్వాహా కుట్ర!

>> తెలిపారు. ఈ మేరకు ఆదివారం సైబరాబాద్ కమీషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శేరిలింగంపల్లి డిసిపి శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు... గండిపేట మండలం గండిపేట గ్రామం సర్వే నెంబరు 18లో గల 10 ఎకరాల ప్రభుత్వ భూమి తమదంటూ దివంగత దశరథ్ కుటుంబ సభ్యులు వాదిస్తున్నారు. ఈ క్రమంలో దశరథ్ కుమారులు నిమ్మల రాజేష్ గౌడ్, నిమ్మల వేణుగోపాల్, నిమ్మల రామస్వామి, కుమార్తె మంగలు సదరు 10 ఎకరాలకు తామే యజమానులమంటూ హైకోర్టును ఆశ్రయించారు. రెవెన్యూ శాఖకు వ్యతిరేఖంగా వీరు పిటీషన్ దఖలు చేయగా గత సంవత్సరం అక్టోబరులో వీరి పిటీషన్‌ను కొట్టివేసిన కోర్టు సదరు భూమి ప్రభుత్వానిదని తేల్చి చెప్పింది. దీంతో వీరు బిల్ల రమేష్, ఆంధ్రప్రదేశ్ మాజీ ఎమ్మెల్యే బ్రహ్మానాయుడుతో కలిసి చేతులు కలిపి సదరు భూముల యజమానులు తామేనంటూ భారీ కుట్రకు పథకం వేశారు. ఇందులో భాగంగా నిమ్మల కుటుంబ సభ్యులు, బోల్ల రమేష్, బ్రహ్మనాయుడుల మద్య ఓ ఎంఒయు చేసుకున్నారు. దీని లావాదేవీలో భాగంగా 4కోట్ల రూపాయలను నిమ్మల కుటుంబ సభ్యులు అందుకున్నారు. ఈ లావాదేవీకి సునీల్, వేలాడి రాధాక్రిష్ణ అనే వ్యక్తులు మద్యవర్తులుగా వ్యవహరించారు. ఈ లావాదేవి కోసం నకిలీ ప్రభుత్వ ఉత్తర్వులను తయారు చేశారు. ఓ వైపు కోర్టు వీరి పిటీషన్‌ను కొట్టివేసి ప్రభుత్వ భూమిగా తేల్చగా, మరోవైపు ఈ ముఠా నకిలీ డాక్యుమెంట్లతో ప్రభుత్వ స్థలం విక్రయించే పథకం వేసింది. సర్వే నెంబరు 18లోని 10 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రభుత్వం తమకు రెగ్యులరైజేషన్ చేసినట్లు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారు. తాహాశీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి పిర్యాదుతో రంగంలోకి దిగిన నార్సింగి పోలీసులు నిమ్మల రాజేష్‌గౌడ్, నిమ్మల వేణుగోపాల్, నిమ్మల సాయికిరణ్‌లను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే.

**కీలకంగా రాధాక్రిష్ణ...**

కాగా ఈ కుట్రకోణంలో వేలాడి రాధాక్రిష్ణ కీలకంగా వ్యవహరించినట్లు పోలీసులు గుర్తించారు. ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో 2006 నుంచి 2009 వరకు ఐటి అండ్ సిలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేసిన వేలాడి రాధాక్రిష్ణ(53) అనంతర కాలంలో ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేయడం, పాస్ పుస్తకాలు, ప్రభుత్వ అనుమతులు ఇప్పిస్తానని ప్రజలను మోసం చేయసాగాడు. సచివాలంలో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్నానని, న్యాయవాదినని ప్రచారం చేసుకుంటూ మోసాలకు పాల్పడ్డాడు. 2013లో ఉద్యోగం ఇప్పిస్తానని ఓ వ్యక్తి వద్ద 30 లక్షలు వసూలు చేయడంతో ఇతని మీద కరీంనగర్ టూటౌన్‌లో కేసు నమోదైంది. దీంతో పాటు ఉద్యోగం ఇప్పిస్తానని వెంకటాచారి అనే వ్యక్తిని మోసం చేయడంతో నల్గొండ పోలీస్ స్టేషన్‌లో, మొయినాబాద్‌కు చెందిన దివాకర్‌కు ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన ఘటనలో మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. దీంతో పాటు రాజేంద్రనగర్, కరీంనగర్, నేరెడ్‌మెట్, కర్నూలు జిల్లా బేతన్‌చెర్ల, కరీంనగర్ టౌన్ తదితర పోలీస్ స్టేషన్లలో కేసులు ఉన్నాయి. తన డ్రైవర్ గ్యార ప్రవీణ్ ద్వారా కొవ్వూరు సునీల్‌తో పరిచయం పెంచుకున్నాడు. ఈ క్రమంలో గండిపేట మండలం సర్వే నెంబరు 18లో ఉన్న ప్రభుత్వ భూమికి హక్కుదారులమంటూ చెప్పుకుంటున్న నిమ్మల కుటుంబ సభ్యులతో సునీల్ ద్వారా పరిచయం పెంచుకొని పెద్దఎత్తున డబ్బు సంపాదించాలని పథకం వేశాడు. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ మాజీ ఎమ్మెల్యే బ్రహ్మానాయుడు, అతని సోదరుడు రమేష్‌లకు విషయం చెప్పి ప్రభుత్వ భూమికి వారసత్వం, ఇతర అనుమతులు పొందవచ్చని హామీ ఇచ్చి భూమి కొనుగోలుకు ఒప్పించాడు. కొవ్వూరు సునీల్‌తో కలిసి నకిలీ పత్రాలు తయారు చేస్తానని చెప్పి నిమ్మల కుటుంబ సభ్యుల నుంచి భారీ మొత్తంలో డబ్బు వసూలు చేశాడు. ప్రభుత్వ అనుమతులు కష్టమని గ్రహించిన రాధాక్రిష్ణ సదరు భూమికి నకిలీ జీవోలు, నకిలీ సిసిఎల్ఏ ప్రొసీడింగ్‌లు, ఐఎఎస్ అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి ఆధికారిక లేఖలను సృష్టించాడు. ఈ ప్రక్రియలో కొవ్వూరు సునీల్, కరణం రాజేష్, గ్యార ప్రవీణ్, ప్రభుదాస్‌లు ఇతనికి సహకరించారు. మాజీ ఎమ్మెల్యే బ్రహ్మానాయుడుకు తెలిసే ఈ తతంగం కొనసాగించినట్లు విచారణలో పోలీసులు తేల్చారు. ఈ కుట్రలో మొత్తం 12కోట్ల లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. కేసు నమోమైన అనంతరం రాధాక్రిష్ణ తన డ్రైవర్ ప్రవీణ్‌కుమార్ సహాయంతో సదరు పత్రాలను మొత్తం తరలించేందుకు ప్రయత్నించాడు. మరోవైపు నిమ్మల కుటుంబ సభ్యుల అరెస్టు తరువాత పరారీలో ఉన్న రాధాక్రిష్ణ కోసం గాలింపు చేపట్టిన పోలీసులు రాధాక్రిష్ణ, అతని డ్రైవర్ ప్రవీణ్‌కుమార్‌లను అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి నకిలీ ప్రభుత్వ జీవోల ప్రతులు, 5ల్యాప్‌టాప్‌లు, 12చెక్కుబుక్‌లు, 13 స్టాంపులు, 7బ్యాంకు పాస్‌బుక్కులు, నగరంలోని 31 భూములకు సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. కేసులో కీలకంగా ఉన్న మాజీ ఎమ్మెల్యే బ్రహ్మానాయుడుతో పాటు అతని సోదరుడు, మిగిలిన నిందితుల కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.

# మరో 3 రోజులు ఎండల తీవ్రత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే31:** భానుడు తన ప్రతాపాన్ని కనబరుస్తున్నాడు. ఎండల తీవ్రత కొనసాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా పగటి ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతుండటంతో ప్రజలు వడదెబ్బతో అల్లాడిపోతున్నారు. ఈ తీవ్రమైన వడగాల్పులు వీస్తున్న క్రమంలో మరో మూడ్రోజుల పాటు హీట్‌వేవ్స్ కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41-44 డిగ్రీల వరకు, కొన్నిచోట్ల 45 డిగ్రీలు దాటే అవకాశం ఉందని తెలుపుతూ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. మహబూబాబాద్, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో ఆదివారం వడగాల్పుల తీవ్రత కొనసాగింది. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాలతో పాటు నిజామాబాద్, సిద్దిపేట, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో కూడా ఎండల ప్రభావం అధికంగా ఉంది. ఈ జిల్లాల్లో తీవ్రమైన ఉక్కపోత, వేడి గాలులు వీచే ప్రమాదం ఉందని, అత్యవసరమైతే తప్ప వృద్ధులు, చిన్నపిల్లలు మధ్యాహ్నం పూట బయటకు రాకూడదని అధికారులు సూచించారు.

# ఆసిఫాబాద్ జిల్లాలో నేడు సిఎం రేవంత్ పర్యటన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే31:** కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించనున్నారు.సాయంత్రం 5:45 గంటలకు కొమరంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం కొత్తారి గ్రామానికి సిఎం చేరుకోనున్నారు.కొత్తారి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొనున్నారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవానికి పైలాన్ ఆవిష్కరణ చేస్తారు..ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో ముఖాముఖి సమావేశం నిర్వహిస్తారు. కొత్తారి గ్రామం నుంచి రోడ్డు మార్గంలో 7 గంటలకు కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్స్‌కు సిఎం చేరుకోనున్నారు. పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారు. తర్వాత కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్స్‌లో జరిగే భారీ బహిరంగ సభలో పాల్గొంటారు. బహిరంగ సభ అనంతరం కాగజ్‌నగర్ నుంచి మంచిర్యాలకు ముఖ్యమంత్రి చేరుకుంటారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ నివాసంకు చేరుకుంటారు. రాత్రి 10 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి హైదరాబాద్‌కు చేరుకుంటారు.




ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆదివారం కోల్‌కతాలో అవగాహన ప్రదర్శన దృశ్యం

# 'సాగు'తుందా!

>> మొదలు కానుంది. ఇప్పుడు చెప్పిన అంచనాలన్నీ నిజమైతే దిగుబడులు తగ్గడం ఖాయం. సాధారణంగా ఓ డిగ్రీ సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రతలు పెరిగితేనే కనీసం 10శాతం పంట దిగుబడి తగ్గుతుందని ఓ ప్రాథమిక అంచనా. దీనికి తోడు వర్షపాతం కూడా ఆశించిన స్థాయిలో లేకపోతే అది ఆహార భద్రతనే దెబ్బ తీస్తుంది.ఈ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటికే ప్రభుత్వాలు సన్నద్ధమై పంటల సాగులక్ష్యాలు నిర్దేశించుకున్నాయి. ముందుగా ఆంధ్రప్రదేశ్ విషయానికే వస్తే ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోంది.సకాలంలో ప్రాజెక్టుల ద్వారా సాగు నీరు అందించేందుకు సిద్ధమవుతోంది. వర్షపాతం తక్కువగా నమోదైనా ఉన్న నీటిని సరైన విధంగా వినియోగించుకోవాలని చూస్తోంది. అదే సమయంలో విత్తనాలు, ఎరువులు తగినంత అందుబాటులో ఉంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. 2025 ఖరీఫ్‌లో ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 72 లక్షల ఎకరాల్లో వరి, పత్తి, పప్పు ధాన్యాలు, నూనె గింజలు సాగయ్యాయి. ఈ సీజన్‌లో కూడా అదే స్థాయిలో లేదా అంత కన్నా ఎక్కువ సాగు నమోదు అవుతుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. సీజనల్ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా రూ.294 కోట్ల వ్యయంతో 7.46 లక్షల క్వింటాళ్ల విత్తనాలు రైతులకు రాయితీ ధరలకు ఏపీ ప్రభుత్వం సరఫరా చేయనుంది. వరి విత్తనాల పంపిణీ 15 రోజుల క్రితమే మొదలైంది. సీజన్‌కు ముందే ఎరువుల నిల్వలు సమకూర్చు కున్నట్టుగా ఏపీ ప్రభుత్వం చెబుతోంది. ఇక తెలంగాణ విషయానికి వస్తే ఈ ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా కోటి 34 లక్షల 66 వేల ఎకరాల విస్తీర్ణంలో సాగు చేయాలని ప్రభుత్వం లక్ష ‌ ‌ ‌ ‌ ‌ ‌ యంగా పెట్టుకుంది. అందుకోసం 19.42 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయని అంచనా వేసింది. తగ్గట్టుగా ప్రభుత్వ రంగ ఏజెన్సీల ద్వారా 38.21 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉంచింది తెలంగాణ ప్రభుత్వం. ప్రధాన వాణిజ్య పంట అయిన పత్తిని 52 లక్షల ఎకరాల విస్తీర్ణంలో సాగు చేయాలని ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. నాసిరకం విత్తనాల బెడద అరికట్టేందుకు ఇప్పటికే టాస్క్ ఫోర్స్ బృందాలు సోదాలు, దాడులు విస్తృతం చేస్తున్నాయి. మార్క్ ఫెడ్, ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీల గోదాముల్లో రసాయన ఎరువులు నిల్వలు అందుబాటులో ఉంచింది.కరవును తట్టుకుని నిలబడే,తక్కువ నీరు అవసరమయ్యే విత్తనాలు అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తోంది.ఎక్కువ నీరు వృథా కాకుండా బిందు సేద్యం వైపు మళ్లించాలనీ భావిస్తోంది. పంటమార్పిడిపైనా ఇప్పటికే అధ్యయనాలు మొదలయ్యాయి. 2015లో ఎల్‌నినో సమయంలో నైరుతి రుతుపవన కాలంలో 93 శాతం దీర్ఘకాల సగటు వర్షపాతం ఉంటుందని ఐఎండీ అంచనా వేసింది. కానీ, తర్వాత దాన్ని 88 శాతానికి సవరించింది. అయితే వాస్తవంగా నమోదైన వర్షపాతం దీర్ఘకాల సగటులో 86 శాతంగా ఉన్నట్లు వెల్లడైంది. ఫలితంగా దేశవ్యాప్తంగా తీవ్ర వర్షాభావం, కరవు పరిస్థితులు నెలకొన్నాయి.ఇప్పుడు కూడా అదే జరిగే అవకాశాలున్నాయి. ప్రాథమికంగా 92శాతం మేర వర్షపాతం నమోదవుతుందని అంచనా వేస్తున్నా అంత కన్నా తగ్గే ఆస్కారమూ ఉండొచ్చు. కేవలం వర్షాలు తగ్గడమే కాదు. వడగాలులూ పెరిగే ముప్పు ఉంటుంది. ఈ క్రమంలో కొందరు వ్యవసాయ శాస్త్రవేత్తలు పలు సూచనలు చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో రైతులు వరి పంట సాగు తగ్గించుకోవాలి అన్నది వాళ్ల ముఖ్యమైన సలహా. అంతే కాదు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి ప్రకృతి, సేంద్రియ విధానాల్లో అధిక దిగుబడి వచ్చే పప్పు ధాన్యాలు, నూనె గింజలు, చిరుధాన్యాలు పండించాలని సూచిస్తున్నారు. ఇలా సన్నద్ధమైతే ఎల్‌నినో ప్రభావం నుంచి కొంతైనా ఊరట ఉంటుందని చెబుతున్నారు. అటు కేంద్రం కూడా పంటలపై ఎల్‌నినో ప్రభావం పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పిలుపునిచ్చింది. ముఖ్యంగా పప్పు ధాన్యాలు, నూనె గింజలు పండించాలని సూచిస్తోంది. అంతే కాదు. జిల్లాల వారీగా ఎక్కడైతే ప్రభావం ఎక్కువగా ఉంటుందన్న అంచనాలుంటాయో అక్కడ ప్రత్యేక సాగు ప్రణాళికలు అవసరమని అంటోంది. ప్రత్యామ్నాయ పంటలపైనా దృష్టి సారించాలని చెబుతోంది.

# ఎండలు మండుతున్నాయ్ జాగ్రత్త!

>> నుంచి సాయంత్రం ఐదు గంటల మధ్య వీలైతే రాకపోకలు తగ్గించుకోవాలని ఆయన సూచించారు. బయటకు వెళ్లాల్సి వస్తే తాగునీరు వెంట ఉంచుకోవాలన్నారు. ఎక్కువగా నీరు తాగడం, ఎండ తీవ్రత అధికంగా ఉన్న సమయంలో బయటకు వెళ్లకుండా ఉండటం, శరీరాన్ని చల్లగా ఉంచుకోవడం వంటి చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు.ఆయా రాష్ట్రాల్లో ఎండల నుంచి రక్షణ కోసం వాడే పానీయాలు మామిడి పండ్లు, మజ్జిగ, షర్బత్, బేల్‌పనా గురించి ఆయన ప్రస్తావించారు.
భారత అథ్లెట్ గుర్విందర్ సింగ్ పై ప్రధాని నరేంద్ర మోడీ ప్రశంసలు కురిపించారు. రాంచీ లో జరిగిన జాతీయ సీనియర్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ పోటీల గురించి మన్‌కీ బాత్‌లో ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. వందమీటర్ల పరుగులో రికార్డులు సృష్టించిన అథ్లెట్లు గుర్విందర్, అనిమేష్ తో ఆయన నేరుగా మాట్లాడారు. కేవలం రెండు రోజుల్లోనే 100 మీటర్ల పరుగు పందెంలో జాతీయస్థాయిలో మూడు రికార్డులు సృష్టించామని మోడీ అన్నారు. ఈ అద్భుతమైన ఘనత సాధించిన ఇద్దరు అథ్లెట్లు గుర్విందర్‌సింగ్, అనిమేష్‌కు అభినందనలు తెలిపారు. మోడీ పర్యటన సందర్భంగా ఇటీవల అనెమంగళం రాగి శాసనాలను నెదర్లాండ్స్ ప్రభుత్వం భారత్‌కు తిరిగి అప్పగించింది. ఇది భారతీయులు గర్వించదగిన విషయమని మోడీఅన్నారు. దేశ చరిత్రకు సంబంధించిన 20 కోట్లకుపైగా చారిత్రక పత్రాలు, రికార్డులను అర్కైవ్స్ వాల్ పోర్టల్ ద్వారా డిజిటల్ రూపంలో అందుబాటులోకి తీసుకొచ్చిందని వివరించారు. ఉత్తరప్రదేశ్‌లోని ఒకాలువలో చిక్కుకుపోయిన డాల్ఫిన్‌ను కొందరు దాదాపు 13 గంటలపాటు శ్రమించి రక్షించారు. దీనికి సంబంచిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. ప్రధాని మోడీ ఈ సంఘటనను కూడా మన్‌కీ బాత్‌లో ప్రస్తావించారు. గంటలపాటు శ్రమించి డాల్ఫిన్‌ను కాపాడిన వారిని అభినందించారు. ఈ సహాయక చర్యల్లో కేంద్రం కొత్తగా ప్రవేశపెట్టిన డాల్ఫిన్ అంబుల్స్ కీలకపాత్ర పోషించినట్లు తెలిపారు. కేరళలోని ఆలువా ప్రాంతంలో స్విమ్మింగ్ క్లబ్ సేవలను మోడీప్రశంసించారు. ఈ క్లబ్ ద్వారా ఇప్పటి వరకు 15 వేల మందికి పైగా శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.

# పార్టీ సమావేశానికి 60 మంది టిఎంసి ఎమ్మెల్యేలు డుమ్మా!

## మాజీ సిఎం మమతా బెనర్జీకి షాక్

**కోల్‌కత్తా, మే 31:** టీఎంసీ అధినేత్రి మాజీ సీఎం మమతా బెనర్జీకి సొంత పార్టీ ఎమ్మెల్యేలే షాకిచ్చారు. తననివాసంలో పార్టీ ఎమ్మెల్యేలతో ఆదివారం నిర్వహించిన సమావేశానికి ఏకంగా 60 మంది ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టారు. 20 మంది ఎమ్మెల్యేలు మాత్రమే హాజరయ్యారు. దీంతో ఏకంగా ఈ సమావేశాన్ని రద్దు చేస్తూ పార్టీ నిర్ణయం తీసుకుంది. ఈ సమావేశం గురించి పార్టీ ఎమ్మెల్యేలకు ముందుగానే సమావేశం అందింది. టీఎంసీ లెజిస్లేటివ్ పార్టీ లీడర్ షోవన్‌దేవ్ ఛట్టోపాధ్యాయ్ అందరికీ సమావేశం గురించి చెప్పారు. కోల్‌కతాలోని, కాలిఘాట్‌లో ఉన్న పార్టీ అధినేత్రి మమత నివాసంలో, ఆమె ఆధ్వర్యంలోనే ఆదివారం



సమావేశం ఉంటుందని ఆయన అందరికీ చెప్పారు. 80 మంది ఎమ్మెల్యేలకు సమాచారం అందిస్తే 20 మంది మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. ఈ రోజు హాజరైన వారితో మమత కొద్దిసేపు మాట్లాడినట్లు తెలుస్తోంది. ఈ పరిణామంపై టీఎంసీ స్పందించింది. అభిషేక్ బెనర్జీపై శనివారం, కల్యాణ్ బెనర్జీపై ఆదివారం దాడి జరిగిన నేపథ్యంలో, తమ నేతలపై వరుసగా జరుగుతున్న దాడులకు భయపడి ఎమ్మెల్యేలు ఈ సమావేశానికి రాలేదని పార్టీ అగ్రనాయకత్వం తెలిపింది. దీనంతటికీ కారణం బీజేపీనే అని విమర్శించింది. నిజంగానే ఎమ్మెల్యేలు దాడులకు భయపడి రాలేదా లేదా పార్టీ అధినాయకత్వంపై ఆగ్రహంతో ఉన్నారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. టీఎంసీ నేతలు ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్నారు. కొందరు తమ పార్టీ పదవులకు రాజీనామా చేస్తున్నారు. దీంతో టీఎంసీలో ఎంతమంది నేతలు కొనసాగుతారనేది అనుమానాస్పదమే. మరోవైపు బీజేపీ చేస్తున్న దాడులకు నిరసనగా జూన్ 2న రాష్ట్రవ్యాప్తంగా టీఎంసీ నేతలు ఆందోళన నిర్వహించనున్నారు. మమతా బెనర్జీ కూడా ఈ నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటారు.

# ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ అమలుకు కసరత్తు

## హెల్త్ కేర్ ట్రస్ట్ కమిటీ నేడు ఖరారు

## అధికారులతో సమీక్షించనున్న సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 31:** తెలంగాణ ఉద్యో గులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రతకు సంబంధించి ప్రభుత్వం అమల్లోకి తీసుకువస్తున్న ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ అమలుకు సంబంధించి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించనున్నారు. ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్ ద్వారా ఈ పథకం అమలు కానుంది. ఈ పథకానికి సంబంధించి ఉద్యోగ సంఘాల నుంచి ఆరుగురు, పెన్షనర్ల నుంచి ఇద్దరు ప్రతినిధులు ఈ ట్రస్ట్ సభ్యులుగా ఉంటారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి ఒకరిని ఈ ట్రస్టుకు సీఈవోగా నియమిస్తారు. ఈ కమిటీని సోమవారం ప్రకటించే అవకాశం ఉంది. ఈ పథకం అమలుకు అవసరమైన వివరాల సేకరణ ఇప్పటికే ప్రారంభమైంది. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యుల వివరాలను సేకరించేందుకు ఫైనాన్స్ శాఖ ఇప్పటికే అన్ని శాఖలకు సర్క్యులర్ జారీ చేసింది. మే 31వ తేదీ(ఆదివారం)లోపు డేటా అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేసింది. ఈ వివరాల ఆధారంగా డిజిటల్ హెల్త్ కార్డులు, క్యాష్‌లెస్ చికిత్స సేవలు అందించేలా ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుంది. మరోవైపు ఉద్యోగులు, పెన్షనర్లకు ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ కింద సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం డిజిటల్ హెల్త్ కార్డులు జారీ చేసేందుకు సిద్ధమైంది. ఈ మేరకు ఇప్పటికే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల వివరాల సేకరణ ప్రారంభమైంది. మే 31లోగా డేటా అప్‌లోడ్ చేయాలని గతంలోనే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఆదివారం ఆ గడువు ముగిసింది. డేటా అప్‌లోడ్ తర్వాత హెల్త్ కారులు మంజూరు అయ్యే అవకాశం ఉంది. కాగా, ఈ పథకం ద్వారా నగదు రహిత వైద్య సేవలను ప్రభుత్వం అందించనుంది. దీని ద్వారా ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం భరోసా కల్పించనుంది.

# నేడు సిట్ విచారణకు ప్రభుత్వ విప్ యెన్నం

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి సోమవారం సిట్ అధికారుల ఎదుట విచారణకు హాజరు కానున్నారు. ఈ మేరకు ఆయనకు బుధవారం నాడు సిట్ ఎసిపి వెంకటగిరి నోటీసులు జా రీ చేయడం తెలిసిందే. గతంలో ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి పోలీసులకు ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నాయకుల్లో శ్రీనివాస్ రెడ్డి కూడా ఒక రు. గత అసె ంబ్లీ ఎన్నికల సమయంలో తన ఫోన్ కూడా ట్యాపింగ్‌కు గురయ్యిందని శ్రీనివాస్ రెడ్డి పోలీసులకు అనేకమార్లు ఫిర్యాదు చేశా రు. కాగా ఈ కేసు విచారణలో శ్రీనివాస్ రెడ్డి ఫోన్ ట్యాపింగ్‌కు గురైనట్లు తేలింది. దీనిపై సిట్ అధికారులు గత ఏడాది జూలై ఏడవ తేదీన శ్రీనివాస్ రెడ్డికి మొదటిసారి నోటీసులు ఇవ్వగా అనివార్య కారణాలతో ఆయన హాజరుకాలేదు. దీంతో తాజాగా ఆయ నకు మరోసారి నోటీసులు ఇచ్చారు. శ్రీనివాస్ రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకుల ఫోన్‌లను అప్పట్లో ట్యాపింగ్ చేశారని ఈ కేసును విచారిస్తున్న సిట్ తేల్చింది. ఇందులో భాగంగా ఇప్పటికే పలువరు బాధితుల నుంచి వాంగ్మూలం తీసుకున్న సిట్ తాజాగా శ్రీనివాస్ రెడ్డికి నోటీసులు జారీ చేసింది. కమాండ్ కంట్రోల్‌లోని 18వ అంతస్తులో గల సిట్ కార్యాలయంలో శ్రీనివాస్ రెడ్డిని సిట్ అధికారులు విచారించనున్నారు.

# రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్‌పై అధికారికంగా ప్రకటించాలి: కవిత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 31:** రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అంశంపై మీడియా చిట్‌చాట్‌లో మాట్లాడటం కాదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారికంగా ప్రకటించాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యా లయంలో ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయానికి మీటర్లు బిగించేది లేదని కూడా ప్రభుత్వం స్పష్టంగా చెప్పాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలతో ముందుకెళుతున్నాయని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కొత్తగా రైతు డిస్కం ఏర్పాటు చేయడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని కవిత ఆరోపించారు. ఈ పేరుతో మిగిలిన రెండు డిస్కంలను ప్రైవేటుపరం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఈ కుట్రను అడ్డుకోవడానికి అవసరమైతే సుప్రీంకోర్టు వరకు వెళతామని హెచ్చరించారు. అదేవిధంగా, కేంద్రం తీసుకొచ్చిన కొత్త సోలార్ జీవో కేవలం బడా కార్పొరేట్ సంస్థలకే మేలు చేస్తుందని ఆమె విమర్శించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును దసరా నాటికి ప్రతి పాదించకపోతే, తాను పాదయాత్ర చేపడతానని కవిత హెచ్చరించారు. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో 18 రోజుల పసికందు చేయి కోల్పోయిన ఘటనపై కవిత తీవ్రంగా స్పందించారు. ఇది చాలా దారుణమని, దీనికి ముఖ్యమంత్రి, జిల్లా మంత్రులే బాధ్యత వహించాలన్నారు. ఆ చిన్నారి పేరిట ప్రభుత్వం రూ.25 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని డిమాండ్ చేశారు.

# మరో రూ.4 వేల కోట్ల సమీకరణ

## రిజర్వ్ బ్యాంక్‌కు రాష్ట్ర ఆర్థిక శాఖ ఇండెంట్

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** మరో రూ.4 వేల కోట్ల రుణాన్ని సమీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుక కోసం రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియాకి ఇండెంట్ పంపింది. జూన్ నెల 2వ తేదీన బహిరంగ మార్కెట్లో నిర్వహించే వేలంలో రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్ల ద్వారా ఈ నిధులను సమీకరించేందుకు రిజర్వ్ బ్యాంక్‌కు సమర్పించిన ఇండెంట్‌లో రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రతిపాదించింది. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.82 వేల కోట్లు రుణంగా తీసుకోవాలని వార్షిక అంచనా బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇందులో వడ్డీలు, అసలు చెల్లింపులకే రూ. 44,329 కోట్లను అంచనా వేసింది.

# నేటితో ముగియనున్న పిజి ఇసెట్ పరీక్షలు

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** ఇంజనీరింగ్ పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పీజీ ఈ సెట్-2026 పరీక్షలు నేటితో ముగియనున్నాయి. ఈ నెల 29 నుంచి పరీక్షలు జరుగుతున్న విషయం తెలిసిందే. మొదటి రోజు పరీక్షలకు 88 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. రెండో రోజు పరీక్షలకు 78 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. మూడో రోజైన ఆదివారం జరిగిన పరీక్షలకు 67.70 శాతం మంది హాజరయ్యారు. నేటితో పరీక్షలు ముగియనున్నాయి. మొత్తం 19 పీజీ ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవే శాల కోసం 26,085 మంది దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షల నిర్వహణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా 31 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆదివారం ఉద యం సెషన్‌కి 61.19 శాతం మంది పరీక్షలకు హాజరయ్యారని పీజీ ఈ సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ డాక్టర్ కె వెంకటేశ్వర రావు ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం సెషన్‌కు 74.55 శాతం మంది హాజరయ్యారని తెలిపారు.

# 16 నుంచి 22 వరకు టెట్ పరీక్షలు

## మొత్తం 1,36,418 దరఖాస్తులు

## ఇన్‌సర్వీస్ టీచర్ల నుంచి 28,149 దరఖాస్తులు

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్)- 2026 పరీక్షలను జూన్ 16 నుంచి నిర్వహించనున్నారు. జూన్ 22 వరకు పరీక్షలను 5 రోజుల పాటు 10 సెషన్‌లలో నిర్వ హించ నున్నారు. ఇందుకు సంబంధించిన పరీక్షల షెడ్యూల్‌ను టెట్- 2026 కన్వీనర్ జి రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకి సంబంధించి ఉదయం సెషన్‌ను 9 గంటల నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం సెషన్‌ను 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,36,418 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తు చేసుకున్న వారిలో ఇన్‌సర్వీస్ టీచర్ల నుంచి 28,149 దరఖాస్తులు వచ్చాయి. 5 దర ఖాస్తులు ట్రాన్స్ జెండర్ల నుంచి వచ్చాయి. 1,36,418 దరఖాస్తుల్లో పేపర్-1కి 32,779 దరఖాస్తులు రాగా, పేపర్-2కి 86,305 దరఖాస్తులు వచ్చాయి. రెండు పేపర్లకు 17,334 దరఖాస్తులు వచ్చాయి. 28,149 ఇన్‌సర్వీస్ టీచర్లలో పేపర్-1కి 7,678 దరఖాస్తులు రాగా, పేపర్-2కి 20,471 దరఖాస్తులు వచ్చాయి. పేపర్-2లో మ్యాథ్స్ అండ్ సైన్స్‌కి 11,343 దరఖాస్తులు రాగా, పేపర్-2 సోషల్ స్టడీస్‌కి 9,128 దరఖాస్తులు వచ్చాయి.

# ఆ భూమిలోని నిర్మాణాలను పునరుద్ధరించండి

## హైడ్రాకు హైకోర్టు ఆదేశం

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** హైదరాబాద్ కూకట్‌పల్లి పరిధిలో ఉన్న ఎన్వీఎన్ కన్‌స్ట్రక్షన్‌కు చెందిన స్థలంలో హైడ్రా చర్యలపై హై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇదే స్థలానికి సంబంధించి వివిధ ఉత్తర్వులున్నప్పటికీ, వాటిని పట్టించుకోకుండా రాత్రికి రాత్రి కూల్చివేతలు చేపట్టడాన్ని తప్పుబట్టింది. హైడ్రాకు ఇలాంటి చర్యలు కొత్త కాదని, కూల్చివేయడం, ఆ తర్వాత కంచె వేసి బోర్డు పెట్టడం, చర్యను సమర్థించుకోవడం, కోర్టు ఉత్తర్వులను అమలు చేయకుండా తప్పిం చుకోవడానికి ప్రయత్నించడం హైడ్రాకు మామూలైపోయిందని హైకోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది. పిటిషనర్లు సమర్పించిన ఫొటోలు, ఇతర ఆధారాలను పరిశీలిస్తే హైడ్రా నిబంధనలకు విరుద్ధంగా వ్యవ హరించినట్లు అర్థమవుతోందని, నిబంధనలకు వ్యతిరేకంగా హైడ్రా ప్రయోజనాలు పొందాలనుకుంటే మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసే అధికారం కోర్టుకు ఉందని పేర్కొంది. కూకట్‌పల్లిలోని సర్వే నెంబర్ 1003 నుంచి 1006 వరకు ఉన్న 13.17 ఎకరాల భూమిలో ఈ నెల 25కు ముందు ఎలా ఉందో అలా పునరుద్ధరించాలంటూ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి, కలెక్టర్‌ను హైకోర్టు ఆదేశించింది. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తమ భూమిలోకి వచ్చి ఫెన్సింగ్ కూల్చివేయడాన్ని సవాల్ చేస్తూ ఎన్వీఎన్ కన్‌స్ట్రక్షన్ హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసింది. సెక్యూరిటీ గదులు, ప్రవేశ ద్వారాలను కూల్చివేయడంతో పాటు విద్యుత్ సరఫరా నిలిపేశారంటూ పిటిషనర్ తరఫు న్యాయవాది హైకోర్టుకు తెలిపారు. ఇదే భూమి విషయంలో గతంలో హైకోర్టులో నమోదైన పిటిషన్ల విచారణలో భాగంగా కుంట, శిఖం భూమి అనడానికి ఎలాంటి ఆధారాలు లేవని నీటి పారుదల శాఖ, రెవెన్యూ శాఖాధికారులు అఫిడవిట్ దాఖలు చేశారని వాదించారు. 2008లోనే రూ.9 కోట్లకు పైగా చెల్లించడంతో అప్పటి ప్రభుత్వం భూమిని తమకు కేటాయిస్తూ జీవో విడుదల చేసిందన్నారు. హైడ్రా మాత్రం వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకోకుండా కూల్చివేతలు చేపట్టిందని వాదించారు. ఖానామెట్ పరిధిలోకి ఉన్న భూమిని తప్పుడు సర్వే నెంబర్లతో ఆక్రమించుకున్నారని ప్రభుత్వ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఇరువైపులా వాదనలు విన్న హైకోర్టు 24 గంటల్లోపు భూమిని యథావిధిగా ఉంచి, హైడ్రా ఏర్పాటు చేసిన బోర్డులు తొలగించాలని ఆదేశించింది. ఒకవేళ హైడ్రా చేయకపోతే పిటిషనరే పనులు చేయించుకొని ఆ డబ్బులను హైడ్రా అధికారుల సొంత ఖాతా నుంచి తీసుకోవాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 4వ తేదీకి వాయిదా వేసింది.

# కాళేశ్వరంలో భక్తజన సంద్రం



## ఆదివారం సెలవు కావడంతో

## ముక్తీశ్వర క్షేత్రానికి భారీగా తరలివచ్చిన భక్తులు

## త్రివేణి సంగమంలో పవిత్ర స్నానాలు, పితృ తర్పణాలు

**మహాదేవపూర్, మే 31, ప్రభాతవార్త:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరం భక్తజన సంద్రంగా మారింది. సరస్వతి అంత్య పుష్కరాల వేడుకలు ముగింపు దశకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా 11వ రోజైన ఆదివారం సెలవు దినం కావడంతో తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి భక్తులు భారీ ఎత్తున తరలివచ్చారు. గోదావరి, ప్రాణహిత, అంతర్వాహిని సరస్వతి నదుల కలయిక అయిన త్రివేణి సంగమ తీరం భక్తుల రాకతో కిక్కిరిసిపోయింది. పితృదేవతలకు తర్పణాలు పుష్కర స్నానాల కోసం తెల్లవారుజామున 4 గంటల నుంచే భక్తులు నదీ తీరానికి చేరుకున్నారు. పవిత్ర త్రివేణి సంగమంలో స్నానాలు ఆచరించి, నదీ మాతకు ప్రత్యేక హారతులు ఇచ్చారు. అంత్య పుష్క రాల వేళ నదీ స్నానం చేసి పితృదేవతలకు పిండప్రదానాలు చేయడం అత్యంత పుణ్య దాయక మని భక్తుల నమ్మకం. దీంతో తీరం పొడవునా బ్రాహ్మణుల సమక్షంలో భక్తులు తమ పితృ దేవతలకు తర్పణా లు, శ్రాద్ధ కర్మలు భక్తిశ్రద్ధలతో నిర్వహిం చారు. పుష్కర స్నానాల అనంతరం భక్తులు కాళేశ్వర ముక్తీశ్వర స్వామివారి దర్శనానికి తరలి వచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం మొత్తం భక్తులతో కిక్కిరిసిపోయింది. స్వామివారి ఉచిత దర్శనంతో పాటు శీఘ్ర దర్శనం క్యూ లైన్లు భక్తులతో నిండిపోయాయి. స్వామివారి దర్శనం కోసం భక్తులు గంటల తరబడి క్యూ లైన్లలో ఓపికగా వేచి ఉన్నారు. ఒకే పీఠంపై యమధర్మరాజు, పరమ శివుడు కొలువై ఉన్న ఈ క్షేత్రంలో స్వామివారిని దర్శించుకుంటే యమగండాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లుభక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ ఈఓ, అర్చకులు, అధికారులు ప్రత్యేకఏర్పాట్లు చేశారు. భక్తులకు తాగునీరు, మజ్జిగ పంపిణీ చేశారు. స్వామివారికి, అమ్మవారికి అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, పుష్కర అర్చనలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా పోలీస్ శాఖ గట్టి బందోబస్తు ఏర్పాటు చేసింది. నదీ తీరంలో ప్రమాదాలు జరగకుండా లైఫ్ గార్డులను, జాలర్లను అందుబాటులో ఉంచారు.

# సింగరేణిలో కార్మిక కుటుంబాలకు బీమా రక్షణ

## రూ.1.25 కోట్ల వరకు ప్రమాద బీమా

## ఇప్పటిదాకా 45 కుటుంబాల్లో వెలుగు

## సంస్థ సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ చొరవతో సింగరేణిలో ప్రవేశపెట్టిన ఉచిత ప్రమాద బీమా పథకం మరణించిన కార్మికుల కుటుంబాల్లో వెలుగులు నింపుతోంది. చనిపోయిన కార్మికుని లేని లోటు తీర్చలేకపోయినా, అతనిపై ఆధారపడిన కుటుంబాన్ని మాత్రం ఆర్థికంగా ఆదుకుంటోంది. ఈ విధంగా ఈ బీమా పథకం ద్వారా ఇప్పటి వరకూ 40 మందికి పైగా కుటుంబాలకు ఆర్థిక భరోసాను కల్పించినట్లు సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి తెలిపారు. ఈ మేరకు ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో దేశంలో తొలిసారిగా రూ.1.25 కోట్ల రూపాయల ప్రమాద బీమా పథకాన్ని సింగరేణి అమలు చేసింది. 2024లో ప్రారంభమైన ఈ పథకం ఇప్పుడు దేశవ్యాప్తంగా బీమా రంగంలో ఒక విప్లవాత్మక చర్యగా మారింది. బొగ్గు కంపెనీలతో పాటు, ఇతర సంస్థలు కూడా ఈ ప్రమాద బీమా పథకాన్ని అమలు చేయడానికి సింగరేణి సంస్థ స్ఫూర్తిగా నిలిచింది. సింగరేణి ఉద్యోగులు తమ శాలరీ ఖాతాలు కలిగి ఉన్న పలు బ్యాంకుల వారు ఈ ప్రమాద బీమా పథకాన్ని అమలవుతోంది. పిఐబి, బిఒబి, ఐఒబి (బ్యాంకులు) ప్రమాద బీమా పథకం కింద రూ.1.25 కోట్లను చెల్లించేందుకు ఒప్పందం చేసుకున్నాయి.

ఎక్కువ మంది కార్మికులు శాలరీ ఖాతాలు కలిగి ఉన్న ఎస్‌బిఐ, యుబిఐ, కెనరా బ్యాంకులు రూ.కోటి ప్రమాద బీమా చెల్లింపు జరుపుతున్నాయి. ఈ విధంగా బీమా పథకం మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ.1 కోటి నుండి రూ.1.25 కోట్ల వరకు అందజేయడంతో వాటికి ఆర్థికంగా ఊరట లభిస్తుంది. ఈ బీమా పథకం కింద రెండేళ్లలో మృతి చెందిన 32 మంది ఉద్యోగుల కుటుంబాలకు సుమారు రూ.28 కోట్లను ఎస్‌బిఐ, యుబిఐ 13 మందికి సుమారు రూ.13 కోట్ల చెల్లించింది. ప్రమాదంలో మృతి చెందిన వారికే కాకుండా కాళ్లు, చేతులు, ఇతర అవయవాలు ప్రమాదానికి గురై పాక్షిక, శాశ్వత అంగ వైకల్యం చెందినప్పటికీ ప్రమాద బీమా పథకం అమలు చేస్తున్నారు. అలాగే సింగరేణిలో దాదాపు 30 వేల మంది పొరుగు సేవల సిబ్బంది సంక్షేమం విషయంలోనూ దృష్టి సారించింది. వీరి కుటుంబాలకు కూడా బీమా ద్వారా భద్రత కల్పించేందుకు రూ.40 లక్షల ప్రమాద బీమా అమలవుతోంది. ఇక సంస్థలో పదవీ విరమణ పొందిన వారికి కూడా ఈ ఉచిత ప్రమాద బీమాను కొనసాగించేలా చూడాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు యాజమాన్యంతో సంప్రదింపులు జరిగింది. దీంతో చాలా బ్యాంకులు పదవీ విరమణ పొందిన ఉద్యోగులు తమ పింఛన్‌ను తమ బ్యాంక్ ద్వారా పొందిన పక్షంలో రూ.30 లక్షల నుంచి రూ.కోటి వరకు ఉచిత బీమా వర్తింపజేయడానికి బ్యాంకులు అంగీకరించినట్లు తెలిపారు.

# అమెరికాలోని లూసియానాలో విషాదం

# ముగ్గురు స్నేహితులను కాపాడి ప్రాణాలు కోల్పోయిన నగర యువకుడు

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** అమెరికాలోని లూసియానాలో విషాద ఘటన చోటుచేసుకుంది. అమెరికా లూసియానాలోని టొరోడో పార్క్‌లో ఉన్న సెబాన్ రివర్‌లో సరదాగా స్నేహితులతో ఈత కొట్టేం దుకు కోడూరు అనురూప్‌రెడ్డి వెళ్లారు. ఈతకొట్టే సమయంలో అతనితోపాటు మరో ముగ్గురు స్నేహితులు ఉన్నారు. హఠాత్తుగా ముగ్గురు స్నేహితుల్లో ఒక్కొక్కరు లోతు ప్రదేశంలోకి వెళుతూ రక్షించండి అంటూ హాహాకారాలు చేశారు. గమనించిన అనురూప్‌రెడ్డి ఆ ముగ్గురిని ఒక్కొక్కరిని పైకిలాగుతూ ఒడ్డుకు చేర్చారు. అనంతరం అనురూప్‌రెడ్డి పైకి వచ్చే క్రమంలో అనూహ్యంగా చెరువులో ఉన్న ఫిషింగ్ వైరు కాలికి చుట్టుకుంది. పైకి రావడం ఇబ్బందికరంగా మా రింది. అదే సమయంలో నీటి ప్రవాహం పెరగడంతో అనురూప్‌రెడ్డి అందులోనే మృత్యువాతపడ్డాడు. ఒడ్డున ఉన్న స్నేహితులు, అక్క డున్న ఇతర ఈతగాళ్లు రక్షించే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే జరగాల్సి న నష్టం జరిగింది. అనురూప్‌రెడ్డిని స్థానిక ఆసుపత్రికి తరలించి చికిత్స అందించినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. అప్పటికే అను రూప్ మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. టీం ఎయిడ్ అనే స్వచ్ఛంద సంస్థ, ఇండియన్ ఎంబసీ, లూసియానా కాన్సులేట్‌లు సంయుక్త సహకారాలు అందించి, మరో వారంరోజుల్లో అతని



అనురూప్‌రెడ్డి(ఫైల్)

మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించనున్నారు.

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కవాడిపల్లికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి కోడూరు రాజేందర్‌రెడ్డి, దుర్గాభవాని దంపతులకు అనురూప్‌రెడ్డి రెండో సంతానం. మొదటి కుమారుడు అశ్రీత్‌రెడ్డి 2023లో అమెరికా వెళ్లగా, అనురూప్‌రెడ్డి సైతం 2024లో అమెరికాకు వెళ్లారు. యూనివర్సిటీ ఆఫ్ నార్త్ టెక్సాస్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ మాస్టర్స్ గ్రాడ్యుయేషన్‌ను గత నెల మేలో పూర్తి చేసిన అనురూప్‌రెడ్డి, స్నేహితులతో కలిసి సరదాగా టోలేడో పార్కులో సేద తీరేందుకు వెళ్లారు. జూన్ నుంచి ఉద్యోగ అన్వేషణ చేయాల్సి న క్రమంలో సరదాగా గడిపే ఉద్దేశంగా క్యాంపింగ్ వెళ్లిన వారు ఇలా విగత జీవిగా మారడంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అనురూప్‌రెడ్డిని ఇలా చూస్తామనుకోలేదని అతడి సోదరుడు కన్నీరు పెట్టుకున్నారు. అనురూప్‌రెడ్డికి ఫొటోగ్రఫీ అంటే ఎంతో ఇష్టం. సామాజిక సేవా కార్య క్రమాల్లోనూ చురుగ్గా పాల్గొనేవాడు. స్నేహితుల కోసం తన ప్రాణాలను పణంగా పెట్టడం ప్రతి ఒక్కరిని కలచివేస్తుంది.

కుమారుడి జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ తల్లిదండ్రులు దుర్గ భవాని, రాజేందర్‌రెడ్డి తీవ్రవిషాదంలో మునిగిపోయారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన వీరి కుటుంబం హైదరాబాద్‌లో స్థిరాస్తి వ్యా పారం చేసేందుకు రెండు దశాబ్దాల క్రితం వచ్చారు. కుటుంబం మొత్తం హైదరాబాద్‌లోనే స్థిరపడ్డారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కవాడిపల్లి గ్రామంలో వారి తల్లిదండ్రులు నివాసం ఉంటున్నారు. కుమారుడి మరణవార్త తెలియడంతో కవాడిపల్లిలోని అనురూప్‌రెడ్డి ఇంటి వద్ద విషాదఛాయలు అలముకున్నాయి.

# రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.1,698.96 కోట్లు

## 24.2 శాతం వృద్ధి నమోదైందన్న ఆర్థిక శాఖ

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా త్వరలో భూములకు సంబంధించిన మార్కెట్ విలువలు పెరుగుతాయనే నేపథ్యంలో రాష్ట్ర ఖజానాకు సమకూరే ఆదాయంలో పెరుగుదల చోటు చేసుకుంది. ఇందులో భాగంగా మే నెలలో రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం గణనీయంగా పెరిగినట్లు ఆర్థిక శాఖ లెక్కలు వెల్లడిస్తున్నాయి. గత ఏడాది అదే నెలలో వచ్చిన ఆదాయంతో పోల్చితే ఈ సారి 24.2 శాతం వృద్ధి రేటు నమోదైంది.

ఈ యేడాది మే నెలాఖరుకు వచ్చిన ఆదాయం రూ.1,698.96 కోట్లుగా రికార్డయింది. అదే గత ఏడాది మే నెలలో ఇదే కాలానికి వచ్చిన ఆదాయం రూ.1,367.93 కోట్లు. గతేడాదితో పోల్చితే ఈసారి అదనంగా రూ.331.03 కోట్లు ఆదాయం సమకూరింది. అయితే రిజిస్ట్రేషన్ అయిన డాక్యుమెంట్ల పరంగా చూస్తే మాత్రం కొంత తగ్గుదల కనిపిస్తోంది. 2025 మే నెలలో 1.48 లక్షల దస్తావేజులు రిజిస్ట్రేషన్ కాగా, ఈ ఏడాది ఆ సంఖ్య 1.47 లక్షలకు పరిమితం అయింది. ఈ విధంగా దస్తావేజుల సంఖ్య దాదాపు వెయ్యి తగ్గినప్పటికీ, ఆదాయ పరంగా మాత్రం పెరగడం అధిక విలువ కలిగిన ఆస్తుల రిజిస్ట్రేషన్లు పెరిగినట్లు తెలుస్తోంది. దీంతో పాటు, త్వరలో మార్కెట్ విలువల పెంపు ఉంటుందనే ప్రచారం రాష్ట్రంలో విస్తృతంగా సాగుతుండటంతో. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్, మే రెండు నెలల్లో రిజిస్ట్రేషన్ల శాఖ రూ.3,107.31 కోట్ల ఆదాయాన్ని సాధించింది. గతంతో పోల్చితే ఈ ఏడాది ఇది రూ.624.38 కోట్ల వృద్ధి కనిపించింది. ఇక జూన్ నెలలో ఈ ఆదాయం మరింత పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

# నేడు జెఇఇ అడ్వాన్స్‌డ్ 2026 ఫలితాలు

## విడుదల చేయనున్న ఐఐటి రూర్కీ

## రేపటి నుంచి జోసా కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** మే 17న దేశవ్యాప్తంగా జరిగిన జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఫలితాలను నేడు(సోమవారం-జూన్1) విడు దల చేయనున్నారు. ఐఐటీల్లో బీటెక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం దేశ వ్యాప్తంగా నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామ్(జేఈఈ) అడ్వాన్స్‌డ్-2026 పరీక్షను మే 17న నిర్వహించిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించిన ఫలితాలను పరీక్షను నిర్వహించిన ఐఐటీ రూర్కీ నేడు విడుదల చేయనుంది. జేఈఈ అడ్వాన్స్‌డ్‌కి దేశ వ్యాప్తంగా సుమారు 1.80 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు.

వారిలో సుమారు 85 శాతం మంది పరీక్షలకు హాజర య్యారు. 2025-26 విద్యా సంవత్సరంలో 23 ఐఐటీల్లో 18,160 ఐఐటీ సీట్లు అందుబాటులో ఉండగా ఈ ఏడాది అదనంగా మరో 300 సీట్లు పెరిగే అవకాశమున్నట్టు తెలుస్తోంది. మే 17న నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్‌కి సంబంధించి మే 21న వెబ్‌సైట్లో అభ్యర్థుల ఓఎంఆర్ పత్రాలను అందుబాటులో ఉంచారు. మే 25న ప్రాథమిక కీ విడుదల చేశారు. నేడు ఫైనల్ కీతోపాటు తుది ఫలితాలను విడుదల చేయనున్నారు. రేపటి(జూన్ 2) నుంచి జాయింట్ సీట్ అలకేషన్(జోసా) కౌన్సెలింగ్‌ను ప్రారంభించి విడతల వారీగా జులై 24 వరకు కొనసాగించనున్నారు.

# ఢిల్లీ ఉగ్రకుట్ర వెనుక గజఉగ్రవాది షాజాద్‌బట్టి హస్తం

## సోషల్ మీడియా ద్వారా యువతను టెర్రరిజం వైపు మళ్లిస్తున్న వైనం

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** దేశ రాజధాని ఢిల్లీలో వెలుగు చూసిన ఉగ్రదాడుల కుట్ర వెనుక పాకిస్తాన్‌కు చెందిన గజ ఉగ్రవాది షాజా ద్ బట్టి హస్తం వుందని ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసుల విచారణలో తేలింది. సోషల్ మీడియా ద్వారా యువతను బట్టి ఉగ్రవాదం వైపు మళ్లిస్తు న్నట్లు పోలీసులు గుర్తించారు. శనివారం నాడు ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు తొమ్మిది మంది పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులను అరెస్టు చేయడం తెలిసిందే. వీరిని రహస్య ప్రాంతంలో విచారిస్తున్నారు. ఈ సందర్భంగా అరెస్టయిన ఉగ్రవాదుల నుంచి హ్యాండ్ గ్రేనేడ్లు, గ్లాక్ పిస్టళ్లు తూటా లు, భారీగా పేలుడు పదార్థాలను జప్తు చేయడం విదితమే. ఢిల్లీలోని ప్రముఖులు నివసించే ప్రాంతాలతో పాటు రక్షణ, పోలీసు బలగాలు వుం డే ప్రదేశాలు, ప్రార్థనా స్థలాల వద్ద పేలుళ్లకు ఉగ్రవాదులు కుట్ర పన్నగా వాటిని ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు చివరి నిమిషంలో భగ్నం చేయ డంతో పెద్ద ప్రమాదం తప్పింది. కాగా ఈ కుట్ర భగ్నం కావడం వెనుక పాక్‌లో తల దాచుకున్న అండర్ వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం హస్తం వుండగా దీనిని అమలు చేసేందుకు దుబాయ్, టర్కీ కేంద్రంగా ఉగ్రవాద కార్యకలాపాలు సాగించే తన అనుచరుడు సలీం డోలాకు దావూద్ అ ప్పగించిన విషయాన్ని పోలీసులు రట్టుచేశారు. టర్కీలో వున్న డోలాను అక్కడి పోలీసులు బహిష్కరించగా అతన్ని భారత్‌కు రప్పించిన హోం శాఖ దీనిపై లోతుగా విచారించగా ఢిల్లీ కుట్ర కేసు రట్టయ్యింది. కాగా ఇదే కేసులో ఆదివారం నాడు మరికొన్ని విషయాలు వెలుగు చూశాయి. పాక్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌కు చెందిన బట్టీ ఈ పేలుళ్లకు సూత్రధారిగా వ్యవహరించి. ఇందుకు అవసరమయ్యే నిధులను సమకూర్చినట్లు పో లీసుల విచారణలో తేలింది.



333 అనే హ్యాండిల్‌తో సోషల్ మీడియా నెట్‌వర్క్‌ను నిర్వహించే బట్టి జమ్మూ కాశ్మీర్‌కు చెందిన యువతను పథ కం ప్రకారం వలవేసి వారిని ఉగ్రవాదం వైపు మళ్లిస్తున్నట్లు తేలింది. బట్టికి పాక్‌లో సోషల్ మీడియాలో మంచి పాలోయింగ్ వుందని పోలీసు లు తేల్చారు. మొదట దొంగగా వున్న ఇతను 2015లో ఉగ్రవాదం వైపు మళ్లి పాక్‌లోని పలు ఉగ్రవాద సంస్థల్లో శిక్షణ పొంది భారత్‌లో విచ్ఛి నకర కార్యకలాపాలకు శ్రీకారం చుట్టాడని తేలింది. 2015లో దుబాయ్ పారిపోయిన బట్టి అక్కడి నుంచి ఐఎస్ఐ హ్యాండ్లర్లతో నిత్యం టచ్‌లో వుంటున్నట్లు తేలింది. దుబాయ్‌లో పాక్ ఉగ్రవాదులు అబిద్ జాట్, అజ్మల్ గుజ్జర్ సహా పలువురితో మంచి సంబంధాలు కలిగివున్నట్లు పోలీ సులు తేల్చారు.

డబ్బుతో పాటు కీర్తి ప్రతిష్టల ఆశచూపి సోషల్ మీడియా ద్వారా బట్టి జమ్మూ కాశ్మీర్ యువతను ఉగ్రవాదం వైపు ఆకర్షిస్తున్న ట్లు పోలీసుల విచారణలో తేలింది. ఒకసారి తనతో టచ్‌లో వచ్చిన వారికి డబ్బులతో పాటు ఆయుధాలు, పేలుడు పదార్థాలు అందిస్తూ భారత్‌లో కుట్రలకు పాల్పడుతున్నట్లు వెల్లడయ్యింది.

మహారాష్ట్రలో రెండేళ్ల క్రితం ఇద్దరు ఎన్‌సిపి నేతల హత్య వెనుక బట్టి పేరు తొలిసారిగా వెలుగు చూసింది. పరారీలో వున్న బట్టి అంతు చూస్తామని, అతను ఎక్కడున్నా పట్టుకుం టామని జమ్మూకాశ్మీర్ డిజి నళిన్‌ప్రభాత్ హెచ్చరించడం గమనార్హం.

# చంచల్‌గూడ జైలుకు బాల్క సుమన్

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** సింగరేణి సంస్థలతో పాటు రైల్వే ఆస్తులపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసినందుకు నాంపల్లి పోలీసులు అరె స్టు చేసిన బిఆర్ఎస్ మాజీ ఎంఎల్ఏ బాల్కా సుమన్‌ను శనివారం అర్ధరాత్రి సమయంలో చంచల్‌గూడ జైలుకు తరలించారు. శనివారం మధా ్యహ్నం తెలంగాణ భవన్‌లో బాల్కా సుమన్‌ను పోలీసులు అరెస్టు చేయడం తెలిసిందే. సింగరేణి సంస్థ యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసిన నాంపల్లి పోలీసులు మూడు రోజుల పాటు బాల్కా సుమన్ కోసం గాలించి చివరకు శనివారం నాడు ఆయనను అరెస్టు చేయడం విదితమే.

అరెస్టు తరువాత బాల్కా సుమన్‌ను నాంపల్లి పోలీసు స్టేషన్‌కు తరలించి ఆయన చేసిన వ్యాఖ్యలపై వాంగ్మూలం నమో దు చేశారు. అనంతరం రాత్రి పది గంటల సమయంలో ఆయనకు వైద్య పరీక్షలు పూర్తి చేశారు. దీని తరువాత నాంపల్లి కోర్టులకు సంబంధిం చిన మెజిస్ట్రేట్ ఇంటి వద్ద హాజరు పరిచారు. ఈ కేసును విచారించిన మెజిస్ట్రేట్ బాల్కా సుమన్‌కు రెండు వారాల రిమాండు విధించారు. దీని తరువాత అర్ధరాత్రి సమయంలో నాంపల్లి పోలీసులు ఆయనను భద్రత మధ్య చంచల్‌గూడ జైలుకు రిమాండుకు తరలించారు.

వార్త

మీలో మార్పు రావడం అన్నది ఎంత కఠినమైన విషయమో తెలుసుకోండి. అప్పుడు ఇతరుల్ని మార్చడం అన్నది ఎంత కష్టమైనదో మీకు తెలిసొస్తుంది.

- జాకబ్ బ్రౌడీ


# కల్తీ మద్యానికి ఏదీ కళ్లెం?

విషపూరిత మద్యం తాగి మహారాష్ట్రలోని పూణె, పింప్రిలో కనీసం 15 మంది మృతి చెందారు. కల్తీ మద్యం మరణాలు అప్పుడప్పుడు తెరమీదకొస్తున్నాయంటే అలాంటివి జరుగకుండా చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమవుతోందనే చెప్పుకోవాలి. మిథనాల్ కలిపిన మద్యం సేవించడం వల్లనే ఈ మరణాలు సంభవించాయని ప్రభుత్వ అంచనాలున్నాయి. ఈ సంఘటన జరుగగానే ఎప్పటిలానే పోలీసు యంత్రాంగం అవన్నీ అనారోగ్య కారణాలేనని బుకాయించసాగారు. బాధితులకు తీవ్ర తలనొప్పి, కడుపు నొప్పి, వికారం వంటి లక్షణాలతో పోలీసులు వాటిని కల్తీ మద్యం తాగిన పర్యావసానంగా వారు చనిపోయారని ధృవీకరించక తప్పలేదు. పూణెలోని హడప్సర్, కాలేపడల్, చించివాడలోని పుగేవాడి, దాపోడి ప్రాంతాలలో మద్యం సేవించిన వారు మాత్రమే బలయ్యారు. సంఘటన జరుగగానే రాత్రికి రాత్రే పలు మద్యం దుకాణాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. ప్రాథమిక సమాచారం నుంచి యోగేష్ వాంఖేడ్ అనే వ్యక్తి ముంబై నుంచి అనుమతి లేని ఇథనాల్‌ను తెచ్చి కల్తీ మద్యం తయారు చేసి మార్కెట్‌కు తరలించారు. అదే ముప్పు తెచ్చిపెట్టింది. పూణెలో జరిగిన కల్తీ మరణాల సమాచారం దేశాన్ని కుదిపేసిన మరో విషాద సంఘటన జాబితాలో చేరిపోయింది. కల్తీ మద్యాన్ని విక్రయానికి తెచ్చిన పలువురు నిందితుల్ని పోలీసులు అరెస్టు చేశారు. ఇలాంటి సంఘటనలు జరిగి చావుకు గురైన అన్ని సందర్భాల్లోనూ పోలీసుల హడావుడి అంతా ఇంతా కాదు. మళ్లీ మామూలే. ప్రత్యేక దర్యాప్తులనే మాటలు వినిపిస్తాయి కానీ మళ్లీ అలాంటి కల్తీ మద్యం అమ్మకుండా చర్యలేమీ తీసుకోరు. సాధారణంగా బీరు, వైన్, విస్కీ, బ్రాందీ వంటి మద్యపాన పదార్థాల్లో ఇథనాల్ తప్పనిసరిగా ఉంటుంది. మద్యం తాగిన అనంతరం కిక్కు ఈ మత్తు మందే ప్రధాన కారణం. ఇథనాల్ రక్తంలో చేరి మెదడుపై ప్రభావం చూపుతుంది. ప్రధానంగా నాడీ వ్యవస్థ పని తీరును మందగించేలా చేస్తుంది పొరపాటున వాటి మోతాదులు ఎక్కువైతే మాట తడపడడం, తూలుతూ నడవడం వంటి అసాధారణ చర్యలు గమనిస్తాము. ఇథనాల్‌శాతం ఎక్కువుంటే మత్తు తీవ్రంగా ఉంటుంది. ఇథనాల్‌కు తోడుగా కొందరు మెథనాల్ కూడా కలుపుతారు. అదే ప్రాణాపాయ స్థితిలోకి తీసుకెళ్తుంది. తీవ్రమైన విష ప్రభావం తగిలితేనే మరణం సంభవిస్తుంది. దీని వలన మూత్ర పిండాలు, కాలేయం దెబ్బతింటాయి. అనుచిత లబ్ధి కోసమే కల్తీ మద్యాన్ని తయారుచేసి అమ్ముతుంటారు. చౌకగా దొరికే రసాయనాలు, నాసిరకం మూల పదార్థాలనుపయోగించి కల్తీ మద్యాన్ని అతి తక్కువ ధరకే తయారు చేయగలుగుతారు. వీటిని అమ్మితే ఎక్కువ లాభం కలుగుతుంది. ఇలాంటి మద్యాన్ని విక్రయించడం నేరమని తెలిసినప్పటికీ వారు లబ్ధికోసమే రిస్క్‌చేస్తారు. చట్టబద్ధంగా మద్యం తయారీలో పన్నులు లైసెన్సులు, నాణ్యత నియంత్రణ వంటి అంశాల వలన తయారీ ఖర్చు ఎక్కువగా ఉంటుంది. లీటరు తయారీ ఖర్చుతగ్గించుకుని విక్రయ ధర పెంచుకునేందుకువీలున్న అక్రమ మద్యం తయారీలో లాభాలు ఎక్కువ గడించే అవకాశ ముంటుంది. మహారాష్ట్రలో చావులకు కారణమైన అక్రమ మద్యం తయారీలో నిందితులు ఆన్‌లైన్‌లో మెథనాల్ సేకరించి దానిని దేశీయ మద్యంతో కలిపిన కారణంగానే ఎక్కువ మందిని బలితీసుకొంది. ఈ ఘటనలో మృతి చెందినవారు రోజువారీ కూలీలు, కార్మికులు, అల్పాదాయ వర్గాలే. నిజానికి పేదరికమే వారిని కల్తీ మద్యం వైపునకు దారిచూపింది. ముందుగా అక్రమ మద్యం తయారీ కేంద్రాలను గుర్తిస్తే కనీసం కొన్నైనా ప్రాణాలు నిలబెట్టగలవు. వీటికి సంబంధించిన సమాచారం ముందుగానే పలు నిఘాల ద్వారా పసికట్టగలిగితే కొన్ని ప్రాణాలైనా నిలబడతాయి. అక్రమ మద్యం గొలుసును పూర్తిగాధ్వంసం చేయగలిగే యంత్రాంగాన్నిఎక్సైజ్ శాఖ ఏర్పర్చుకోవాలి. మెథనాల్ వంటి రసాయనాల పంపిణీపై ఎప్పటికప్పుడు నిఘా పర్యవేక్షణ జరిగితేనే అక్రమ మద్యం ఆటకట్టవుతుంది. గతంలోనూ ఇలాంటి చర్యలు తీసుకుంటేనే మద్యరహిత సమాజాన్ని ఏర్పరచగలమనే నమ్మకంతో ముందడగు వేశారు. కల్తీ మద్యం చావులనేవి మానవ తప్పిదమే తప్పప్రకృతి వైపరీత్యమేమీ కాదు. కల్తీ మద్యం వల్ల జరిగే అనర్థాలు ప్రాణాంతకమని అవగాహన కల్పించడం ఎక్సైజ్ శాఖ నిఘా వలన మాత్రమే అక్రమ మద్యం మరణాలను ఆపవచ్చును. కానీ అక్రమార్జనకు అలవాటుపడి అక్రమ మద్యం తయారీని చూసీచూడనట్లు వదిలేయడం వలన కూడా జరిగేది అనర్థమే. ఎన్నిసార్లు ఎన్ని హితవచనాలు పలికినా కల్తీ మద్యం తయారీకి అలవాటు పడినవారు మళ్లీ మళ్లీ అదే దారిలో అక్రమ సరఫరా నెట్‌వర్క్‌లు ఏర్పాటు చేసేస్తున్నారు. గత 2004 నుంచి ఇంతవరకు చూస్తే దాదాపు 900మంది కల్తీ లిక్కర్‌కు బలయ్యారు. 2004లో ముంబయిలో 87మంది, 2008లో కర్ణాటక, తమిళనాడు సరిహద్దుల్లో 180 మందికిపైగా, 2009లో గుజరాత్ ఘటన 130 మంది మృతి చెందారు. కల్తీ మద్యం ఘటన 2019లో ఉత్తరప్రదేశ్, 2020లో పంజాబ్, 2015లో మల్వానీలో వరుసగా ఈ మూడు ఘటనల్లో వందేసి మంది చొప్పున అసువులు బాసారు. 2022లో రెండు ఉదంతాలు జరిగాయి. బీహార్‌లో 40 మంది, గుజరాత్‌లో 28 మందికిపైగా మరణించారు. 2024లో రిబిలో 65 మంది, 2025లో జరిగిన రెండు ఘటనలో అమృత్‌సర్‌లో 21 మందికిపైగా తాజాగా పూణే ఉదంతంలో 15 మంది మృతి చెందారు. ఇలాంటి మరణాలు మానవ సమాజాన్ని కృంగదీస్తాయి.



చేయగలిగే శక్తి ఉన్నవాడికంటే, చేయాలనే కోరిక ఉన్నవాడు ఎక్కువ చేయగలుగుతాడు.

జె.ముర్రే



జీవితానికి విశ్వాసం పునాదిలా ఉండాలి. విశ్వాసం లేకుండా ఏ పని చేసినా వ్యర్థమే.

ఖలీల్ జిబ్రాన్

# ప్రజావాక్కు

## సర్, కొంచెం జాగ్రత్త !

ఎన్నికల కమిషన్ మూడవ దశ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర రివ్యూ 'సర్'ని 16రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో త్వరలో మొదలు బెట్టబోతుంది. అందుకు తగ్గసన్నాహకాలు చేసుకుంటోంది. ఇందులో ఇరు తెలుగు రాష్ట్రాలుకూడా ఉన్నాయి. మొదటి రెండు దశల్లో దాదాపు 10శాతం మంది ఓటర్ల పేర్లు తొలగింపులు జరగ్గా, వాటిపై నెలకొన్న సందేహాలు, వివాదాలపై ఎన్నికల కమిషన్ స్పష్టమైన దిద్దుబాట్లేవీ చేపట్టలేదు. ఈ నేపథ్యంలో సుప్రీం కోర్టు కూడా ఆ కమిషన్‌కి రాజ్యాంగపరంగా సర్ నిర్వహించే హక్కు, బాధ్యతలున్నట్లు ప్రకటించింది. తనకు లభించిన నైతిక మద్దతుతో ఈ ప్రక్రియ మూడోదశని ఎన్నికల కమిషన్ రెట్టించిన ఉత్సాహంతో చేపట్టనుంది. అప్పుడుకేవలం హిమాచల్ ప్రదేశ్, జమ్మూకాశ్మీర్, లడఖ్ మాత్రమేఈప్రక్రియజరగనిప్రాంతాలుగా మిగిలిపోతాయి. అర్హులెవరూ ఓటు హక్కు కోల్పోరాదు, అనర్హు లెవరూ దాన్ని పొందరాదు.

- డా.డి.వి.జి. శంకరరావు, విజయనగరం

## హెల్త్ కార్డులు ఎవరికోసం?

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రాష్ట్రంలోని ఉద్యోగ ఉపాధ్యాయులందరికీ వచ్చే జూన్ 2నహెల్త్ కార్డులు అందజేయనున్నామని ఈ మేరకు ఈనెల 31 వరకు ఉద్యోగులు తమ వివరాలను అప్లోడ్ చేయాలని ప్రకటన చేయడంతో రాష్ట్రంలోఉద్యోగఉపాధ్యాయులందరూ ఈవిధానంద్వారా తమకు హెల్త్ కార్డులు అవసరం లేదనే అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. డిఎలు పిఆర్‌సిలు అడిగితే హెల్త్ కార్డులు మాత్రమే ఇస్తామని ప్రభుత్వం చేతులు దులుపుకోవడంతో ఉద్యోగ ఉపాధ్యాయులు కంగుతింటున్నారు. ఇది కాకుండా తమ మూలవేతనంలో 1.5 శాతం మినహాయించుకొని హెల్త్‌కార్డులు అందజస్తామనడంతో ఉపాధ్యాయ వర్గాల్లో వ్యతిరేకత వస్తోంది.

- బోనగిరి దేవయ్య, హైదరాబాద్

## ఉద్యోగాల కోత

ఇప్పటివరకు ఇంజనీరింగ్ విద్య చదివిన వారందరూ అధిక జీతాలకు ఆశపడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ఎగబడి దేశ విదేశాలలో ఉద్యోగాలు సంపాదించుకున్నారు. కొందరికి ఉద్యోగాలు దొరకక ప్రయివేటు సంస్థలలోను చిన్నదో పెద్దదో ఎంతోకొంత జీతానికి పని చేస్తున్నారు. పెద్ద పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఈమధ్య తమ సీనియర్ ఉద్యోగులను వేలసంఖ్యలో తొలగిస్తున్నారు.

- ఎం. నాగరాజు, కరీంనగర్‌జిల్లా

## భూ ఆక్రమణలపై సీబీఐ విచారణ జరపాలి

మా పరిపాలన పారదర్శకం అంటూ ముఖ్యమంత్రి తరచూ అంటుంటారు. ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే తాట తీస్తాను అంటాడు, జైలుకు పంపుతాం అంటాడు. ఇవి కేవలం ప్రకటనల వరకే పరిమితం అయిపోతున్నాయి. ఆచరణలో శూన్యం అని తేలిపోయింది. అటవీశాఖమంత్రి పవన్ కల్యాణ్ తిరుపతి జిల్లాలో పెద్దిరెడ్డి ఆక్రమించిన అటవీ భూములను స్వాధీనం చేసుకున్నాము, కడప జిల్లాలో సజ్జల రామకృష్ణారెడ్డి ఆక్రమించిన భూములను స్వాధీనం చేసుకున్నాము. ఇంకా ఉంటే రిపోర్టు తయారు చేయండి అంతు చూస్తాను అని నాలుగు రోజులక్రితం అటవీ శాఖ ఉన్నతాధికారులతో అన్నాడు. మరి తిరుపతి జిల్లాలోనే 20 ఏళ్ళనుండి డీప్ ఫారెస్ట్ భూమిని కల్కి ఆక్రమించి అటవీ నిబంధనలకు వ్యతిరేకంగా ఆశ్రమంలోకి విదేశీయులను రప్పించి చెక్క భజనలు చేస్తుంటే కనిపించటం లేదా? దొంగలకు సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకొని, ఆక్రమణ భూములను స్వాధీనం చేసుకోవాలి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

## సీనియర్లకు ప్రమోషన్లు ఇవ్వాలి

టీచర్ ట్రైనింగ్ పొంది, ప్రభుత్వ టీచరుగా చేరడానికి డీఎస్సీ టెస్ట్‌లో మెరిట్ సాధించి, ప్రభుత్వంచే నియమించబడిన ఉపాధ్యాయులు, మరో రెండు ఏళ్లలో రిటైర్ అయ్యే సమయంలోగా రాష్ట్రాలు నిర్వహించే టెట్ లేదా కేంద్రం నిర్వహించే టెట్ విధిగా క్వాలిఫై అవ్వాలి. అలా క్వాలిఫై అవ్వడానికి రెండేళ్ల నుండిమూడేళ్ల గడువుగా సుప్రీంకోర్టు పెంచి తీర్పు ఇచ్చింది. కోర్టుతీర్పులను ప్రజాప్రభుత్వాలు తమ ఓటుబ్యాంకుకు అనుగుణంగా అమలు జరుపుతూ ఉన్నాయి. చూపు మందగించిన వాడికి కళ్లద్దాలు పనిచేస్తాయి, పూర్తిగా కళ్ళు లేని వాడికి గుడ్డివాడికి కళ్లద్దాలతో పనేముంది? రిటైర్ కాబోయే ముందు వ్యక్తికి టెట్‌తో పనే ఉంటుంది? ఇలాంటి నేపథ్యంలో రిటైర్మెంట్కు చేరువుగా ఉండి, ప్రమోషన్ కోసం ఎదురుచూసే సీనియర్ అభ్యర్థులు టెస్ట్ పాస్ అయితే వారికి ప్రమోషన్ కల్పించడం సముచితము అవుతుంది.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

## గ్రామాల్లో అన్ని సౌకర్యాలు ఉండాలి

గ్రామాలలో ప్రతి రంగానికి చెందిన పాలకవర్గం అధికారులు, కిందిస్థాయి సిబ్బంది విపత్కర, సాధారణ పరిస్థితుల్లో ప్రజలకు అందుబాటులో ఉండడమే గాక వారికి కావలసిన సౌకర్యాలు అందుబాటులో ఉంటేనే గ్రామాలు అభివృద్ధి చెందుతూ ప్రజలుమెరుగైన జీవితం గడపడానికి అవకాశాలు ఉంటాయి.

-ఎం. శివకుమార్, రంగారెడ్డి జిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# పరీక్షలు జ్ఞాపకశక్తికి కొలమానాలా?

రబీంద్రనాథ్ ఠాగూర్ పేర్కొన్నట్లు, 'సమాచారం అందించడం మాత్రమే విద్య కాదు, జీవితాన్ని సమగ్రంగా అర్థం చేసుకునే సామర్థ్యాన్ని పెంపొందించేదే నిజమైన విద్య'. మన దేశానికి ఇప్పుడు కేవలం మార్కులు సాధించే యువత కాదు, సమస్యలను పరిష్కరించే, సమాజానికి దిశానిర్దేశం చేసే, ఆవిష్కరణలకు నాయకత్వం వహించే యువత అవసరం. పరీక్షల భయం నుంచి విద్యను విముక్తి చేయకుండా సృజనాత్మక భారతాన్ని నిర్మించడం సాధ్యంకాదు. విద్యార్థిని ఒక 'రోల్ నంబర్' గా కాకుండా, ఒక సంపూర్ణ వ్యక్తిత్వం గల మనిషిగా చూడగలిగినప్పుడే నిజమైన పరీక్షా సంస్కరణలు ప్రారంభమవు తాయి. భవిష్యత్తును నిర్మించాల్సిన యువతను, గతాన్ని కంఠస్థం చేయించే పరీక్షలతో కొలవడం కొనసాగితే మనం మార్కులు సాధించిన తరాన్ని తయారు చేయగలుగుతాం గానీ, సమస్యలను పరిష్కరించే సమాజాన్ని నిర్మించలేం.



ఆచార్య దారపురెడ్డి సూర్యచంద్ర రావు

మూడు గంటల పరీక్షతో మూడు సంవత్సరాల విద్యను కొలవగలమా? అనే ప్రశ్న నేటి భారత విద్యావ్యవస్థ ముందున్న అత్యంత ప్రాధాన్యమైన చర్చాంశంగా మారింది. విద్యార్థి ప్రతిభనుఅంచనా వేయడంలో పరీక్షలు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, ప్రస్తుతం అమలవుతున్న పరీక్షా విధానం నిజంగా విద్యార్థి జ్ఞానాన్ని, సామర్థ్యాన్ని, వ్యక్తిత్వ వికాసాన్ని కొలుస్తుందా అనే ప్రశ్న అనివార్యంగా నిలుస్తోంది. విద్య అసలు ఉద్దేశ్యం వ్యక్తిలో ఆలోచనా శక్తి, విశ్లేషణాత్మక దృష్టి, సృజనాత్మకత, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను పెంపొందించడం. అయితే మన పరీక్షల వ్యవస్థ మాత్రం ఇప్పటికీ ప్రధానంగా జ్ఞాపకశక్తిని, కంఠస్థ సామర్థ్యాన్ని, మార్కుల సాధనను మాత్రమే కొలుస్తోంది. నేటి విద్యార్థి ఎంత అర్థం చేసుకున్నాడన్నది కంటే, పరీక్షలో ఎంత రాశాడన్నదే ఎక్కువ ప్రాధాన్యం పొందుతోంది. ఫలితంగా విద్య అనేది జ్ఞానాన్వేషణ ప్రక్రియగా కాకుండా మార్కుల పోటీగా మారిపోయింది. 'ఎన్ని మార్కులు వచ్చాయి?' అనే ప్రశ్న విద్యార్థి విలువను నిర్ణయించే ప్రధాన ప్రమాణంగా మారడం ఆందోళనకరం. పాఠ్యాంశాన్ని లోతుగా అర్థం చేసుకోవడం, విమర్శనాత్మకంగా ఆలోచించడం, కొత్త కోణాల్లో సమస్యలను విశ్లేషించడం వంటి అంశాలకు తగిన ప్రాధాన్యం దక్కడం లేదు. విద్యార్థులు విషయాన్ని నేర్చుకోవడానికంటే, పరీక్షలో ఎలా రాయాలో నేర్చుకోవడానికే ఎక్కువ సమయం వెచ్చిస్తున్నారు. ప్రాచీన భారతీయ విద్యా విధానాన్ని పరిశీలిస్తే, పరీక్ష అనేది ఒక నిర్దిష్ట రోజున జరిగే కార్యక్రమం కాదు. అది విద్యార్థి సర్వతోముఖాభివృద్ధిని పరిశీలించే నిరంతర ప్రక్రియ. గురుకుల వ్యవస్థలో గురువు విద్యార్థిని కేవలం పాఠ్యాంశాల పరిజ్ఞానంతో కాకుండా, క్రమశిక్షణ, ప్రవర్తన, ఆలోచనా విధానం, సామాజిక బాధ్యత, జీవన నైపుణ్యాల ఆధారంగా అంచనా వేసేవారు. వాదోపవాదాలు, శాస్త్రార్థాలు అనుభవాధారిత అభ్యాసం విద్యలో అంతర్భాగాలుగా ఉండేవి. అయితే వలస పాలన కాలంలో ప్రవేశించిన మెకాలే విద్యా విధానం విద్యను ఉద్యోగోద్దేశ్య పరిపాలనా అవసరాలకు అనుగుణంగా మలిచింది. ఆ విధానంలో పరీక్షలు జ్ఞాన వికాసానికి కాకుండా ఉద్యోగుల ఎంపికకు సాధనాలుగా మారాయి. దురదృష్టవశాత్తూ, స్వాతంత్ర్యం వచ్చిన దశాబ్దాల తర్వాత కూడా ఆ ప్రభావం మన పరీక్షా వ్యవస్థలో కొనసాగుతూనే ఉంది. స్వాతంత్ర్యం అనంతరం రాధాకృష్ణన్ కమిషన్, కోఠారి కమిషన్ వంటి పలు విద్యా సంస్కరణ కమిషన్లు పరీక్షల మార్పు అవసరాన్ని స్పష్టంగా ప్రస్తావించాయి. అనంతర జాతీయ విద్యా విధానాలు కూడా కంఠస్థ విద్యను తగ్గించి, అవగాహన ఆధారిత మూల్యాంకానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించాయి. అయినప్పటికీ అమలులో మాత్రం పెద్దగా మార్పు కనిపించలేదు. బిట్ బ్యాంకులు, గెస్ పేపర్లు, మోడల్ ఆన్సర్లు, మార్కుల పోటీ ఇప్పటికీ విద్యార్థి జీవితాన్ని ప్రభావితం చేస్తూనే వున్నాయి. ఈ పరిస్థితి కేవలం విద్యా ప్రమాణాలకే పరిమితం కాకుండా విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై కూడా తీవ్రమైన ప్రభావం చూపుతోంది. పరీక్షల భయం, ర్యాంకుల ఒత్తిడి, తల్లిదండ్రుల అంచనాలు, సామాజిక పోలికలుఅనేక మంది విద్యార్థులను ఆందోళన, నిరాశ, మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నాయి. విద్యార్థిలో జిజ్ఞాసను, అన్వేషణాత్మక



దృష్టిని పెంపొందించాల్సిన విద్యా వ్యవస్థ, 'పరీక్ష' అనే పదమే భయానికి పర్యాయపదంగా మారే పరిస్థితిని సృష్టించడం బాధాకరం. ఇంకా ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, అత్యుత్తమ మార్కులు సాధించిన అనేక మంది పట్టభద్రులు ఉద్యోగ రంగంలో ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్నారు. కమ్యూనికేషన్ నైపుణ్యాలు, విశ్లేషణాత్మక ఆలోచన, సమస్య పరిష్కార సామర్థ్యం, జట్టు భావన, నాయకత్వ లక్షణాలు వంటి అంశాల్లో లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పుస్తక జ్ఞానం ఉన్నా, జీవన నైపుణ్యాలు లేని యువత పెరుగుతుండటం దేశ భవిష్యత్తుకు సవాలుగా మారుతోంది. భారతదేశం మాత్రమే కాదు, ప్రపంచవ్యాప్తంగా కూడా సంప్రదాయ పరీక్షా విధానాలపై పునరాలోచన ప్రారంభమైంది. ఫిన్లాండ్, అమెరికా, జర్మనీ, సింగపూర్ వంటి దేశాలు ఏడాది చివరలో నిర్వహించే మూడు గంటల పరీక్షల కంటే, విద్యార్థి అభ్యాస ప్రగతిని నిరంతరం పర్యవేక్షించే 'నిరంతర సమగ్ర మూల్యాంకన' పద్ధతికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయి. అక్కడ పరీక్షలు విద్యార్థులను భయపెట్టే సాధనాలు కాకుండా, అభ్యాస ప్రక్రియను అర్థం చేసుకునే మూల్యాంకన పద్ధతులుగా మారుతున్నాయి. ఈ దేశాలు కేవలం జ్ఞాపకశక్తిని కాకుండా ప్రాజెక్టులు, పరిశోధన, ప్రజెంటేషన్లు, ప్రాక్టికల్ సమస్యల పరిష్కారం పరిశ్రమలతో అనుసంధానమైన నైపుణ్యాలను అంచనా వేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా విద్యా మూల్యాంకన విధానాల్లో మార్పు అవసరాన్ని 'యునెస్కో', 'ఒఇసిడి' వంటి సంస్థలు పదేపదే నొక్కి చెబుతున్నాయి. కృత్రిమ మేధస్సు యుగంలో కేవలం సమాచారాన్ని గుర్తుంచుకోవడం విద్యార్థి ప్రతిభకు ప్రమాణం కాదని, దాని బదులుగా సృజనాత్మకత, విశ్లేషణాత్మక ఆలోచన, నైతిక నిర్ణయ సామర్థ్యం, సమస్య పరిష్కార నైపుణ్యాలను అంచనా వేయాల్సిన అవసరం ఉందని అవి సూచిస్తున్నాయి. సమాచారాన్ని కంఠస్థం చేయడం ఇక మానవ మేధస్సు ప్రత్యేకత కాదు. యంత్రాలు ఇప్పటికే మనిషికంటే వేగంగా సమాచారాన్ని సేకరించి విశ్లేషిస్తున్నాయి. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో మనిషి విలువ అతను ఎంత గుర్తుంచుకున్నాడనే దానిలో కాదు, ఎంత కొత్తగా ఆలోచించగలడనే దానిలో ఉంటుంది. భారతదేశంలో కూడా మార్పు సంకేతాలు కనిపిస్తున్నాయి. 'ఐఐటి', 'ఐఎమ్'లు ప్రముఖ విశ్వవిద్యాలయాలు కేస్ స్టడీలు, ఓపెన్ బుక్ పరీక్షలు, సెమినార్లు, ప్రజెంటేషన్లు, ప్రాజెక్టు ఆధారిత మూల్యాంకనాన్ని ప్రోత్సహిస్తున్నాయి. జాతీయ విద్యా విధానం2020సామర్థ్య ఆధారిత మూల్యాంకనం వైపు అడుగులు వేస్తోంది. 'ఎన్‌సిఇఆర్‌టి' ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'పరాఖ్' సంస్థ కూడా పరీక్షా ప్రమాణాల్లో నాణ్యత, ఏకరూపత తీసుకురావడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. విద్యార్థి ఎంత గుర్తుంచుకున్నాడన్నదికంటే, ఎంత అర్థం చేసుకున్నాడు, ఎంత అన్వయించగలడు, ఎంత సృజనాత్మకంగా ఆలోచించగలడన్నదే భవిష్యత్ మూల్యాంకనానికి ప్రమాణం కావాలని చెబుతుంది. రబీంద్రనాథ్ ఠాగూర్ పేర్కొన్నట్లు, 'సమాచారం అందించడం మాత్రమే విద్య కాదు, జీవితాన్ని సమగ్రంగా అర్థం చేసుకునే సామర్థ్యాన్ని పెంపొందించేదే నిజమైన విద్య'. మన దేశానికి ఇప్పుడు కేవలం మార్కులు సాధించే యువత కాదు, సమస్యలను పరిష్కరించే, సమాజానికి దిశానిర్దేశం చేసే, ఆవిష్కరణలకు నాయకత్వం వహించే యువత అవసరం. పరీక్షల భయం నుంచి విద్యను విముక్తి చేయకుండా సృజనాత్మక భారతాన్ని నిర్మించడం సాధ్యంకాదు. విద్యార్థిని ఒక 'రోల్ నంబర్' గా కాకుండా, ఒక సంపూర్ణ వ్యక్తిత్వం గల మనిషిగా చూడగలిగినప్పుడే నిజమైన పరీక్షా సంస్కరణలు ప్రారంభమవుతాయి. భవిష్యత్తును నిర్మించాల్సిన యువతను, గతాన్ని కంఠస్థం చేయించే పరీక్షలతో కొలవడం కొనసాగితే మనం మార్కులు సాధించిన తరాన్ని తయారు చేయగలుగుతాం గానీ, సమస్యలను పరిష్కరించే సమాజాన్ని నిర్మించలేం. ●

(రచయిత: ప్రొఫెసర్, కృష్ణా విశ్వవిద్యాలయం)

# సంక్షోభం అంచుల్లోకి మన 'ఆర్థికం'

బొల్లిముంత సాంబశివరావు

ప్రపంచంలో బాగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారతదేశం ఒకటని, త్వరలో5 ట్రిలియన్ల డాలర్ల ఆర్థికవ్యవస్థగా మారుతుందనిప్రధాన మంత్రి నాయకత్వాన ఉన్న ఎన్డిఏ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటూ ఉంది. కేంద్ర ప్రభుత్వం చెప్పే ఆర్థికవ్యవస్థ దేశంలో ఎలాసాధ్యం కాదో అనేక మంది ఆర్థికవేత్తలు తమ అభిప్రాయాలు వెల్లడించారు. కొద్దినెలల క్రితంవరకు భారత ఆర్థిక అభివృద్ధి గురించి గొప్పలు చెబుతూవచ్చిన కేంద్రప్రభుత్వం, అకస్మాత్తుగా బంగారం కొనవద్దు, ఎరువుల వినియోగం తగ్గించాలి, పెట్రోల్, డీజిల్ వాడకం తగ్గించాలి, పబ్లిక్ రవాణాలో ప్రయాణం చేయాలి, సేంద్రీయ వ్యవసాయం చేయాలని ఎందుకు చెబుతున్నది. ఇలా చెప్పడం దేశ ఆర్థికవ్యవస్థ గుర్తించి చెప్పినది వాస్తవం కాదనే గదా! కేంద్ర ప్రభుత్వం మాటలు భారత ఆర్థికవ్యవస్థసంక్షోభానికి నిదర్శనం కాదా! నేడు భారతదేశ ఆర్థికవ్యవస్థ తీవ్రసంక్షోభంలో ఉంది అనడంలో ఎవ్వరికీ అనుమానం లేదు. అప్పులు చేయకుండా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు మనుగడ సాగించలేకపోతున్నాయి. దేశ, విదేశీ అప్పులు నిత్యం పెరుగుతూ ఉన్నాయి. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పుల పరంపర తీవ్రం అయింది. 195051లో భారతదేశ నికర అప్పు2,565.40 కోట్లు. 2014నాటికి దేశం అప్పు55 కోట్లు కాగా, 2026 సంవత్సరం నాటికి సుమారు 2,14,82,050 కోట్ల వరకు చేరుకున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే 14.61 లక్షలరూపాయల అప్పు కేంద్ర ప్రభుత్వం చేసింది. గత12 సంవత్సరాల్లో చేసిన అప్పు1,59,82,050 లక్షలకోట్లు. దీన్ని గమనిసే కేంద్రం చేసిన అప్పు ఏమోతాదులో ఉంది అర్థం అవుతుంది. ఈ మొత్తం అప్పుల్లో విదేశీ అప్పులు 64 లక్షలకోట్లు. ఇది భారత జీడీపీలో 19.2 శాతంగా ఉంది. అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) నివేదిక ప్రకారం అత్యధిక అప్పులు ఉన్న దేశాల స్థాయిలో భారతదేశం 7వ స్థానంలో ఉంది.




దేశ ఆదాయం గణనీయంగా పెరుగుతూఉంది. ఈ ఆదాయం సంవత్సరానికి 6లక్షల కోట్ల నుంచి 26లక్షలకోట్లకు పెరిగింది. దేశఆదాయం బాగా పెరుగుతున్నప్పుడు పెద్ద ఎత్తున అప్పులు చేయాల్సిన అవసరం ఎందుకు వచ్చింది. తెచ్చిన అప్పులు ఏమిచేస్తున్నారు అనే సందేహం ప్రజలకు ఏర్పడుతున్నది. అప్పులుచేయడం, చేసిన అప్పులకు వడ్డీలు కట్టడానికి, తిరిగి అప్పులు చేయడం ప్రభుత్వాల విధానంగా మారింది. గత కొన్ని సంవత్సరాలుగా అప్పులకు కేంద్రం చెల్లిస్తున్న వడ్డీల మొత్తం క్రమంగా పెరుగుతూ ఉన్నది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో 8.02 లక్షలకోట్ల రూపాయలు చెల్లించగా, 2022-23 నాటికి10.79 లక్షల కోట్లకు, 2025-26 ఆర్థిక సంవత్సరానికి12,76,338 కోట్లకువడ్డీల చెల్లింపులు చేరుకున్నాయి. అధికార మార్పిడి జరిగిన ప్రారంభంలో అమెరికా డాలరుకు సమానంగా 3.30 రూపాయలు ఉండేది. పౌండుకు సమానంగా ఉంది. ఆ తర్వాత రూపాయి విలువ తగ్గుతూ వచ్చింది. 1965 లో4.76 రూపాయలకు తగ్గి, 1991లో ఆ తగ్గుదల 25 రూపాయలకు చేరింది. 2013లోడాలర్‌కు 70 రూపాయలకు పడిపోయి, నేడు 96 రూపాయలకు దిగజారింది. రూపాయి విలువ పతనం కావడం వల్ల విదేశీ దిగుమతులకు చెల్లించాల్సిన మొత్తం గణనీయంగా పెరుగుతూ ఉంది. దేశ, విదేశీ అప్పులు పెరుగుతూ, చేసిన అప్పులకు లక్షల కోట్లు వడ్డీలు కట్టడం వల్ల దేశం అప్పుల పాలై, విదేశాల ఆధిపత్యం పెరిగింది. పాలకులు విదేశాలకు దాసోహం అంటున్నారు. ట్రంప్ సుంకాల బెదిరింపుకి కేంద్రం లొంగిపోవడం అందుకు ఒకఉదాహరణ. రూపాయి విలువ పతనంతో నిత్యఅవసరాల వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతూ సామాన్యప్రజలను ఆర్థికసంక్షోభంలోకి నెట్టింది. కుటుంబ ఖర్చులకు అప్పులుచేయాల్సిన పరిస్థితి. ఆ అప్పులకు వడ్డీలు కట్టడానికి నానా తంటాలుపడుతున్నారు. 2019-20లో కుటుంబాల అప్పులు7.5 లక్షలకోట్లు ఉంటే, 2024-25 నాటికి15.7లక్షలకోట్లకుపెరిగాయి. దీన్ని గమనిస్తే దేశ ఆర్థికవ్యవస్థ సంక్షోభం ప్రజలను సంక్షోభంలోకి ఎలానెట్టిందో అర్థం అవుతుంది. దేశంలో ఏర్పడిన ఆర్థికసంక్షోభానికి, దేశం అప్పుల పాలుకావడానికి, రూపాయి విలువపతనం కావడానికి, ధరలు ఆకాశంవైపు చూడటానికి, పేద, మధ్యతరగతి కుటుంబాలు అప్పుల పాలవడానికి కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలే కారణం. ●

# మంటల్లో మాయమవుతున్న భూసారం

డా. మోటె చిరంజీవి

వ్యవసాయం పూర్తయిన తర్వాత పొలాల్లో మిగిలిపోయే వరి, మొక్కజొన్న, పత్తి, ఇతర పంటల అవశేషాలను చాలా మంది రైతులు త్వరగా పొలం శుభ్రం చేసుకోవాలనే ఉద్దేశంతో కాల్చివేస్తుంటారు. అయితే ఈ పంట అవశేషాల దహనం తాత్కాలికంగా సులభమైన మార్గంలా కనిపించినా, దీర్ఘకాలంలో రైతులకు, భూమికి, పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగిస్తుంది. భూసారం తగ్గిపోవడం పంట అవశేషాలను కాల్చడం వల్ల నేలలో ఉండే సేంద్రియ పదార్థాలు, సూక్ష్మజీవులు నశిస్తాయి. దీనివల్ల భూమి సారవంతత తగ్గి, దిగుబడులపై ప్రభావం పడుతుంది. పొలం ఆరోగ్యం దెబ్బతినడం అవశేషాల దహనం కారణంగా నేలలోని నత్రజని, ఫాస్పరస్, పొటాషియం వంటి పోషకాలు గాలిలో కలిసిపోతాయి. దీంతో రైతులు అదనపు ఎరువులు వేయాల్సి రావడంతో ఖర్చు పెరుగుతుంది. ప్రస్తుతం రైతులు పంట కాలం పూర్తి అయి తదుపరి వచ్చే పంటను త్వరగా వేయడానికి రైతులు ఈ పద్ధతిని అనుసరిస్తున్నప్పటికీ, దీనివల్ల నేల సారం, పర్యావరణం, మానవ ఆరోగ్యం వ్యవసాయ ఉత్పాదకతపై తీవ్ర ప్రతికూల ప్రభావాలు ఏర్పడుతున్నాయి. భారతదేశంలో పంట అవశేషాల దహనం సమస్య భారీ స్థాయిలో ఉంది. ప్రధానంగా వరి, గోధుమ, చెరకు పంటల అవశేషాలే ఎక్కువగా కాల్చబడుతున్నాయి. మొత్తం కాల్చే అవశేషాల్లో వరి అవశేషాల వాటా అత్యధికం. ప్రతి సంవత్సరం దేశంలో సుమారు 500-686 మిలియన్ టన్నుల పంట అవశేషాలు ఉత్పత్తి అవుతుండగా, అందులో సుమారు 90-135 మిలియన్ టన్నుల వరకు కాల్చబడుతున్నాయని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇటీవల కాలంలో దేశవ్యాప్తంగా ఈ సీజన్‌లో 67 వేలకు పైగా పంట దహన ఘటనలు నమోదయ్యాయి. ఇందులో మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాలు ముందున్నాయి. తెలంగాణలో వరి, మొక్కజొన్న, పత్తి, చెరకు పప్పు ధాన్యాల సాగు విస్తీర్ణం అధికంగా ఉండటంతో ప్రతి సంవత్సరం భారీ మొత్తంలో పంట అవశేషాలు ఉత్పత్తి అవుతున్నాయి. వివిధ పరిశోధనా సంస్థలు వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో ప్రతి సంవత్సరం సుమారు 180-220 లక్షల టన్నుల పంట అవశేషాలు ఉత్పత్తి అవుతున్నాయి. వీటిలో వరి పంట అవశేషాలు అత్యధికంగా 90-110 లక్షల టన్నులు ఉండగా, మొక్కజొన్న పంట నుండి 35-45 లక్షల టన్నులు, పత్తి పంట నుండి 20-25 లక్షల టన్నులు, చెరకు పంట నుండి



పదిహేను నుంచి ఇరవై లక్షల టన్నుల అవశేషాలు ఉత్పత్తి అవుతున్నాయి. అదనంగా, పప్పుధాన్యాలు ఇతర పంటల ద్వారా మరో ఇరవై నుండి ఇరవై ఐదు లక్షల టన్నుల అవశేషాలు లభిస్తున్నాయి. వీటిలో వరి అవశేషాలే అత్యధికంగా ఉండి మొత్తం అవశేషాలలో దాదాపు నలభైఐదు నుంచి యాభై శాతం వాటాను కలిగి ఉంటాయి. తెలంగాణలో కూడా పంట అవశేషాల దహనం పెరుగుతున్నట్లు నివేదికలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా ఖమ్మం, హనుమకొండ, మహబూబాబాద్ జిల్లాల్లో ఈ ఘటనలు పెరుగుతున్నాయని అధికారులు చెబుతున్నారు. 2026 రబీ సీజన్‌లో తెలంగాణలో సుమారు 65.9 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగింది. ఒక్క ఎకరానికి కనీసం 3 టన్నుల అవశేషాలు వస్తాయని లెక్కిస్తే, దాదాపు 1.97 కోట్ల టన్నుల పంట అవశేషాలు ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంది. దీని ఫలితంగా భూసారం తగ్గి, భవిష్యత్తులో ఎరువులపై ఆధారపడే పరిస్థితి పెరుగుతుంది. రైతు తక్షణం సమయం ఆదా చేసుకున్నా, దీర్ఘకాలంలో పెట్టుబడులు పెరిగే ప్రమాదం ఉంది. మరోవైపు, ఈ దహనం వల్ల వెలువడే పొగ వాయు కాలుష్యాన్ని పెంచుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో శ్వాసకోశ సమస్యలు, కంటి ఇబ్బందులు, చిన్న పిల్లల్లో, పెద్దలలో ఆరోగ్య సమస్యలు పెరిగే అవకాశముంది. పర్యావరణ పరిరక్షణ గురించి మాట్లాడుతున్న సమయంలో భూమిని, గాలిని కలుషితం చేసే ఈ విధానం కొనసాగడం ఆందోళనకరం. ఈ అవశేషాలు నీటిలో కూడా కలుస్తున్నాయి. దీని ద్వారా నీటి కాలుష్యం కూడా ఏర్పడుతుంది. ఇన్ని సమస్యలకు కారణమవుతున్న ఈ పంట అవశేషాలను కల్చడం సమంజసం కాదు. ఈ సమస్యకు రైతులను మాత్రమే బాధ్యులుగా చూడటం సరైంది కాదు. యంత్రాల కొరత, అవగాహనలోపం, అవశేషాల నిర్వహణకు సరైన ప్రత్యామ్నాయాల లేమి కూడా కారణాలే. ప్రభుత్వాలు సబ్సిడీలతో యంత్రాలను అందించడం, గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టడం, అవశేషాలను సేంద్రియ ఎరువులుగా మార్చే విధానాలను ప్రోత్సహించాలి. ఒకసారి మంటలు వ్యాపిస్తే పక్కనున్న పొలాలు, చెట్లు, విద్యుత్ తీగలు, పశువులకు ప్రమా దం కలిగే అవకాశం ఉంది. పంట అవశేషాలను కంపోస్ట్‌గా మార్చడం పశువుల మేతగా వినియోగించడం మల్చింగ్ విధానంలో నేలపై పరచడం బయోగ్యాస్, సేంద్రియ ఎరువుల తయారీలో ఉపయోగించడం జరుగుతుంది. ప్రతి సంవత్సరం సుమారు 10-15 లక్షల టన్నుల పంట అవశేషాలు ఉత్పత్తి అవుతున్నట్లు అంచనా. వీటిలో వరి పంట అవశేషాలు 6-8లక్షల టన్నులతో అత్యధికంగా ఉండగా, మొక్కజొన్న నుండి 2-3 లక్షల టన్నులు, పత్తి నుండి 1-2 లక్షల టన్నులు, ఇతర పంటల నుండి 0.5-1.0లక్షల టన్నుల అవశేషాలు లభిస్తున్నాయి. పంట అవ శేషాలను కాల్చడం తాత్కాలిక పరిష్కారం మాత్రమే. మంటల్లో మాయమవుతున్న భూసారం వల్ల భవిష్యత్ వ్యవసాయం, భూసారం, రైతుల ఆర్థికపరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ప్రత్యామ్నాయ పద్ధతులను అవలంబించడం అవసరం. నేడు కాల్చిన అవశేషం రేపటి భూసారాన్ని దహనం చేసినట్టే అనే విషయాన్ని ప్రతి రైతు గుర్తించాలి. ●

# విద్యార్థులకు అండగా ఉంటాం



## వారు దేశద్రోహులు కారు.. ఉజ్వల భవిష్యత్తుకు అర్హులు

## సిబిఎస్ఇ ఒఎస్ఎం వివాదంపై న్యాయవి-చారణ జరపాలి

## విద్యార్థులతో మాటామంతిలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్

**న్యూఢిల్లీ, మే 31:** సిబిఎస్ఇ ఆన్‌స్క్రీన్ మార్కింగ్ (ఒఎస్ఎం) వివాదంపై కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకుని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. కొంతమంది విద్యార్థులతో తాను జరిపిన సంభాషణకు సంబంధించిన వీడియోను ఆదివారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. సమంజసమైన ప్రశ్నలు అడిగినందుకు 'సమాధానాలకు బదులుగా అవమానాలను' ఎదుర్కొన్న ఆ విద్యార్థులను ధైర్యవంతులైన యువ భారతీయులుగా రాహుల్ అభివర్ణించారు. 'నాతోటి 'దేశద్రోహ సోరోస్ ఏజెంట్లతో' జరిగిన వాస్తవాలను వెల్లడించే సంభాషణ'గా పేర్కొన్నారు. విద్యార్థులు ఉజ్వలమైన, సురక్షితమైన భవిష్యత్తుకు అర్హులని, 'వారు దానిని పొందేలా తాము చూస్తాము' అని కూడా ఆయన భరోసానిచ్చారు. 'వేదాంత్, అతని స్నేహితులు ప్రతిభావంతులైన, ధైర్యవంతులైన యువ భారతీయులు. వారు సిబిఎస్ఇని, మోడీ ప్రభుత్వాన్ని సరళమైన ప్రశ్నలు అడిగారు, కానీ సమాధానాలకు బదులుగా అవమానాలను ఎదుర్కొన్నారు' అని వీడియోతో పాటు 'ఎక్స్'లో తన పోస్ట్‌లో గాంధీ పేర్కొన్నారు. ఆ వీడియోలో, గాంధీ విద్యార్థులతో వారి కష్టాల గురించి అనధికారికంగా మాట్లాడారు. సమంజసమైన ఆందోళనలు, సమస్యలుగా పేర్కొన్న వాటిని లేవనెత్తినందుకు వారిని 'పాకిస్థానీలు', 'డీప్ స్టేట్ ఏజెంట్లు' అని ఎలా ముద్ర వేశారో అని రాహుల్ గాంధీ చమత్కరించారు. 'మీరు విద్యార్థులు. మీరు మీ జవాబు పత్రాలు అడుగుతున్నారు, అంతే ఇప్పుడు, అకస్మాత్తుగా, మీరు దేశద్రోహులుగా మారిపోయారు. సమస్యను పరిష్కరించాలంటే, మీరు సమస్యను అంగీకరించాలి. మీరు సమస్యను అంగీకరించడానికి నిరాకరిస్తూ, ఆ పేద పిల్లలను నిందిస్తూ, 'మీరు డీప్ స్టేట్, మీరు గూఢచారులు, ఉగ్రవాదులు' అని అంటున్నారు' అని ఆన్‌స్క్రీన్ మార్కింగ్ (ఒఎస్ఎం) వివాదంపై ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని రాహుల్‌గాంధీ విమర్శలు గుప్పించారు. పోర్టల్‌లో అప్‌లోడ్ చేసిన స్కాన్ చేసిన కాపీలను చూసిన తర్వాత, ఆ జవాబు పత్రాలు తమవి కావని పలువురు సిబిఎస్ఇ 12వ తరగతి విద్యార్థులు తప్పుగా జరిగినట్లు గుర్తించారు. పునః మూల్యాంకన ప్రక్రియలో భాగంగా సిబిఎస్ఇ అప్‌లోడ్ చేసిన ఫిజిక్స్ జవాబు పత్రం తనది కాదని ఆరోపిస్తూ 12వ తరగతి విద్యార్థి వేదాంత్ 'ఎక్స్'లో పెట్టిన పోస్ట్ వైరల్ అయింది. ఆ తర్వాత పలువురు ఇతర విద్యార్థులు కూడా ఇలాంటి ఆరోపణలతోనే సోషల్ మీడియాను ఆశ్రయించారు. తర్వాత సిబిఎస్ఇ వారిని సంప్రదించి, వారి సరైన జవాబు పత్రాలను పంచుకుంది. సరిపోలని జవాబు పత్రాలకు సంబంధించిన కేసులు, పునర్మూల్యాంకన ప్రక్రియలో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలను 'అత్యంత ప్రాధాన్యత'తో చేపట్టినట్లు బోర్డు తెలిపింది. గాంధీతో మాట్లాడిన విద్యార్థుల బృందంలో వేదాంత్ కూడా ఉన్నాడు. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం, ఐఐటి మద్రాస్, ఐఐటి కాన్పూర్ నిపుణులు, డిజిటల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డిఐసిఐ)తో కలిసి ఈ వ్యవస్థను పరిశీలిస్తూ, పోర్టల్, పేమెంట్ గేట్‌వే అనుసంధానాన్ని బలోపేతం చేస్తున్నారు. సిబిఎస్ఇ పరీక్షల కోసం ఓఎస్ఎం ప్రక్రియను నిర్వహించిన కోఎంప్ట్ సంస్థపై గాంధీ విమర్శలు గుప్పించారు. ఆ సంస్థ తన పాత పేరు గ్లోబరేనాతోనే ఇప్పటికే వివాదంలో చిక్కుకుందని ఆయన ఆరోపించారు. ఈ మొత్తం కుంభకోణం వెనుక ఉన్న నిజాన్ని వెలికితీసేందుకు స్వతంత్ర న్యాయ విచారణతో పాటు సిట్ విచారణ జరపాలని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు డిమాండ్ చేశారు. తెలంగాణలో అస్పష్టమైన గతం ఉన్న సంస్థకు బోర్డు ఈ కాంట్రాక్టును ఎందుకు ఇచ్చిందని కూడా ఆయన ప్రశ్నించారు.

# డికె కేబినెట్ కూర్పుపై ఏ ప్రతిపాదన రాలేదు

## ప్రమాణ స్వీకారం తర్వాత స్పష్టత: ఖర్గే



**కలబురిగి, మే 31:** కర్ణాటక కాబోయే ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ నేతృత్వంలో ఏర్పడే కొత్త మంత్రివర్గ కూర్పుకు సంబంధించి పార్టీ అధిష్టానానికి ఇంకా ఎటువంటి ప్రతిపాదన అందలేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలిపారు. జూన్ 3న జరిగే ప్రమాణ స్వీకార కార్యక్రమం తర్వాత జరిగే సంప్రదింపుల అనంతరం మాత్రమే మంత్రులు, కీలక నియామకాలపై నిర్ణయాలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. కలబురగిలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ, ప్రభుత్వం ఏర్పాటుకు సంబంధించిన చర్చలు కొనసాగుతున్నాయని, అయితే పార్టీ అధిష్టానానికి ఇంకా ఎటువంటి అధికారిక ప్రతిపాదన అందలేదని ఎఐసిసి అధ్యక్షుడు ఖర్గే చెప్పారు. "మనం వేచి చూడాల్సిందే. (మంత్రుల నియామకంపై) మాకు ఇంకా ఎటువంటి ప్రతిపాదన రాలేదు. ఆ ప్రతిపాదన అందిన తర్వాతే, ఎంత మంది మంత్రులను, ఉప ముఖ్యమంత్రులను నియమించాలి? వారితో పాటే కీలకమైన చైర్మన్ పదవులను కూడా భర్తీ చేయాలా? అనే అంశాలపై చర్చలు జరుగుతాయి," అని ఆయన అన్నారు. మంత్రివర్గ కూర్పుపై పూర్తి స్పష్టత ప్రమాణ స్వీకార కార్యక్రమం తర్వాతే వస్తుందని ఖర్గే పేర్కొన్నారు. "ఈ అంశాలన్నీ ప్రస్తుతం చర్చల దశలో ఉన్నాయి. జూన్ 3 తర్వాతే మనకు పూర్తి వివరాలు తెలుస్తాయి. ప్రస్తుతానికి మనం వేచి చూడక తప్పదు," అని ఆయన అన్నారు. దశలవారీగా మంత్రివర్గ విస్తరణ జరిగే అవకాశం ఉందా అని అడగగా, కాబోయే ముఖ్యమంత్రి నుంచి పార్టీకి ఇంకా ఎటువంటి వివరాలు అందలేదని ఖర్గే తెలిపారు. "ఆయన (కాబోయే సీఎం) ఎనిమిది మందిని నియమిస్తారా లేక పది మందిని నియమిస్తారా అనేదానికి సంబంధించి మాకు ఇంకా ఎటువంటి ప్రతిపాదన రాలేదు. ఆ ప్రతిపాదన అందిన తర్వాత, మొదట ఒక దశ పూర్తి చేసి, ఆపై 15 రోజులు లేదా ఒక నెల గడిచాక మిగిలిన (పదవుల) కోసం రెండో దశను చేపట్టే అవకాశం ఉంది" అని ఆయన చెప్పారు. మంత్రి పదవుల ఆశావహులకు అవకాశం కల్పించే విషయంపై ప్రశ్నించగా, చర్చలు కొనసాగుతున్నాయని, అయితే అధిష్టానానికి ఇంకా ఎటువంటి నిర్దిష్ట ప్రణాళిక అందలేదని ఖర్గే తెలిపారు. "మరో దశలో మిగిలిన సభ్యులకు కూడా అవకాశం కల్పించాలనే ఆలోచన ఉంది. అటువంటి చర్చ జరుగుతోంది కానీ, కాబోయే ముఖ్యమంత్రి కచ్చితంగా ఏమని ఆలోచిస్తున్నారో మాకు ఇంకా తెలియదు. మాకు ఇంకా ఎటువంటి సమాచారం రాలేదు" అని ఆయన అన్నారు.



# సొంతనియోజకవర్గంలోనే ఎంపి కళ్యాణ్ బెనర్జీపై దాడి

**కోల్‌కత్తా, మే 31:** అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస నేతలపై దాడుల పరంపర కొనసాగుతున్నది. టీఎంసీ నేతలపై వరుస దాడులు జరుగుతుండటం కలకలం రేపుతోంది. పార్టీ అగ్ర నేత, మమతాబెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ పై దాడి జరిగిన మరుసటి రోజే ఆదివారం ఉదయం మరో టీఎంసీ ఎంపీపై దాడి జరిగింది. ఆయన సొంత నియోజకవర్గంలోనే కొందరు ఆయనపై దాడికి పాల్పడ్డారు. హుగ్లీ జిల్లాలోని చండీతాలలో ఎంపీ కళ్యాణ్ బెనర్జీ పర్యటిస్తుండగా ఈఘటన చోటుచేసుకుంది. భద్రతా సిబ్బంది జనాన్ని అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్న సమయంలోనే కొందరు ఆయన తలపై కొట్టారు. ఈ అనూహ్య పరిణామంతో ఆయన తలపట్టుకుని కిందపడిపోయారు. ఈ ఘటనతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. దాడికి ముందు కొందరు వ్యక్తులు కల్యాణ్ బెనర్జీకి నల్ల జెండాలు చూపిస్తూ చోర్ చోర్(దొంగ దొంగ) అని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. శనివారం దక్షిణ 24 పరగణాల జిల్లా సోనార్‌పూర్‌లో అభిషేక్ బెనర్జీ పర్యటనలోనూ ఇలాంటి దృశ్యాలే కనిపించాయి. రెండు రోజుల వ్యవధిలో ఇద్దరు కీలక టీఎంసీ నేతలపై ఒకే తరహాలో దాడులు, నిరసనలు జరగడం రాష్ట్ర రాజకీయాల్లో ఉద్రిక్తతలకు తావిచ్చినట్లయింది.

# వియత్నాంకు బ్రహ్మోస్ క్షిపణులు

## ఒప్పందంపై భారత్ సంతకాలు

## ఇండోనేసియాకూ విక్రయంపై చర్చలు






**న్యూఢిల్లీ, మే 31:** వియత్నాంకు బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణులను ఎగుమతి చేసేందుకు భారత్ ఒక ఒప్పందంపై సంతకం చేసిందని, ఇండోనేషియాతో ఇదే తరహా ఒప్పందం తుది దశలో ఉందని రక్షణ శాఖ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ తెలిపారు. సింగపూర్‌లో నిర్వహించిన షాంగ్రిలా డైలాగ్‌లో ప్రసంగిస్తూ, వియత్నాం ఒప్పందం ఇప్పటికే ఖరారైందని, అయితే దానిని బహిరంగంగా ప్రకటించలేదని సింగ్ చెప్పారు. 'నాకు తెలిసినంత వరకు, ఇండోనేషియా, వియత్నాం రెండింటితోనూ ఒప్పందం తుది దశలో ఉంది. వాస్తవానికి, వియత్నాంతో ఒప్పందంపై ఇప్పటికే సంతకాలు జరిగాయని భావిస్తున్నాను. బహుశా దీనిని బహిరంగంగా ప్రకటించక పోయినా, సంతకాలు జరిగిపోయాయి' అని ఆయన అన్నారు. రక్షణ సహకారం గురించి ప్రస్తావిస్తూ, విశ్వసనీయ భాగస్వాములతో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని పంచుకుంటున్నామని, ఆసియాన్ దేశాలకు భారతదేశ నిబద్ధతను ఆయన నొక్కి చెప్పారు. 'మీరు విశ్వసించే వారితోనే సాంకేతికతను పంచుకుంటారు కదా' అని ఆయన అన్నారు. ప్రైవేట్ రంగ భాగస్వామ్యాన్ని విస్తరించడం, స్వదేశీ ఉత్పత్తిని బలోపేతం చేయడం, పటిష్టమైన సరఫరా వ్యవస్థను నిర్మించడం వంటి సంస్కరణల మద్దతుతో భారతదేశం రక్షణ తయారీ, నిర్వహణ కేంద్రంగా నిలుస్తోందని ఆయన తెలిపారు. మరోవైపు ఇండోనేషియాకు బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణులను ఎగుమతి చేసే అంశంపై చర్చలు కొనసాగుతున్నాయని, త్వరలోనే కొలిక్కి వచ్చే అవకాశముందని రక్షణ శాఖ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ తెలిపారు.

# అమెరికా డ్రోన్‌ను కూల్చేశాం: ఇరాన్



**టెహ్రాన్, మే 31:** అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యాయి. తాజాగా తమ గగనతలంలోకి ప్రవేశించిన అమెరికాకు చెందిన ఎంక్యూ-1 డ్రోన్‌ను కూల్చివేసినట్లు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జిసి) ఆదివారం ప్రకటించింది.

శత్రుత్వ కార్యకలాపాలు నిర్వహించే ఉద్దేశంతో తమ జలాల్లోకి ప్రవేశించిన డ్రోన్‌ను వెంటనే గుర్తించి, గగనతల రక్షణ క్షిపణులతో కూల్చివేసినట్లు ఐఆర్‌జిసి తన ప్రకటనలో పేర్కొన్నది. ఈ విషయాన్ని ఇరాన్ ప్రభుత్వ వార్తా సంస్థ వెల్లడించింది. ఇటీవలి కాలంలో అమెరికా-ఇరాన్ దేశాల మధ్య దా డులు, ప్రతిదాడులు పెరిగాయి.

గత మంగళ వారం కూడా అమెరికాకు చెందిన ఎంక్యూ-9 డ్రోన్‌ను తమ గగనతల రక్షణ విభాగాలు కూల్చి వేశాయని ఐఆర్‌జిసి తెలిపింది. అమెరికా కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే ప్రతీకారం తీర్చుకునే హక్కు తమకు ఉందని అప్పుడే ఇరాన్ హెచ్చరించింది. తమ గగనతలంలోకి ప్రవేశించిన ఒక యుద్ధ విమానంపై కూడా కాల్పులు జరి పినట్లు స్థానిక మీడియా కథనాలు పేర్కొన్నాయి. మరోవైపు, ఇరాన్‌పై తాము 'ఆత్మరక్షణ దాడులు' చేసినట్లు అమెరికా ప్రకటించింది.
సోమవారం దక్షిణ ఇరాన్‌లోని క్షిపణి ప్రయోగ కేంద్రాలు, మైన్‌లను అమర్చేందుకు ప్రయత్నిస్తున్న పడవలపై దాడులు చేసినట్లు యుఎస్ సెంట్రల్ కమాండ్ (సెంట్రకామ్) తెలిపింది. తమ దళాలను ఇరాన్ నుంచి వచ్చే ముప్పుల నుంచి కాపాడుకోవడానికే ఈ దాడులు నిర్వహించామని, కాల్పుల విరమణ కొనసాగుతున్నప్పటికీ తమ దళాల రక్షణకు కట్టుబడి ఉన్నామని సెంట్రకామ్ ప్రతినిధి టిమ్ హాకిన్స్ ఒక ప్రకటనలో తెలిపారు.

అంతేకాకుండా గురువారం రాత్రి కూడా ఇరాన్‌లోని ఒక సైనిక స్థావరంపై అమెరికా దాడులు నిర్వహించింది.

# పెట్రో ఉత్పత్తులపై విండ్‌ఫాల్ ట్యాక్స్ తగ్గింపు



**న్యూఢిల్లీ, మే 31:** ఆయిల్ కంపెనీలకు ఉపశమనం కలిగిస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులపై విండ్‌ఫాల్ గైన్స్ పన్నును కేంద్రం తగ్గిస్తూ ఆర్థిక మంత్రిత్వశాఖ ఆదివారం నోటిఫికేషన్ జారీ చేసింది. పెట్రోలియం ఎగుమతులపై ప్రత్యేక అదనపు ఎక్సైజ్ డ్యూటీని లీటరుకు రూ.1.5 చొప్పున తగ్గించింది. డీజిల్ ఎగుమతులపై లీటరుకు రూ.13.5గా నిర్ణయించారు. ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ఎగుమతులపై లీటరుకు రూ.9.50 పన్ను విధించనున్నారు. సవరించిన రేట్లు జూన్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి. దేశీయ మార్కెట్‌లో విక్రయించే పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీలో మాత్రం ఎలాంటి మార్పు లేదని ప్రభుత్వం వివరణ ఇచ్చింది. పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులకే ఈ సవరణ వర్తిస్తుందని స్పష్టం చేసింది. మరో కీలక నిర్ణయం కూడా కేంద్రం తీసుకుంది. పెట్రోల్, డీజిల్ ఎగుమతులపై విధించే రోడ్డు, మౌలిక సదుపాయాల సెస్‌ను పూర్తిగా తగ్గించింది. ఈ చర్య ఎగుమతిదారులపై పన్ను భారం తగ్గించనుంది. విండ్‌ఫాల్ పన్ను అంటే దేశీయ మార్కెట్‌లో ఇంధన లభ్యతను నిర్ధారించడం, అంతర్జాతీయ ధరల వ్యత్యాసం వల్ల ఎగుమతిదారులు అధిక లాభాలు పొందకుండా నియంత్రించడానికి కేంద్రం ఈ విండ్‌ఫాల్ పన్నును ప్రవేశపెట్టింది. అంతర్జాతీయ మార్కెట్లో హెచ్చుతగ్గుల ఆధారంగా ఈ రేట్లను ఎప్పటికప్పుడు ప్రభుత్వం సమీక్షిస్తుంటుంది. ప్రస్తుతం గ్లోబల్ చమురు మార్కెట్లు కొంత స్థిరత్వం దిశగా పయనిస్తుండటంతో ప్రభుత్వం విండ్‌ఫాల్ పన్నును తగ్గించాలనే నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.

## సంక్షిప్తంగా..

# సిడిఎస్‌గా రాజా సుబ్రమణి బాధ్యతల స్వీకారం



**న్యూఢిల్లీ,మే 31:** భారత నూతన చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ సిడిఎస్‌గా జనరల్ రాజా సుబ్రమణి బాధ్యతలు స్వీకరించారు. ఆదివారం భారత మాజీ సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ ఆయనకు బాధ్యతలు అప్పగించారు. దాంతో మిలిటరీ థియేటరైజేషన్ బాధ్యతలను ఇక నుంచి సుబ్రమణి పర్యవేక్షించనున్నారు. వీటి ద్వారానే భారత త్రివిధ దళాల్లో సమన్వయం పెరుగుతుందని అం చనా వేస్తున్నారు. జనరల్ రాజా సుబ్రమణికి చైనా, పాకిస్థాన్ అంశాల్లో నైపుణ్యం కలిగిన అధి కారిగా సైనిక వర్గాల్లో పేరుంది. నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రెటేరియట్‌కు మిలిటరీ అడ్వైజర్‌గా కూడా పనిచేశారు. వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీస్టాఫ్‌గానూ బాధ్యతలు నిర్వహించారు. తాజా బాధ్యతల్లో ఆయన ఇంటిగ్రేటెడ్ మిలిటరీ కమాండ్స్ ఏర్పాటుతో థియేటరైజేషన్ ప్రక్రియను కూడా పూర్తి చేయాల్సి ఉంటుంది.


# 30కి.మీ మేర స్తంభించిన చార్‌ధామ్ ట్రాఫిక్



**డెహ్రాడూన్, మే 31:** ఉత్తరాఖండ్‌లో చార్‌ధామ్ యాత్రకు భక్తులు పోటెత్తడంతో వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. చార్‌ధామ్ యాత్రలో భాగంగా బద్రీనాథ్ వెళుతున్న భక్తులు భారీ ట్రాఫిక్‌జామ్ కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారాంతపు సెలవులు, యాత్రి కుల రద్దీ భారీగా పెరగడంతో కేదార్‌నాథ్, జోషి మఠ్, గోవింద్ ఘాట్స్ సమీపంలోని బద్రీనాథ్ మార్గం అలాగే కేదార్‌నాథ్‌కు దారితీసే సోన్ ప్రయాగ్ వంటి కీలక మార్గాల్లో త్రీ ట్రాఫిక్ జామ్ ఏర్పడుతున్నది. ముఖ్యంగా జోషిమఠ్ నుండి బద్రీనాథ్ వరకు 25 నుండి 30 కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరడంతో యాత్రికులు గంటల తరబడి ఎదురు చూడాల్సి వస్తున్నది.

# 18 యేళ్లుగా సర్కారు నౌకరీకోసం ఎదురుచూపులు

## రిటైర్‌మెంట్ వయసు దాటాకా చేతికి అందిన అపాయింట్‌మెంట్



**మలప్పురం, మే 31:** ప్రభుత్వ ఉద్యోగం కోసం ఏళ్ల తరబడి ఎదురుచూసిన ఓ వ్యక్తికి, సరిగ్గా ఉద్యోగ విరమణ వయసు దాటాక నియామక పత్రం చేతికి అందిన సంఘటన కేరళలో చోటుచేసుకుంది. 18 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత కేరళ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (పీఎస్‌సీ) పంపిన ఈ లేఖ సంతోషానికి బదులు ఆయనకు తీరని వేదనను మిగిల్చింది. మలప్పురం జిల్లా కాళికావుకు చెందిన అబ్దుల్ మజీద్ 2005లో పార్ట్ టైమ్ జూనియర్ అరబిక్ టీచర్ పోస్టు కోసం పీఎస్‌సీ నిర్వహించిన పరీక్ష రాశారు. ఆ తర్వాత విడుదలైన ర్యాంక్ జాబితాలో ఆయన పేరు కూడా ఉంది. ఆ ర్యాంక్ లిస్ట్ గడువు 2008లోనే ముగిసిపోయింది. దీంతో ఉద్యోగంపై ఆశలు వదులుకున్న మజీద్‌కు, గత నెలలో అనూహ్యంగా పీఎస్‌సీనుంచి నియామక ఉత్తర్వు (అడ్వైజ్ మెమో)అందింది. ఇది చూసి ఆయన ఆనందించాలో, బాధపడాలో తెలియని స్థితిలో పడిపోయారు. ఈ పోస్టుకు సంబంధించి పలు మార్లు నోటిఫికేషన్లు ఇచ్చినా అర్హులైన అభ్యర్థులు దొరకలేదని తెలుస్తోంది. దీంతో చాలాకాలంగా ఖాళీగా ఉన్న పోస్టును భర్తీ చేసేందుకు అధికారులు పాత ఫైళ్లను పరిశీలించి, మజీద్‌ను ఎంపిక చేశారు. ఈ పరిణామంపై మజీద్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగం నా కల. కానీ దానిని నెరవేర్చుకోవడానికి పీఎస్‌సీ 18 ఏళ్లు తీసుకుంది. ఇప్పుడు నేను ఉద్యోగంలో చేరే వయసు కూడా దాటిపోయాను. ఈ లేఖతో నాకేం ప్రయోజనమని ఆయన వాపోయారు. నిబంధనల ప్రకారం, నియామక పత్రం అందిన మూడు నెలల్లోగా ఉద్యోగంలో చేరాలి. మజీద్ ఎస్‌ఎస్‌ఎల్‌సీ సర్టిఫికెట్ ప్రకారం ఆయన పుట్టిన తేదీ 1966 మే 27. అంటే, ఈ ఉత్తర్వు అందే సమయానికే ఆయనకు 60 ఏళ్లు సమీపించాయి. ఇప్పటికే ఆయన అధికారికంగా ఉద్యోగ విరమణ వయసును దాటేశారు. దీంతో సాంకేతికంగా ఆయన ఆ ఉద్యోగంలో చేరే అర్హతను కోల్పోయి దశాబ్దాల కల చేతికి అందినట్టే అంది చేజారి ఆయనకు నిరాశనే మిగిల్చింది.

### లోయలో పడిన టూరిస్టు ట్యాక్సీ


# డ్రైవర్,ఇద్దరు చిన్నారులు సహా 8 మంది మృతి

**సిమ్లా, మే 31:**హిమాచల్‌ప్రదేశ్‌లో పర్యాటకులతో వెళ్తున్న ఓటూరిస్టు ట్యాక్సీ అదుపుతప్పి లోతైన లోయలో పడిపోయింది. ఈ దుర్ఘటనలో డ్రైవర్, ఇద్దరు చిన్నారులు సహా మొత్తం ఎనిమిది మంది మృతిచెందారు. మృతుల్లో బెంగళూరు, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన రెండు కుటుంబాల వాళ్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. చంబా జిల్లాలోని బైరాగఢ్‌సచ్ పాస్ మార్గంలో కాలాబన్ సమీపంలో ఈ విషాదం జరిగింది. బెంగళూరుకు చెందిన ఓ కుటుంబం, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన మరో కుటుంబం వేసవి సెలవుల కోసం డల్హౌసీ హిల్‌స్టేషన్‌కు వచ్చారు. అక్కడే ఓ ట్యాక్సీని అద్దెకు తీసుకుని, మంచు పర్వతాలను చూసేందుకు సచ్ పాస్ మార్గంలో బయలుదేరారు. అయితే వారు తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన ట్యాక్సీ యజమాని వాహనానికి ఉన్న జీపీఎస్ సిగ్నల్‌ను ట్రాక్ చేశాడు. కాలాబన్ సమీపంలో వాహనం కదలకుండా ఒకే చోట ఉన్నట్లు చూపించడంతో అనుమానంతో పోలీసులకు సమాచారం అందించాడు. పరిశీలనలో వాహనం లోయలో పడిపోయినట్లు తేలింది. ప్రమాదం జరిగిన ప్రాంతం మారుమూల ప్రాంతం కావడం, అక్కడ ఎలాంటి మొబైల్ నెట్‌వర్క్ సిగ్నల్స్ లేకపోవడంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. ఈ ఘటనపై హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్‌సుఖు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాలింపు చర్యలను ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎనిమిది మందితో వెళ్తున్న వాహనం లోయలో పడిపోవడం అత్యంత బాధాకరమని, స్థానిక యంత్రాంగం, ప్రజల సహాయంతో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

# కులూ జిల్లాలో తుపాకీ కాల్పుల కలకలం

**సిమ్లా, మే 31:** హిమాచల్ ప్రదేశ్‌లోని కులూ జిల్లాలో తుపాకీ కాల్పులు కలకలం రేపింది. పర్యాటక ప్రాంతమైన కసోల్ పర్యాటకులతో సందడిగా మారింది. శనివారం సాయంత్రం 6 గంటల సమయంలో ప్రసిద్ధ గ్రీన్ వ్యాలీ హోటల్‌లో ఒక విషయంపై రెండు వర్గాల మధ్య వాగ్వాదం చెలరేగింది. అది ఘర్షణగా మారడంతో పంజాబ్‌కు చెందిన ఒక పర్యాటకుడు పిస్టల్ తీసి కాల్పులు జరిపాడు. అయితే స్థానికుడైన వ్యక్తి కాలికి తగలడంతో గాయమైంది. దీంతో బాధతో అతడు కుప్పకూలిపోయాడు. ఆ తర్వాత హోటల్ పార్కింగ్ ప్రాంతం నుంచి ఆ వ్యక్తి బయటకు వెళ్తుండగా కాల్పులు జరిపిన పర్యాటకుడు చేతిలోని గన్‌తో అనుసరించాడు. అతడు మరోసారి పిస్టల్ గురిపెట్టగా పంజాబ్‌కు చెందిన ఇతర పర్యాటకులు అడ్డుకున్నారు.

# బ్యూఫోర్ట్ క్యాజిల్‌ను స్వాధీనంచేసుకున్న ఇజ్రాయెల్



**బీరూట్, మే 31:** దక్షిణ లెబనాన్‌లోని బ్యూఫోర్ట్ క్యాజిల్‌ను ఇజ్రాయెల్‌కు చెందిన గోలానీ బ్రిగేడ్ దళాలు స్వాధీనం చేసుకొన్నాయి. అనంతరం బ్యూఫోర్ట్ క్యాజిల్‌పై ఇజ్రాయెల్ పతాకాలను ఎగరవేశాయి. 1982లో లెబనాన్‌తో తొలి యుద్ధంలో ఇజ్రాయెల్ దళాలు ఈ కోటను మొదటిసారి స్వాధీనం చేసుకొన్నాయి. అప్పుడు కూడా గోలానీ బ్రిగేడ్ దళాలే పాలస్తీనా లిబరేషన్ ఆర్గనైజేషన్ దళాలతో పోరాడి కోటను ఆక్రమించాయి. నాటి నుంచి 2000 సంవత్సరం వరకు ఈ కోట ఇజ్రాయెల్ ఆధీనంలోనే ఉంది. ఆ తర్వాత లెబనాన్ ఆధీనంలోకి వచ్చింది. తాజాగా ఇజ్రాయెల్‌పై హమాస్ దళాలు భారీగా దాడులు చేసిన మర్నాడే తిరిగి ఈ కోటను ఐడీఎఫ్ స్వాధీనం చేసుకుంది. దక్షిణ లెబనాన్, ఉత్తర ఇజ్రాయెల్‌పై నిఘా పెట్టడానికి ఈ కోట అత్యంత వ్యూహాత్మక ప్రదేశం. ఈ ప్రాంతంలోని రాకెట్ లాంచింగ్ వ్యవస్థలపై తాము దృష్టి పెట్టబోతున్నట్లు ఇజ్రాయెల్ బలగాలు వెల్లడించాయి. బ్యాటిల్ ఆఫ్ బ్యూఫోర్ట్ ముగిసిన 44 ఏళ్ల తర్వాత ఇజ్రాయెలీ దళాలు తిరిగి ఆ కోటపై పతాకాలను ఎగురవేశాయని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ ప్రకటించారు. ఈ కోటను స్వాధీనం చేసుకోవడానికి యుద్ధ విమానాల సాయంతో ఇజ్రాయెల్ దళాలు భారీ ఎత్తున బాంబింగ్ నిర్వహించాయి. అదేవిధంగా భూతల పోరాటం కూడా చేసి చివరకు కోటను దక్కించుకున్నాయి.

# బాబాగా మారాలని జననాంగం కోసుకున్న ప్రబుద్ధుడు..

**ఛతార్‌పూర్, ఎంపి, మే 31:** ప్రాపంచిక సుఖాలను వదిలిపెట్టి భక్తి మార్గంలో వెళ్లాలనుకుని బాబాగా మారాలని భావించిన ఓ వ్యక్తి తన జననాంగాన్ని గొడ్డలితో నరుక్కొని బావిలో పడేశాడు. ఈ సంఘటన మధ్యప్రదేశ్‌లోని ఛతర్‌పూర్ జిల్లాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే రాం మిలాన్ అనే ఓ రైతు (42) పాప భీతి నుంచి విముక్తి పొంది సన్యాస జీవితాన్ని గడపాలని, అలాగే ప్రాపంచిక కోరికలకు దూరంగా ఉండాలని ఆకాంక్షించి తీవ్రమైన మానసిక వ్యథకు లోనయ్యాడు. తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లిన సదరు వ్యక్తి గొడ్డలితో తన జననాంగాన్ని కట్ చేసుకోవడంతో తీవ్ర రక్తస్రావం అయింది. ఇదే విషయాన్ని కుటుంబ సభ్యులకు ఫోన్‌లో తెలిపాడు. వెంటనే బాధితుడిని కుటుంబ సభ్యులు ఛతర్‌పూర్ జిల్లా దవాఖానకు తరలించారు.

# డబ్బుసంచితో చెట్టుపైకి ఉడాయించిన కోతి

## కరెన్సీనోట్లు కిందికి విసిరేసిన వైనం

**బులంద్‌షహర్, మే 31:** ఉత్తరప్రదేశ్‌లో ఒక ఆసక్తికర సంఘటన జరిగింది. ఒక కోతి చెట్టుపై నుంచి రెండు లక్షల రూపాయల నోట్లు కురిపించిన వైనంసోషల్‌మీడియాలో వైరల్ అయింది. ఉత్తర్ ప్రదేశ్, బులంద్ షహర్ ప్రాంతానికి చెందిన ఒక లాయర్ కచేరి రోడ్‌లో వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. ఆ లాయర్ ఒక ప్రాపర్టీ రిజిస్ట్రేషన్ కోసం రూ.2లక్షల నగదు ఉన్న బ్యాగును చేతిలో పట్టుకుని నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఉన్నట్లుండి ఒక కోతి వెనుక నుంచి వచ్చి ఆ బ్యాగును ఎత్తుకుని పోయింది. దగ్గర్లో ఉన్న ఒక చెట్టు పైకి ఎక్కింది. ఆ బ్యాగ్ ఓపెన్ చేసి, అందులో ఉన్న కరెన్సీ నోట్లను చెట్టు పైనుంచి కిందికి విసిరేయడం షురూచేసింది. అలా రూ.500 నోట్లను వరుసగా కిందికి విసిరేస్తూనే ఉంది. కిందే ఉన్న లాయర్, అతడి అసిస్టెంట్ ఏమీ చేయలేక చూస్తుండిపోయారు. ఇదే క్రమంలో చెట్టుపైనుంచి రూ.500 కరెన్సీ నోట్లు కింద పడటం చూసిన స్థానికులు కొందరు అక్క డికి వచ్చి ఆ నోట్లను ఏరుకున్నారు. ఇంకొందరు ఆ నోట్లను తీసి, లాయర్‌కు అప్పగించారు. కొం తసేపటి తర్వాత ఒక వ్యక్తి ఆ చెట్టు పైకి ఎక్కి, కోతిని భయపెట్టేందుకు ప్రయత్నించాడు. అలా కొంతసేపు ప్రయత్నించిన తర్వాత ఆ కోతి నోట్లున్న బ్యాగును అక్కడే వదిలేసి వెళ్లిపోయింది. అనంతరం ఆ బ్యాగును ఎలాగోలా లాయర్ తీసుకున్నాడు. కానీ, ఈలోపే ఆ రూ.2 లక్షల నోట్లలో చాలా వరకు కోతి కింద పడేసింది. కొందరు ఆ నోట్లను తీసుకుని వెళ్లిపోయారు. ఇంకొందరు తిరిగిచ్చారు. అందరిదగ్గరి నుంచి నోట్లు కలెక్ట్ చేసి, కింద పడ్డ నోట్లను ఏరిన తర్వాత చూస్తే కొంత నగదు తగ్గింది. ఈ విషయంపై అతడు పోలీసులకు కూడా ఫిర్యాదు చేశాడు. ఈ తతంగం మొత్తం అక్కడి సీసీ కెమెరాల్లో రికార్డైంది. మరికొందరు తమ సెల్‌ఫోన్లలో రికార్డ్ చేశారు.

# హత్యకేసు నిందితుడు ఎన్‌కౌంటర్



**ఘజియాబాద్,మే 31:** ఉత్తరప్రదేశ్ లోని ఘజియాబాద్ పట్టణంలో సంచలనం సృష్టించిన 17 ఏళ్ల బాలుడు సూర్యప్రతాప్ చౌహాన్ హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న అసద్ ఈ ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. పోలీసులపై కాల్పులు జరిపి తప్పించుకునేందుకు యత్నించిన అసద్‌ను పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారు. తీవ్రంగా గాయపడిన అసద్ ఆసుపత్రిలో మంణించాడు. ఈ ఆపరేషన్‌లో ఒక పోలీస్ కానిస్టేబుల్‌కు కూడా గాయాలయ్యాయి. బక్రీద్ పండుగ రోజున ఖోడా పోలీస్ స్టేషన్ పరిధిలో సూర్యప్రతాప్ చౌహాన్‌ను అసద్, అతడి అను చరులు కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేశారు. ఈ ఘటనతో స్థానికంగా తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

# మంజీరా నదిలో మునిగి ఇద్దరు గొర్రెలకాపర్లు మృతి

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** నిజామాబాద్ జిల్లా పోతంగల్‌లో విషాదం చోటుచేసుకుంది. స్థానిక గొర్రెల కాపర్లు గొర్రెలను మేపేందుకు మంజీరా నదికి వచ్చి, వాటిని నీటిలో కడుగుతున్న క్రమంలో ఇద్దరు నీటిలో మునిగి మరణించారు. ఉదయం పది గంటల సమయంలో జరిగిన ఈ ఘటన పోతంగల్‌లో తీవ్ర విషాదాన్ని నింపింది. వివరాలు ఇలావున్నాయి. పోతంగల్‌కు చెందిన గంగారం(50), గంగొండ(43)తోపాటు మరికొందరు తమ గొర్రెలను తోలుకుని సమీపంలోని మంజీరా నది వద్దకు వచ్చారు. ఇక్కడికి వారు నిత్యం వస్తుంటారు. గొర్రెలను మేత కోసం తీసుకురాగా ఇదే సమయంలో నదిలో వాటిని కడుగుతున్న క్రమంలో గంగారం అక్కడే వున్న ఓ గుంతలో మునిగి పోగా అతన్ని కాపాడేందుకు గంగొండ నీటిలో దూకాడు. అయితే ఇద్దరికి ఈత రాకపోవడంతో నీటిలో మునిగి చనిపోయారు. దూరంగా వున్న మిగతా వారు దీనిని గమనించి గ్రామస్థులకు సమాచారం అందించగా వారు వెంటనే రంగంలో దిగి పోలీసుల సహాయంతో నీటిలో మునిగిపోయిన గంగారాం, గంగొండలను బయటకు తీసుకువచ్చారు. అయితే అప్పటికే వారు చనిపోయారు. దీనిపై కోటగిరి పోలీసులు కేసు నమోదు చేసి నీటి లో మునిగి చనిపోయిన గొర్రెల కాపర్లు గంగారాం, గంగొండల మృతదేహాలను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం చేయించిన తరువాత వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటన పోతంగల్ గ్రామంలో విషాదం నింపింది. దీనిపై కోటగిరి ఎస్ఐ సునీల్ విచారణ చేస్తున్నారు.

# ఆర్థిక ఆస్తుల కోసం కామన్ ల్యాండింగ్ పోర్టల్

### ఆర్థిక విభాగం, ప్రభుత్వరంగ బ్యాంకుల అలయన్స్

### కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి నాగరాజు

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** క్లెయిమ్ చేయని ఆర్థిక ఆస్తులకు సంబంధించిన సమాచారాన్ని సులభంగా పొందేందుకు వీలుగా, ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆర్థిక సేవల విభాగం (డిఎఫ్ఎస్) ప్రభుత్వ రంగ బ్యాంకుల (పిఎస్‌బి) అలయన్స్‌తో కలిసి అభివృద్ధి చేసిన క్లెయిమ్ చేయని ఆర్థిక ఆస్తుల కోసం కామన్ ల్యాండింగ్ పోర్టల్‌ను ఈరోజు ప్రారంభించింది. ప్రభుత్వ రంగ బ్యాంకుల సమీక్షా సమావేశంలో ఆర్థిక సేవల శాఖ కార్యదర్శి ఎం. నాగరాజు ఈ పోర్టల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోర్టల్, ఆర్థిక వ్యవస్థ అంతటా అందుబాటులో ఉన్న క్లెయిమ్ చేయని బ్యాంకు డిపాజిట్లు, బీమా క్లెయిములు, షేర్లు, డివిడెండ్లు, మ్యూచువల్ ఫండ్‌లకు సంబంధించిన ఏకీకృత వేదికగా పనిచేస్తుందన్నారు. దావా చేయని ఆర్థిక ఆస్తుల గురించి అవగాహన కల్పించడం, వాటిని గుర్తించడం, తిరిగి అప్పగించడాన్ని సులభతరం చేయడానికి కేంద్రం చర్యలు చేపట్టిందని తెలిపారు. ఆర్థిక రంగ నియంత్రణ సంస్థలు, బ్యాంకులు మరియు ఇతర భాగస్వాములతో సమన్వయంతో ఆర్థిక సేవల విభాగం చేపట్టిన మీ డబ్బు-మీ హక్కు అనే దేశవ్యాప్త ప్రచారం కొనసాగింపుగా ఈ కార్యక్రమం రూపొందించబడిందని వివరించారు. ఒకే వేదికపై పలు శోధన సౌకర్యాలను ప్రొవ్రతను ఏకీకృతం చేయడం ద్వారా ఈ పోర్టల్ పౌరుల సౌలభ్యాన్ని మెరుగుపరుస్తుందని, అలాగే వ్యక్తులు వారి చట్టబద్ధమైన ఆర్థిక ఆస్తులతో తిరిగి అనుసంధానించే దిశగా కొనసాగుతున్న ప్రయత్నాలను బలోపేతం చేస్తుందని నొక్కి చెప్పారు. మరింత అందుబాటులో ఉండే, పారదర్శకమైన, పౌరకేంద్రీకృత ఆర్థిక వ్యవస్థను నిర్మించడంలో కామన్ ల్యాండింగ్ పోర్టల్ ఒక ముఖ్యమైన ముందడుగన్నారు. ఈ చొరవ ద్వారా ప్రజలలో అవగాహన పెంచడం, సమాచారాన్ని సులభంగా పొందే వీలు కల్పించడం ప్రధానమని వెల్లడించారు. అలాగే ఆర్థిక సాధికారత, సమ్మిళితత్వం, ఆర్థిక వ్యవస్థపై విశ్వాసం ద్వారా వికసిత్ భారత్ 2047 దార్శనికతకు దోహదపడుతుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.

# యువత స్ఫూర్తి పొందేలా ప్రధాని మోడీ మన్ కీ బాత్

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** ప్రధాని నరేంద్ర మోడీ ప్రతి మన్ కీ బాత్ ఎపిసోడ్ ద్వారా దేశానికి అవసరమైన అనేక స్ఫూర్తిదాయకమైన విషయాలను పంచుకుంటున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు పేర్కొ న్నారు. ఆదివారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నిర్వహించిన 134వ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్‌రావు హిమాయత్ నగర్, కె.ఎం.ఐ.టి లేన్ వద్ద పెరిక సురేష్ నివాసంలో పార్టీ నాయ కులతో కలిసి వీక్షి ంచారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మీడియాతో మాట్లా డుతూ క్రీడల్లో మన క్రీడాకారులు కనబరుస్తున్న ప్రతిభ, వారు పడుతున్న కష్టం, వారి విజయగాథలు యువతకు ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా అథ్లెటిక్స్‌లో మన వారు సాధిస్తున్న అద్భుతమైన రికార్డులు భారతదేశ సత్తాను ప్రపంచానికి చాటుతున్నాయని కొనియాడారు. చారిత్రక అంశాలను ప్రస్తావిస్తూ రాజరాజ చోళుని సముద్రయాన ఘనతను, సాహసాలను ప్రధాని గుర్తు చేయడం అభినందనీయమని అన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలను, అలాగే మన సంప్రదాయ స్వదేశీ పానీయాలైన మామిడి పన్నా, సత్తు, సబ్జా గింజలతో తయారు చేసే రసాల ప్రాముఖ్యతను వివరించడం ద్వారా సామాన్య ప్రజలకు మేలు జరిగేలా ప్రధాని దిశానిర్దేశం చేశారని పేర్కొన్నారు. మన్ కీ బాత్‌లోని ప్రతి ఎపిసోడ్ కొత్త సమాచారాన్ని, కొత్త స్ఫూర్తిని ఇస్తుందని, అందుకే ఈ కార్యక్రమాన్ని దేశ యువత తప్పక చూడాలని రాంచందర్ రావు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ అభయ పాటిల్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేందర్ గౌడ్, బిజెపి రాష్ట్ర కార్యదర్శి భరత్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# మాకొద్దీ ఇహెచ్‌ఎస్

### మా సంగతి తేల్చందే కోతలా?

### సిపిఎస్ తెలంగాణ ఎంప్లాయీస్ యూనియన్

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** సీపీఎస్ ఉద్యోగ ఉపాధ్యాయుల వేతనాల నుండి ఏకపక్షంగా ఈహెచ్‌ఎస్ కోత విధించడంపై తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ (టిఎస్‌సీపీఎస్ ఈయూ) మండిపడింది. ఆర్థిక శాఖ తీసుకున్న ఏకపక్ష నిర్ణయంపై తీవ్ర అసహనాన్ని, నిరసనను వ్యక్తం చేసింది. ఎటువంటి ముందస్తు చర్చలు లేదా ఉద్యోగుల సమ్మతి లేకుండా, వేతనాల నుండి 1.5 ఈహెచ్‌ఎస్ కోత విధిస్తూ పేస్లిప్స్‌ను జనరేట్ చేయడం రాజ్యాంగ విరుద్ధమని రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్‌లు ఆగ్రహించారు. తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల సేవా నిబంధనలు, భారత రాజ్యాంగం, దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పుల ప్రకారం, ఒక ఉద్యోగి జీతంపై సంపూర్ణ హక్కు ఆ ఉద్యోగిదే తప్ప, ప్రభుత్వానిది కాదన్నారు. ఉద్యోగి పొందే జీతం ప్రభుత్వం ఇచ్చే "భిక్ష" కాదని అది వారి కష్టానికి ప్రతిఫలమన్నారు. చట్టబద్ధమైన ప్రక్రియ లేకుండా, ఉద్యోగి జీతాన్ని కోత కోయడం రాజ్యాంగ ఉల్లంఘనే అన్నారు. సీపీఎస్ ఉద్యోగ,ఉపాధ్యాయుల జీతాల నుండి చేస్తున్న 1.5 శాతం ఈహెచ్‌ఎస్ కోతను తక్షణమే నిలిపివేయాలని, రిటైర్మెంట్ అయిన సీపీఎస్ ఉద్యోగులకు ఆరోగ్య సౌకర్యం ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. ఉద్యోగి ఆమోదం లేకుండా ఏ విధమైన ఆర్థిక నిర్ణయాలు తీసుకోరాదు, ప్రతి డీడీవో కార్యాలయంలో ఉద్యోగులు తమ అభ్యంతరాలను నమోదు చేసుకునే హక్కును కల్పించాలన్నారు.

# కెటిఆర్! నీది ఎన్‌ఆర్‌ఐ కోటా.. రేవంత్‌ది మెరిట్ కోటా

### బిఆర్‌ఎస్ హయాంలో ఒక్క గురుకులం కట్టినట్లు చూపితే దేనికైనా సిద్ధం: మంత్రి అడ్లూరి లక్ష్మణ్

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** కెటిఆర్ నువ్వు ఎన్‌ఆర్‌ఐ కోటాలో వచ్చి మంత్రి వైనావు, ముఖ్యమంత్రి స్థానిక సంస్థల నుంచి ఒక్కో మెట్టు ఎక్కుతూ సిఎం స్థాయికి ఎదిగారని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ఆదివారం సిఎల్‌పిలో ఆయన మాట్లాడుతూ మెరిట్ కోటాలో రేవంత్ సిఎం అయ్యారని ఎన్‌ఆర్‌ఐ కోటాలోని వ్యక్తి కెటిఆర్ ప్రగల్భాలు పలికితే ప్రజలన నవ్వు కొంటారని అన్నారు. కెటిఆర్ ఇదే నా ఛాలెంజ్ , బిఆర్‌ఎస్ హయాం లో ఒక్క గురుకుల భవనం నిర్మించినా నేను దేనికి అంటే దానికి సిద్ధమని అన్నారు. పదేళ్లు రాజులు గా కెటిఆర్ విర్రవీగారనీ కెటిఆర్ నువ్వు అమెరికా నుంచి వచ్చి మహేందర్‌రెడ్డి టిక్కెట్ లాక్కొని పోటీ చేశావని దుయ్యబట్టారు. గురుకులాల సంఖ్య మాత్రమే బిఆర్‌ఎస్ పెంచింది కానీ మౌళిక వసతులు ఏర్పాటు చేయలేదనీ గుర్తుచేశారు. గురుకులాలు అన్ని అద్దె భవనాల్లో ఉన్నాయనీ ఒక్క కొత్త భవనాన్ని బిఆర్‌ఎస్ నిర్మించలేదనీ ఆయన తెలిపారు. కాంగ్రెస్ అధికా రంలో వచ్చాక డైట్ ఛార్జీలు పెంచాం, వసతులు కల్పిస్తున్నామనీ అన్నారు. అణగారివర్గాలపై కెటిఆర్‌కు చులకన భావం అనీ మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ నాకు ప్రత్యర్థి అయినా ఆయన పాపం సౌమ్యుడు ఆయనను కెటిఆర్ మీడియా ముందు దారుణంగా అవమానించారనీ ఆవేదన చెందారు. 38 వేల మందికి దళితబంధు ఇచ్చి అందరికీ ఇచ్చాం అని కెటిఆర్ ప్రగల్భాలు పలుకుతున్నారనీ విమర్శిం చారు. ఎన్నికల్లో ఓడిన నన్ను భుజం తట్టి ఈరోజు మంత్రిగా రేవంత్‌రెడ్డి నిలబెట్టారు. బాల్క సుమన్ వ్యాఖ్యలు మనిషి వలే లేవని కాల బెట తం, కూలగొడతం అంటే అరెస్ట్ చేయరా అని ప్రశ్నిం చారు. మాజీ ప్రజాప్రతినిధిగా బాల్క సుమన్ వ్యాఖ్యలు అత్యంత దారుణంగా ఉన్నాయన్నారు.

# పాఠశాల విద్య శాఖలో భారీగా బదలీలు

### అడిషనల్ డైరెక్టర్లు, డిఇఒల బదలీలు కూడా

### సమగ్ర శిక్ష ఎఎస్‌పిడిగా పివి శ్రీహరి

### మధ్యాహ్న భోజన పథకం అడిషనల్ డైరెక్టర్‌గా రమణకుమార్

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రభుత్వ శాఖల్లో సాధారణ బద లీలకు అనుమతులు కల్పించిన నేపథ్యంలో పాఠశాల విద్య శాఖలో భారీగా బదలీలు చేపట్టారు. ఐదుగురు అడిషనల్ డైరెక్టర్లతోపాటు జాయింట్ డైరక్టర్లను, జిల్లా విద్యా శాఖాధికారుల(డీఈవో)ను సైతం బదలీలు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బదలీలకు ఆదివారం చివరి రోజు కావడంతో పాఠశాల విద్య శాఖలో బదలీలను చేపట్టారు. బదలీల్లో భాగంగా సమగ్రశిక్ష అడిషనల్ స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్(ఏఎస్‌పిడి)గా పివి శ్రీహరిని బదలీ చేశారు. ప్రస్తుతం ఆయన టాస్ డైరక్టర్ కొనసాగుతూ ప్రభుత్వ పరీక్షల డైరక్టర్‌గా అదనపు బాధ్యతలు కొనసాగిస్తున్నారు. ఇప్పటి వరకు పాఠశాల విద్య శాఖ డైరక్టర్ కార్యాలయంలో అడిషనల్ డైరక్టర్ కోఆర్డినేషన్‌గా కొనసాగుతున్న కె లింగయ్యను టాస్ డైరక్టర్‌గా ప్రభుత్వ పరీక్షల డైరక్టర్‌గా ఎఫ్ ఏసీ బాధ్యతలు ఇచ్చారు. ప్రస్తుతం టిజిఆం ఈఐఎస్ సెక్రటరీగా ఉన్న సిహెచ్ రమణ కుమార్‌ను మధ్యాహ్న భోజన పథకం అడిషనల్ డైరెక్టర్‌గా బదలీ చేశారు. సమగ్ర శిక్ష ఏఎస్‌పీడీగా ఉన్న రాధారెడ్డిని గవర్నమెంట్ టెక్ట్స్ బుక్ ప్రెస్ డైరెక్టర్‌గా బదలీ చేశారు. మధ్యాహ్న భోజన పథకం అడిషనల్ డైరక్టర్‌గా ఉన్న జి ఉషారాణిని టిజిఆర్‌ఈఐఎస్ సెక్రటరీగా బదలీ చేశారు. సమగ్ర శిక్ష జేడీగా కొనసాగుతున్న పి రాజీవ్‌ను టాస్ జేడీగా, టాస్ జేడీగా ఉన్న ఎం సోమిరెడ్డిని హైదరాబాద్ ఆర్‌జేడీగా, వరంగల్ ఆర్‌జేడీగా ఉన్న కె సత్యనారాయణ రెడ్డిని మోడల్ స్కూల్స్ జాయింట్ డైరక్టర్‌గా కోఆర్డినేషన్ అడిషనల్ డైరక్టర్‌గా ఎఫ్‌ఏసీ బాధ్యతలు అప్పగించారు. సర్వీసెస్ జాయింట్ డైరక్టర్‌గా ఉన్న పి మదన్‌మోహన్‌ను సమగ్రశిక్ష జేడీ1గా బదలీ చేశారు. మాసబ్‌ట్యాంక్‌లో ఉన్న ఐఏఎస్‌ఈ ప్రిన్సిపాల్ ఏ ఉషారాణిని సమగ్రశిక్ష జేడీ2గా బదలీ చేశారు. సమగ్రశిక్ష జేడీగా ఉన్న వి వెంకటనర్సమ్మను జాయింట్ డైరక్టర్ సర్వీసెస్‌గా బదలీ చేశారు. హైదరాబాద్ ఆర్‌జేడీగా ఉన్న ఈ విజయలక్ష్మీని వరంగల్ ఆర్‌జేడీగా బదలీ చేశారు. హైదరాబాద్ డీఈవోగా ఉన్న ఆర్ రోహిణిని సంగారెడ్డి డీఈవోగా, సంగారెడ్డి డీఈవోగా ఉన్న వెంకటేశ్వర్లును రంగారెడ్డి డీఈవోగా, మంచిర్యాల్ డీఈవోగా ఉన్న యాదయ్యను హైదరాబాద్ డీఈవో గా బదలీ చేస్తూ విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా ఉత్తర్వులు జారీ చేశారు.

# తెలుగు విశ్వవిద్యాలయంలో పిజి, పిజి డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు

**హైదరాబాద్ (నాంపల్లి), మే 31, ప్రభాతవార్త :** సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం 2026-27 విద్యాసంవత్సరానికిగాను పీజి, పీజి డిప్లొమా, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులలో ప్రవేశాల కోసం అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తోందని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. శిల్పం, చిత్రలేఖనం, జ్యోతిషం, సంగీతం, రంగస్థలం, నృత్యం, జానపదం, తెలుగు, చరిత్ర-పర్యాటకం, భాషాశాస్త్రం, జర్నలిజం, యోగా, ఇంద్రజాలం, పద్యనాటకం, లలిత సంగీతం తదితర విభాగాలకు చెందిన వివిధ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా కోర్సుల వివరాలు, అర్హతలు, దరఖాస్తు విధానం తదితర సమాచారం కోసం విశ్వవిద్యాలయ అధికారిక వెబ్‌సైట్లు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.తెలుగుయూనివర్సిటీ.ఏసి.ఇన్; డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. పిఎస్‌టియుసిఇటి.ఓఆర్‌జిలో అందుబాటులో ఉన్నట్లు వివరించారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోందని, సాధారణ రుసుముతో దరఖాస్తుల సమర్పణకు జూన్ 24, 2026 వరకు; ఆలస్య రుసుముతో జూన్ 30, 2026 వరకు అవకాశం కల్పించినట్లు రిజిస్ట్రార్ వెల్లడించారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# బిజెపి ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం

### 'సర్'తో లౌకికవాదుల ఓట్లు గల్లంతుకు బిజెపి కుట్రలు

### రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి




**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజల జీవన ప్రమాణాలు అత్యంత దయనీయంగా పడిపోయాయనీ నిరుద్యోగం నానాటికి పెరిగిపోతుందని ఇప్పటి వరకు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని కనీసం 22 ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం ఇందిరాభవన్‌లో రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ సమావేశం రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఇంచార్జ్ సయ్యద్ ఖాలీద్ అహ్మద్, సహ ఇంచార్జ్‌లు రోషిని కుషాల్ జైస్వాల్ , కెఆర్ భవ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా శివచరణ్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వ నీట్ పేపర్ లీకేజీ, పెట్రోల్ పెంపు వంటి అనేక ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అనేక నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఇందులో భాగంగా జూన్ 3న నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఉదయ్ భాను చిబ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని కావున యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మరోవైపు సర్ పేరుతో లౌకిక వాదుల ఓట్లు గల్లంతు చేయడానికి బిజెపి కుట్రలు చేస్తోందని దీనిపై కూడా యువజన కాంగ్రెస్ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్‌పార్టీ బిఎల్‌ఎలతో సమన్వయం చేసుకొని అర్హులైన ప్రతి వయోజనుడి పేరు జాబితాలో ఉండేలా చూడాలని సూచించారు. సర్ కారణంగా పశ్చిమ బెంగాల్‌లో ఒక ప్రభుత్వం పడిపోయిన అంశంను యువజన కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజల్లో చైతన్యం తెచ్చి వారి ఓటుహక్కు భద్రంగా ఉండేలా జాగ్రత్తపడేలా ప్రేరేపించాలని కోరారు.

# ధాన్యం సేకరణలో రాష్ట్రంపై కేంద్రం వివక్ష

### బిఆర్‌ఎస్‌తో బిజెపి కుమ్మక్కై రైతుల్లో విషబీజాలు: ప్రభుత్వ విప్ వేముల వీరేశం

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** ధాన్యం సేకరణలో తెలంగాణ పట్ల కేంద్రం వివక్ష ప్రదర్శిస్తోందని, పంజాబ్, హర్యానా లాంటి రాష్ట్రాల్లో మొత్తం ధాన్యం కేంద్రం కొనుగోలు చేస్తోందని తెలంగాణలో మాత్రం ముప్పై శాతం మాత్రమే కొనుగోలు చేస్తామని అంటున్నారని ప్రభుత్వ విప్ వేముల వీరేశం ఆరోపించారు. ఆదివారం సిఎల్‌పి మీడియా సెంటర్ ఆయన మాట్లాడుతూ పంజాబ్‌కు ఒక నీతి, తెలంగాణకు మరో నీతా అని ప్రశ్నించారు. కేంద్రం ధాన్యం సేకరణలో సహకరించకపోయినా రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగంగా జరుగుతోందని ఆయన తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధాన్యం కొనుగోళ్ల పైన పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని ఆవేదన చెందారు. బిజెపి నాయకులు రాజకీయ యాత్ర చేశారే గానీ రైతుల వద్ద కేంద్రమే ధాన్యం కొంటుందని, లారీలు పంపిస్తామని, హమాలీలు తెస్తామని రైతు లకు బిజెపి నాయకులు భరోసా ఇచ్చారా? అని ఆయన ప్రశ్నించారు. కనీసం రైతులకు ఉపశమనం కలిగించే మాటలైనా బిజెపి నాయ కులు మాట్లాడాల్సి ఉండాల్సింది, అదీ కూడా చేయలేదని ఎద్దేవా చేశా రు. తెలంగాణ రైతుల ఓట్లతో గెలిచిన బిజెపి ఎంపిలు ద్రోహం చేస్తున్నారని, ముఖ్యంగా కేంద్రంలో బిజెపి మంత్రులు తెలంగాణ ద్రోహులుగా తయారయ్యారని విమర్శించారు. బిఆర్‌ఎస్ ఎజెంట్లుగా మారి రాష్ట్ర ప్రభుత్వంపైన బిజెపి నాయకులు విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు. రైతులు సిఎం రేవంత్ రెడ్డికి నీరాజనాలు పలుకుతున్నారని అన్నారు. వరి ధాన్యం రికార్డు స్థాయిలో దిగుబడి వచ్చిందనీ అందుకే ప్రణాళికా బద్ధంగా కొనుగోళ్లు వేగంగా చేస్తున్నామని తెలిపారు.. బిఆర్‌ఎస్ ప్రభుత్వం లో కొందరు మిల్లర్లు కుమ్మక్కై అక్రమాలకు పాల్పడ్డారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అవకతవకలకు పాల్పడిన మిల్లర్ల పైన కేసులు పెట్టామని ఆస్తులు రికవరీ చేశామనీ వీరేశం చెప్పారు. కిషన్ రెడ్డి మాట్లాడుతున్న తీరు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందన్నారు. బిఆర్‌ఎస్ గతంలో కేంద్రంలోని బిజెపికి మద్దతు పలికిందని, అందుకే తోడు దొంగల్లా బిజెపి, బిఆర్‌ఎస్ నాయకులు తెలంగాణ రాష్ట్రాన్ని నాశనం చేశారని మండిపడ్డారు. రైతుల మెదళ్లలో విషబీజాలు నాటడానికి బిజెపి, బిఆర్‌ఎస్ ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు.

# ఉచిత విద్యుత్‌పై కాంగ్రెస్‌కే పేటెంట్

### రైతు డిస్కంపెడితే కెటిఆర్‌కు ఎందుకు బాధ?

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** వ్యవసాయానికి మూడు గంటల విద్యుత్ సరిపోతుందని మా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నట్లుగా కెటిఆర్ తప్పుడు ప్రచారం చేయడం తగదనీ, రైతుల విషయంలో దుష్ప్రచారం మానుకోవాలని, ముఖ్యమంత్రి ఆ మాట ఎప్పుడు అనలేదనీ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సిఎల్‌పిలో ఆదివారం విలేఖరులతో మాట్లాడుతూ మా హయాంలో 24 గంటల ఉచిత విద్యుత్ ఇచ్చామని కెటిఆర్ బడాయి కబుర్లు చెపుతున్నాడనీ కెసిఆర్ హయాంలో 12 గంటల కరెంట్ మాత్రమే ఇచ్చారనీ చెప్పారు. ఉచిత విద్యుత్‌పై కాంగ్రెస్ పార్టీ పేటెంట్ కలిగి ఉందనీ అన్నారు. రైతును రాజు చేయాలన్న ఆలోచనతోనే కాంగ్రెస్ ఉచిత విద్యుత్ ఇచ్చిందనీ ఉచిత విద్యుత్ పైన తొలి సంతకం చేసింది కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి అని ఆయన చెప్పుకొచ్చారు. కెసిఆర్ హయాంలో ఏ నాడు నిరంతరంగా వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ ఇవ్వలేదనీ రైతులు అరిగోసపడ్డారనీ ఆయన గుర్తుచేశారు. గత యాసంగి సీజన్ లో విద్యుత్ ఇవ్వలేదని ఏ సబ్ స్టేషన్ దగ్గర చిన్న ధర్నా కూడా జరగలేదని అది మా నిబద్ధత అని అన్నారు. నాణ్యమైన విద్యుత్ ను ఎలాంటి అంతరాయాలు లేకుండా మా ప్రభుత్వం సప్లయ్ చేస్తోందనీ అన్నారు. మా ప్రభుత్వం రైతు డిస్కం పెడితే కెటిఆర్ కు ఎందుకు నొప్పి, రైతు ప్రయోజనాల కోసమే డిస్కం ఏర్పాటు చేశామనీ అన్నారు. మోటార్లకు మీటర్లు పెట్టమని మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారనీ వివరించారు..మోటార్లకు మీటర్లు పెడితే వచ్చే ఎన్నికల్లో పోటీ చేయమని మా ముఖ్యమంత్రి స్పష్టం చేశారనీ అన్నారు. అయినా కెటిఆర్ తప్పుడు ప్రచారం చేస్తున్నాడనీ ఆవేదన చెందారు. ఒక వేళ మేం మీటర్లు పెట్టకపోతే వచ్చే ఎన్నికల్లో బిఆర్‌ఎస్ పోటీ చేయదా అని మా సీఎం ఛాలెంజ్ విసిరారు..మా ముఖ్యమంత్రి సవాల్ ను కెటిఆర్ ఎందుకు స్వీకరించడం లేదు..?అని ప్రశ్నించారు. రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం కెటిఆర్ చేస్తున్నాడనీ ఆయన విమర్శించారు.. మా ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడుతుందనీ. కెటిఆర్ తప్పుడు ప్రచారం చేస్తే కాంగ్రెస్ పార్టీ లక్షలాది మంది కార్యకర్తలు చూస్తు ఊర్కోరనీ హెచ్చరించారు. పచ్చి అబద్దాలు ప్రచారం చేస్తున్న నిన్ను సన్నాసి అనాలా లేక ఏం అనాలో కూడా అర్థం కావడం లేదనీ సందేహం వ్యక్తంచేశారు.

# బిజెపి ఎంపి ఈటల రాజేందర్‌కు వ్యతిరేకంగా ఫ్లెక్సీల కలకలం

### తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన రామచందర్‌రావు

### దీని వెనుక ఉన్న సూత్రధారులపై చర్యలు తీసుకోవాలని డిజిపికి విజ్ఞప్తి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 31:** బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ని విమర్శిస్తూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్ల వ్యవహారంపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ఎదుగుదలను చూసి తట్టుకోలేక కొందరు కావాలనే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. బీజేపీ నాయకుల మధ్య విభేదాలు ఉన్నాయనే సంకేతాలను ప్రజల్లోకి పంపేందుకు కొందరు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నట్లు కనిపిస్తోందని అన్నారు. అయితే ఇలాంటి ప్రయత్నాలను పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని స్పష్టం చేశారు. ఈ అంశంపై చట్టపరంగా ముందుకు వెళ్తామని పేర్కొన్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ వ్యవహారం వెనుక ఉన్న సూత్రదారులను గుర్తించి చర్యలు తీసుకోవాలని,సైబరాబాద్ సీపీకి, డిజిపి సివి ఆనంద్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈటల రాజేందర్‌ను కించపరిచే విధంగా ఏర్పాటు చేసిన బ్యానర్లను ముక్తకంఠంతో ఖండిస్తున్నామని తెలంగాణ బీజేపీ నాయకులు, కార్యకర్తలు చెప్పారు. ఈ మేరకు బీజేపీ ఎమ్మెల్యే, బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎంపీ ధర్మపురి అరవింద్, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, కాటిపల్లి వెంకట రమణారెడ్డి, డా. పాల్వాయి హరీశ్ బాబు, పవార్ రామారావు పటేల్, పైడి రాకేశ్ రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, బీజేపీ ఎమ్మెల్సీలు ఏవీఎన్ రెడ్డి, డా. సి. అంజిరెడ్డి, మల్కా కొమురయ్య తీవ్రంగా స్పందించారు.ఇది కేవలం ఒక వ్యక్తిపై జరిగిన దాడి మాత్రమే కాదని, తెలంగాణలో బీజేపీకి పెరుగుతున్న ఆదరణను చూసి భయపడుతున్న వారే ఇలా చేశారని మండిపడ్డారు.దాదాపు నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం కలిగిన ఈటల రాజేందర్ ప్రజాజీవితంలో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారని పేర్కొన్నారు. అలాంటి నాయకుడిని అవమానించేందుకు ప్రయత్నించడం నీచ రాజకీయాలకు పరాకాష్ట అని విమర్శించారు. తెలంగాణలో బీజేపీకి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను జీర్ణించుకోలేక అధికార పార్టీతో పాటు ఇతర ప్రత్యర్థి రాజకీయ శక్తులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నాయని ఆగ్రహించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ బీజేపీ పూర్తిగా ఐక్యంగా ఉందని, ఇలాంటి కుట్రలు పార్టీ ఐక్యతను దెబ్బతీయలేవని స్పష్టం చేశారు. ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని, రాజకీయ లబ్ధి కోసం చేసే ఇలాంటి ప్రయత్నాలను తిరస్కరిస్తారని బీజేపీ నేతలు, కార్యకర్తలు పేర్కొన్నారు.


# పిడుగుపాటుతో భార్యాభర్తల దుర్మరణం

**రెబ్బెన, మే 31, ప్రభాతవార్త:** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని రెబ్బెన మండలం లోని కైరగూడ గ్రామంలో ఆదివారం రోజున అకాల వర్షానికి పిడుగుపాటుకు గురై భార్యాభర్త అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మృతులు టేకం భీమ్రావు (45), టేకం రాజు భాయి (40) వివరాలు లోకి వెళ్తే మృతులు తిర్యానీ మండలం చెలిమెల గ్రామానికి చెందిన వారని బ్రతుకుతెరువు కోసం కైర్గుడా గ్రామానికి చెందిన ఒక రైతు దగ్గర పాలేరుగా జీవనం కొనసాగిస్తున్నారు. రోజువారీగా భాగంగానే పత్తి చేనులో సాయంత్రంవేళ పనికి వెళ్లారు. ఆకస్మిక వర్షానికి చెట్టు కింద చేరడంతో పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందడం జరిగింది. మృతులకు పిల్లలు లేరు. అందరితో కలిసిమెలిసి ఉండే దంపతులు ఆకస్మిక మరణం చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# అగమ్యగోచరంగా హరీశ్‌రావు రాజకీయ భవిష్యత్

### ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు రాజకీయ భవి ష్యత్ రాజకీయ శూన్యత ఆవరించి అగమ్యగోచరంగా మారిందని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ ఎద్దేవా చేశారు. సిఎల్‌పిలో మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ వల్ల హరీశ్‌రావుకు గతంలో అదృష్టం కలిసి వచ్చిందనీ, వార్డు మెంబర్ కాకపోయినా ఆయనను రాష్ట్ర మంత్రిని చేసింది కాంగ్రెస్ పార్టీ అని గుర్తుచేశారు. రాజకీయంగా హరీశ్‌రావు చిల్లర వేషాలు అందరికి తెలుసు అందుకే సిద్దిపేట చిల్లరరావుగా హరీశ్‌రావును పిలుస్తున్నారని అన్నారు. ఢిల్లీలో బిజెపి నాయకులను కలిశారా లేదా అన్న దానికి హరీష్ రావు నేరుగా సమాధానం చెప్పడం లేదనీ విమర్శించారు. బిఆర్‌ఎస్ పార్టీకి కెటిఆర్ ను నాయకుడిని చేస్తే ఆ పార్టీలో హరీష్ రావు పాత్ర ఏముంటుంది..? అని అద్దంకి అనుమానం వ్యక్తం చేశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డిని కలిసినప్పుడే కాంగ్రెస్ లో చేడానికి హరీష్ రావు మానసికంగా సిద్ధమయ్యాడనీ ఆరోపించారు. వైఎస్ ను హరీష్ రావు కలిసిన ఫోటో కావాలంటే ఇప్పుడు కూడా గూగుల్ లో ఉంటుందనీ తెలిపారు. హరీష్ రావు బ్లాక్ మెయిల్ రాజకీయాలు తెలిసే కెసిఆర్ తన కొడుకు, కూతురును పార్టీలోకి తెచ్చాడనీ అన్నారు. కెటిఆర్ కవిత పార్టీలోకి వచ్చిన తర్వాత హరీష్ రావు పరిస్థితి గందరగోళంగా తయారైందనీ వ్యాఖ్యానించారు. బిఆర్‌ఎస్ ను వర్కింగ్ ప్రెసిడెంట్ చేయడంతో హరీష్ రావు పరిస్థితి ఆగమ్యగోచరంగా మారిందనీ ఆవేదన చెందారు..కాంగ్రెస్ కు రాలేదు కాబట్టే బిజెపి వైపు వెళ్లడానికి హరీశ్‌రావు ప్రయత్నం చేస్తున్నాడనీ ఆరోపించారు. రాజకీయ భవిష్యత్తు, రాజకీయ శూన్యత మధ్య హరీశ్‌రావు కొట్టు మిట్టాడుతున్నాడని అందుకే చిల్లర మాటలు మాట్లాడుతున్నాడని అన్నారు. సహేతుక విమర్శలు చేయకుండా హరీశ్‌రావు చిల్లర రావు అయిపోయాడనీ దయ్యబట్టారు. హరీశ్‌రావు దొంగతనం కెసిఆర్‌ఆర్‌కు తెలుసు అదేవిధంగా కెసిఆర్ దొంగతనాలు హరీశ్‌రావుకు తెలుసు అందుకే వదలడం లేదనీ అన్నారు. సిఎం మాట్లాడిన మాటలకు హరీశ్‌రావు సమాధానం చెప్పలేకపోతున్నాడని అన్నారు.



రాష్ట్ర సర్పంచుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా రంజిత్‌కుమార్‌గౌడ్‌ను నియమిస్తూ నియామకపత్రం అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్

# ఉపసర్పంచుల చెక్ పవర్‌ను రద్దు చేయాలి

### సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉపసర్పంచుల చెక్ పవర్‌ను వెంటనే రద్దు చేయాలని రాష్ట్ర సర్పంచుల సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు చక్కటి వెంకటేష్‌యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆదివారం కాచిగూడలో రాష్ట్ర సర్పంచుల సంఘం సమావేశమైంది. ఈ సమావేశంలో మహబూబ్‌నగర్ జిల్లా, నవాబ్‌పేట్ మండలం, యన్నన్‌గండ్ల సర్పంచ్ ఎం. రంజిత్‌కుమార్‌గౌడ్‌ను సంఘం ఉపాధ్యక్షుడుగా నియమించారు. ఈ సందర్భంగా వెంకటేష్‌యాదవ్ మాట్లాడుతూ ఉపసర్పంచుల చెక్‌పవర్ రద్దు కోసం త్వరలో రాష్ట్రవ్యాప్తంగా సర్పంచులను సమీకరించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలవనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం పెట్టిన ఇబ్బందులే నేడు కొనసాగుతున్నాయని, గ్రామాల్లో ట్రాక్టర్లకు డీజిల్ ఖర్చు, పారిశుధ్య నిర్వహణ వ్యయం కోసం ప్రతి నెల నిధులు సక్రమంగా విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇందిరమ్మ కమిటీలకు చైర్మన్‌గా సర్పంచ్‌లను నియమించాలన్నారు. సర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడుగా నియమితులైన రంజిత్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు.

# కూల్చేస్తాం.. పేల్చేస్తాం అంటే చూస్తూ ఊర్కోం

## దేశంలోనే తెలంగాణ ఆదర్శవంతమైన రాష్ట్రం

## క్రమశిక్షణ లక్ష్మణ రేఖ దాటొద్దు.. తీవ్రపరిణామాలు ఉంటాయి

## పాలకుర్తి పరిశీలకుడిగా ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ నియామకం

## పిసిసి క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** పదేళ్లు మేం ప్రతి పక్షంలో ఉన్నాం అప్పుడు ఇంటి బయటకు కూడా రానివ్వలేదు మేము మీకు స్వేచ్ఛ ఇచ్చాం అయితే కూల్చేస్తాం పేల్చేస్తాం అంటే చూస్తూ ఊర్కోం అని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ క్రమశిక్షణ కమిటి ఛైర్మన్ మల్లురవి అన్నారు.పాలకుర్తి నియోజకవర్గంలో నెలకొన్న అంతర్గత విభేదాలు, కామారెడ్డి జిల్లా నాయకుల మధ్య తలెత్తిన వివాదాలపై తెలంగాణ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ ఆదివారం గాంధీభవన్‌లో మల్లురవి నాయకత్వంలో సమావేశమైంది. సమావేశం అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ పాలకుర్తిలోని రెండు గ్రూపులవల్ల పార్టీకి నష్టం జరగుతోందని ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌ను వివాదం పరిష్కారంకు పరిశీలకుడిగా వేశామని తెలిపారు. కామారెడ్డి లో గడ్డం చంద్రశేఖర్‌పై ఫిర్యాదు వచ్చిందని నోటీసులు ఇచ్చామని చెప్పారు. పాలకుర్తి నియోజకవర్గంలో హరి ప్రసాద్ రెడ్డి, కృష్ణ కిషోర్ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థికి కాకుండా ఇతరులకు తోడ్పాటు అందించారని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు ఝాన్సీ రెడ్డి ఫిర్యాదు చేశారు. ఝాన్సీ రెడ్డి తానే ప్రజాప్రతినిధిగా వ్యవహరిస్తోందని పార్టీ వ్యతిరేకులను ప్రోత్సహిస్తున్నారని హరిప్రసాద్‌రెడ్డికృష్ణకిషోర్‌లు ప్రత్యారోపణలు చేసుకొన్నారు పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి క్రమశిక్షణ కమిటీ సమావేశానికి హాజరై అక్కడక్షేత్రస్థాయిలో ఇబ్బందులు వివరించారు. ఆ ఇద్దరు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ యశస్వినీ రెడ్డి ఫిర్యాదు చేశారు. మరోవైపు హరి ప్రసాద్ రెడ్డి, కృష్ణ కిషోర్ వర్గం కూడా ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డిపై ఆరోపణలు చేసింది. ఝాన్సీ రెడ్డి షాడో ఎమ్మెల్యేగా వ్యవహరిస్తూ పార్టీ నాయకులను పట్టించుకోవడం లేదని వారు ఫిర్యాదు చేశారు. ఈ పరస్పర ఫిర్యాదులను పరిశీలించిన క్రమశిక్షణ కమిటీ రెండు వర్గాలకు నోటీసులు జారీ చేసింది.



ఇటీవల అమెరికా పర్యటనలో ఉన్న యశస్వినీ రెడ్డి, ఇవాళ కమిటీ ముందు హాజరై తన వివరణ ఇచ్చారు. కామారెడ్డి జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకుల మధ్య నెలకొన్న వివాదం కూడా క్రమశిక్షణ కమిటీ విచారించింది.
టిపిసిసి జనరల్ సెక్రటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి షబ్బీర్ అలీ ని దూషించారని వివాదం మొదలైంది. చంద్రశేఖర్‌రెడ్డిపై షబ్బీర్ అలీవర్గం వర్గం ఫిర్యాదు చేసింది. చంద్రశేఖర్‌ను కూడా దూషించారనీ దానికి ప్రతిగానే అన్నారనీ చంద్రశేఖర్ అనుచరులు వాదిస్తున్నారు. ఏలాంటి వివాదం లేకముందే షబ్బీర్ అలీని ఉద్దేశించి చంద్రశేఖర్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని షబ్బీర్ అలీ వర్గం ఆరోపించింది. అలాగే సొంత పార్టీ నాయకులకు బదులుగా ఇతర పార్టీల నేతలకు చంద్రశేఖర్ రెడ్డి మద్దతు ఇస్తున్నారని కూడా షబ్బీర్ అలీ వర్గం ఫిర్యాదు చేసింది. మల్లు రవి మాట్లాడుతూ బిఆర్ఎస్ నాయకులు హరీష్‌రావు, కెటిఆర్‌లకు మతిస్థిమితం తప్పిందని ఆరోపించారు. ఏరకంగా చూసినా తెలంగాణలో రేవంత్‌పాలన ఆదర్శనీయంగా ఉందని తెలిపారు. కేరళ, తమిళ నాడులో కూడా తెలంగాణ పాలనను రోల్‌మోడల్‌గా పెట్టుకొంటున్నారని చెప్పారు.



# నేటి నుంచి విశాఖ రైల్వే జోన్

## దక్షిణ మధ్య రైల్వే కుదింపు

## మ్యాప్‌లో భారీ మార్పులు

**విశాఖపట్నం, మే 31,ప్రభాతవార్త:** దేశ రైల్వే వ్యవస్థలో తెలుగు రాష్ట్రాలకు కీలక ప్రాధాన్యం కల్పిస్తూ కేంద్ర రైల్వే శాఖ సంచలన నిర్ణయాలు తీసుకుంది. విశాఖపట్నం కేంద్రంగా కొత్త దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలకు జూన్ 1 నుంచి శ్రీకారం చుట్టనుండగా, దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధి భారీగా కుదించబడుతోంది. ఈ మేరకు రైల్వే శాఖ అధికారికంగా కీలక ప్రతిపాదనలను ఖరారు చేసింది.ఇప్పటి వరకు దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఉన్న విజయవాడ, గుంటూరు, గుంత కల్ డివిజన్లు కొత్తగా ఏర్పడుతున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్‌లోకి మారనున్నాయి. అలాగే వాల్తేరు డివిజన్ స్థానంలో విశాఖపట్నం డివిజన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో కొత్త జోన్ పరిధిలో మొత్తం నాలుగుడివిజన్లు ఉండనున్నాయి. ఇకపై దక్షిణ మధ్య రైల్వే జోన్ సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్లకే పరిమితం కానుంది. జోన్ పరిధి 6,637 ట్రాక్ కిలోమీటర్ల నుంచి 3,589 ట్రాక్ కిలోమీటర్లకు తగ్గిపోనుంది. దీంతో దక్షిణ మధ్య రైల్వే పరిపాలనలో భారీ మార్పులు చోటు చేసుకోనున్నాయి. కొత్త జోన్ ఏర్పాటుతో రైల్వే డివిజన్ల సరిహద్దులు, రైళ్ల నిర్వహణ, ఆదాయం పంపకం, సిగ్నలింగ్ వ్యవస్థలలో మార్పులు అమలులోకి రానున్నాయి. గుంటూరు డివిజన్‌లోని పగిడిపల్లి-విష్ణుపురం- జాన్‌పహాడ్ సెక్షన్, గుంతకల్ డివిజన్ పరిధిలోని రాయచూరు-వాడి సెక్షన్‌ను సికింద్రాబాద్ డివిజన్‌లో విలీనం చేయాలని అధికారులు నిర్ణయించారు. తాజా మార్పులతో సికింద్రాబాద్ డివిజన్ పరిధి మరో 204 కిలోమీటర్ల మేర పెరగనుంది. దీంతో రైళ్ల రాకపోకలు, సిగ్నలింగ్ సమన్వయం వంటి అంశాల్లో అదనపు ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని రైల్వే వర్గాలు భావిస్తున్నాయి. ఇప్పటికే దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు జనరల్ మేనేజర్‌తో పాటు వివిధ విభాగాధిపతుల నియామకాలు పూర్తయ్యాయి. 128 గెజిటెడ్, 1100 నాన్‌గెజిటెడ్ పోస్టులను రైల్వే బోర్డు మంజూరు చేయగా, ఉద్యోగుల కేటా యింపు ప్రక్రియ కూడా పూర్తయింది. దీంతో జూన్ 1 నుంచి విశాఖ కేంద్రంగా కొత్త రైల్వే జోన్ పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించనుంది.

# నేటి నుంచి జూనియర్ కాలేజీలు పునః ప్రారంభం

## ఎండల దృష్ట్యా వారం రోజులు సెలవులు

## కొనసాగించాలంటున్న అధ్యాపక సంఘాలు

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలో నేటి(సోమవారం- జూన్1) నుంచి జూనియర్ కాలేజీలు పునః ప్రారంభం కానున్నాయి. రెండు నెలల వేసవి సెలవుల అనంతరం సోమవారం జూనియర్ కాలేజీలు 2026-27 విద్యా సంవత్సరం ప్రారంభించనున్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్ 1 నుంచి మే 31 వరకు వేసవి సెలవులను ఇంటర్ బోర్డు ప్రకటించింది. ఈ నేపథ్యంలో నేటి నుంచి 2026-27 విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. అయితే రాష్ట్రంలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని ఈ నేపథ్యంలో విద్యార్థులకు ఈ నెల 7 వరకు వేసవి సెలవులను పొడిగించి ఈ నెల 8 నుంచి జూనియర్ కాలేజీలను ప్రారంభించాలని గవర్నమెంట్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్(జిజెఎల్ఏ) రాష్ట్ర అధ్యక్షులు పి మధుసూదన్ రెడ్డి, తెలంగాణ ఇంటర్మీడియట్ గవర్నమెంట్ లెక్చరర్స్ అసోసియేషన్(టిగ్లా) రాష్ట్ర అధ్యక్షులు ఎం జంగయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# పెండింగ్‌లో రామ్‌చరణ్ పెద్ది సినిమా టిక్కెట్ల పెంపు

## పిటిషన్ విత్‌డ్రా చేసుకున్న చిత్ర నిర్మాణ యూనిట్

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించిన పెద్ది సినిమా టిక్కెట్ ధరల పెంపునకు సంబంధించి చిత్ర నిర్మాణ యూనిట్ దాఖలు చేసిన ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వం వద్ద పెండింగ్ పడింది. మరోపక్క ఈ సినిమా టిక్కెట్ల పెంపు విషయమై చిత్ర నిర్మాణ సంస్థ షాకింగ్ నిర్ణయం తీసుకుంది. ధరల పెంపును కోరుతూ తెలంగాణ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను వెనక్కి తీసుకుంది. కాగా జూన్ 4వ తేదీన రామ్ చరణ్ నటించిన పెద్ది సినిమా విడుదల కానుంది. అయితే, వారం రోజుల పాటు ఈ సినిమాకు టిక్కెట్ ధరల పెంపునకు అనుమతి ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ సమర్పించింది. దీంతో ఈ ప్రతిపాదనలు రాష్ట్ర హోం శాఖకు చేరింది. దీంతో హోం శాఖ టిక్కెట్ల పెంపుదలపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో పెద్ది చిత్ర నిర్మాణ సంస్థ మరో మారు రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించింది. అయినప్పటికీ దానిపై కూడా రాష్ట్ర హోం శాఖ ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ రెండు ప్రతిపాదనలపై హోం శాఖ నుండి ఎలాంటి సానుకూల స్పందన రాకపోవడంతో చిత్ర నిర్మాణ సంస్థ హైకోర్టును ఆశ్రయించింది. ఈ మేరకు పిటిషన్ దాఖలు చేసింది. అయితే, టికెట్ ధరల అంశంపై గతంలో వెలువడిన తీర్పులను దృష్టిలో ఉంచుకుని హైకోర్టు ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదు. దీంతో పెద్ది సినిమా నిర్మాణ సంస్థ తాజాగా తన పిటిషన్‌ను ఉపసంహారించుకుంది.



# కర్ణాటక బాగేపల్లిలో రోడ్డుప్రమాదం

## ఆరుగురు కూలీల మృతి, తొమ్మిది మందికి గాయాలు

**చిక్‌బళ్లాపూర్, మే 31:** కర్ణాటకలో చిక్కబళ్లాపూర్ జిల్లా బాగేపల్లి పట్టణం సమీపంలో ఆదివారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ దుర్ఘటనలో ఆరుగురు వలస కూలీలు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో తొమ్మిది మందికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే, పని ముగించుకుని సుమారు 15 మంది కూలీలు ఒక ఆటోలో ఇంటికి బయలుదేరారు. జాతీయ రహదారి 44పై గంగోత్రి పెట్రోల్ పంప్ వద్దకు రాగానే, వేగంగా వస్తున్న ఒక కంటైనర్ లారీ ఆటోను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు ఆటో పూర్తిగా నుజ్జునుజ్జయింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న వారిలో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు.ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, సహాయక బృందాలు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. గాయపడిన వారిని వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. సామర్థ్యానికి మించి ఆటోలో ప్రయాణించడం, లారీ అతివేగమే ప్రమాదానికి ప్రధాన కారణాలని ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వర్షబీభత్సం

## ఖైరీగూడలో పిడుగుపాటుకు ముగ్గురు బలి

## బెల్లంపల్లిలో విద్యుత్ తీగలు తెగి మూడు మేకలు మృతి

## నెన్నల మండలం కొత్తూరులో పిడుగుపడి తాటిచెట్లకు మంటలు

## సిర్పూర్(యు)లో 3 సెం.మీ. వర్షపాతం నమోదు

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆదివారం సాయంత్రం వర్షంభీభత్సం సృష్ఠించింది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో పిడుగుపాటుకు ముగ్గురు బలయ్యారు. రెబ్బెన మండలం ఖైరిగూడలో పొలంలో పిడుగుపడి దంపతులు బీమ్‌రావు, రాజుబాయి మృతి చెందారు. ఆసిఫాబాద్ మండలం కౌటగూడ జి గ్రామంలో పిడుగుపడి లింగు అనే వ్యక్తి మృతిచెందారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ పట్టణ కేంద్రంలో ఈదురుగాలులు, ఉరుములతో కూడిన వర్షం దంచికొట్టింది. సిర్పూరు(యు)లో 3సెం.మి, బేలలో 2సెం.మి, కెరమెరీలో 1.8సెం.మి, జైనూర్‌లో 1.7సెం.మి, రెబ్బనలలో 1.2సెం.మి, ఊట్నూరులో 6మి.మి,జైనద్1.4సెం.మి వర్షర కురిసింది మావల,గోలేలటి 1,3 సాత్నాలలో 1.4సెం.మీ. నేరడిగొండ, ఆదిలాబాద్,భీంపూర్ తాంసిలో దాదాపు అరగంటకు పైగా వర్షం కురవడంతో రోడ్లపై వరదనీరు పారింది.ఉదయం నుంచి సాయంత్రం వరకు తీవ్ర ఎండ వేడితో ప్రజలు ఉక్కపోతకు గురయ్యారు. సాయంత్రం వర్షం కురవడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. దీంతో ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు కొంత ఉపశమనం లభించింది.నెన్నెల మండలంలోని కొత్తూరు గ్రామం ఒకటవ వార్డులో సాయంత్రం పిడుగు పడి రెండు తాటి చెట్లకు మంటలు అంటుకున్నాయి. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. గ్రామానికి చెందిన ఏనుక పోశం ఇంటి సమీపంలో ఉన్న తాటి చెట్టుపై పిడుగు పడటంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అనంతరం ఆ మంటలు పక్కనే ఉన్న మరో తాటి చెట్టుకు వ్యాపించడంతో భారీ అగ్నిజ్వాలలు ఎగసిపడ్డాయి. మంటలను గమనించిన గ్రామస్తులు వెంటనే అప్రమత్తమై నీటితో ఆర్పేందుకు ప్రయత్నించారు. కొంతసేపు అగ్నిజ్వాలలు తీవ్రంగా వ్యాపించడంతో సమీప ప్రాంత ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. గ్రామస్తుల సమయ స్ఫూర్తికి తోడు స్వల్ప వర్షం కురవ డంతో మంటలు అదుపులోకి వచ్చా యి. పెద్ద ప్రమాదం తప్పడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగక పోవడం, మంటలు ఇతర ఇళ్లకు వ్యాపించకపోవడం గ్రామస్తులకు ఉపశమనం కలిగించింది. గ్రామస్తుల అప్రమత్తత వల్లే పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని 13వ వార్డు గాంధీనగర్‌లో గాలివాన బీభత్సం సృష్టించింది. ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో కాలనీలోని మూడు పెద్ద చెట్లు విద్యుత్ స్తంభాలపై విరిగిపడటంతో విద్యుత్ తీగలు తెగి రోడ్డుపై పడ్డాయి. అదే సమయంలో మేకల పెంపకందారుడు తన మేకలను ఇంటికి తీసుకువస్తుండగా, విద్యుత్ తీగలు తగిలి మూడు మేకలు అక్కడికక్కడే మృతి చెందాయి.
మృతిచెందిన మేకలు చిప్ప గట్టయ్య అనే వ్యక్తికి చెందినవిగా గుర్తించారు. ఈ ఘటనతో దాదాపు రూ.50 వేల నష్టం వాటిల్లినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.విషయం తెలుసుకున్న టౌన్ కాంగ్రెస్ ప్రెసిడెంట్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బండి ప్రభాకర్ యాదవ్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. వెంటనే విద్యుత్ శాఖ అధికారులతో పాటు పశుసంవర్ధక శాఖ అధికారులకు సమాచారం అందించారు.ఈ సంఘటనను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి, బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా సహాయం అందేలా కృషి చేస్తానని ప్రభాకర్ యాదవ్ తెలిపారు.

# నేడు కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో రూ. 112.14 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

**కెరమెరి, మే 31, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమ వారం కుమ్రం భీంఆసిఫాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. జిల్లాలో చేపట్టనున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. మొత్తం రూ.112.14 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు సీఎం శ్రీకారం చుట్టనున్నారు.ఈ పర్యటనలో భాగంగా చింతలమానేపల్లి మండలంలోని కౌటాల (రవీంద్రనగర్ క్యాంపు నం2) గ్రామంలో ఏర్పాటు చేయనున్న 132/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.56.55 కోట్లు.రెబ్బెన మండలం నాంబాల్ గ్రామంలో రూ.6 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న సౌర విద్యుత్ ప్లాంట్ పనులకు కూడా సీఎం శంకుస్థాపన చేయనున్నారు.అదే విధంగా చింతలమానేపల్లి, గుడ్లబోరి, కాపువాడ, చింతకుంట, అంకుషాపూర్ ప్రాంతాల్లో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాల పనులకు కూడా ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టనున్నారు.
ఈ ఉపకేంద్రాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా మరింత బలోపేతం కావడంతో పాటు వ్యవసాయం, పరిశ్రమలు, గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందుబాటులోకి రానుంది.జిల్లాలోని ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో రూ.15 కోట్లతో చేపట్టనున్న తొమ్మిది అభివృద్ధి పనులు, కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో రూ.18.70 కోట్లతో చేపట్టనున్న ఎనిమిది అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాల ద్వారా జిల్లాలో విద్యుత్ మౌలిక సదుపాయాల విస్తరణ, పునరుత్పాదక ఇంధన వినియోగ ప్రోత్సాహం, పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి జూపల్లి తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఏర్పాట్లు పూర్తయ్యాయని చెప్పారు.



# సర్దార్ పటేల్ దూరదృష్టి వల్లే నేటి అఖండ భారతం

## కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్


## హైదరాబాద్‌లో ఘనంగా పటేల్ 150వ జయంతి వేడుకలు

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** దేశ సమగ్రతకు ఉక్కు సంకల్పంతో పునాదులు వేసిన భారతరత్న సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలు హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో అత్యంత వైభవంగా జరిగాయి. భారత్ భారతి ఆధ్వర్యంలో జరిగిన ఈ ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ, సర్దార్ పటేల్ కేవలం ఒక చారిత్రక వ్యక్తి మాత్రమే కాదని, ఆయన ఒక కాలాతీత శక్తి అని అభివర్ణించారు. బ్రిటిష్ పాలకులు భారత్‌ను 562 చిన్న చిన్న రాజ్యాలుగా విభజించి, దేశాన్ని బలహీనపరిచి వెళ్లాలని చూశారు. ఆ సమయంలో సర్దార్ పటేల్ తన అద్భుతమైన దౌత్యం, రాజనీతిజ్ఞత మరియు ధైర్యంతో ఆ సంస్థానాలన్నింటినీ ఒకే తాటిపైకి తెచ్చి, నేటి అఖండ భారతావనిని నిర్మించారు. ఒకవేళ సర్దార్ పటేల్ లేకపోతే, నేడు మనం చూస్తున్న భౌగోళిక భారతం ఉండేది కాదు," అని ఆయన స్పష్టం చేశారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, "మహాత్మా గాంధీ, వీర్ సావర్కర్ వంటి మహనీయుల బలిదానాల పునాదులపై మనకు స్వాతంత్రం లభించింది. ఇప్పుడు వారి ఆశయాలకు అనుగుణంగా, అభివృద్ధి చెందిన భారతావనిని నిర్మించడమే మన ముందున్న ప్రధాన లక్ష్యం. 140 కోట్ల మంది భారతీయులు ఈ సంకల్పాన్ని స్వీకరించి, దేశ పురోభివృద్ధిలో భాగస్వాములు కావాలని కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ పిలుపునిచ్చారు. బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు మాట్లాడుతూ దేశ సమగ్రతలో సర్దార్ పటేల్ పోషించిన చారిత్రాత్మక పాత్రను స్మరించుకున్నారు. హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం కావడంలో సర్దార్ పటేల్ దృఢ సంకల్పం, దూరదృష్టి కీలక పాత్ర పోషించాయి.

# దేశంలో మూడో విడత సర్ షురూ

## ఒడిశా, మిజోరమ్, సిక్కిం, మణిపూర్‌లో ప్రారంభం

**న్యూఢిల్లీ, మే 31:** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ మూడో దశలో ఒడిశా, మిజోరమ్, సిక్కిం, మణిపూర్‌లలోప్రారంభించినట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. అర్హులైన అందరి ఓటర్లపేరును ఎన్నికల రిజిస్ట్రేసన్ అధికారికి అందచేయాలని, వారందరినీ కూడా జూన్ 28వ తేదీ జారీచేసే ముసాయిదా జాబితాలో పొందుపరుస్తామని చెప్పారు. ఈ ఓటర్ల సవరణ ప్రత్యేక కార్యక్రమం సర్‌లో బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్లను పరిశీలిస్తారని చెప్పారు.
ఓటర్లు తమ ఫారాలను ఆన్‌లైన్‌లో కూడా అందచేయవచ్చని సూచించింది. బిఎల్ఒలు తమ వెంట కనీసం 30 ఖాళీ ఫారమ్6 దరఖాస్తులు తీసుకెళ్లాలని సూచించింది. అలాగే మెత్‌లెవల్ ఏజెంట్లు రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రతినిత్యం 50 ఫారాలు ఓటర్లనుంచి సేకరించాలని బిఎల్ఒలు, బిఎల్ఎలు ఉమ్మడి కృషితో చేయాలని సూచించింది. ఒడిశాలో 3,34,14,856 ఓటర్లకుగాను 8391 మంది బిఎల్ఎలు, 38,123 మంది బూత్‌లెవెల్ అధికారులున్నారు. మిజోరమ్‌లో 8,75,008 మంది ఓటర్లకుగాను 1353 మంది బిఎల్వోలు, 3430 మంది బిఎల్‌యేలు ఉంటారన్నారు.
సిక్కింలో 4,71,077 మంది ఓటర్లకుగాను 572 మంది బిఎల్వోలు, 681 మంది బిఎల్ఎలు ఉంటారని, మణిపూర్‌లో 20,92,140 మంది ఓటర్లకుగాను 2996 మంది బిఎల్వోలు, 5003 బిఎల్‌యేలు సమిష్టిగాపనిచేస్తారని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది.



# 134 ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు ఇంటర్ బోర్డు అనుమతి ఇవ్వలేదు

## ప్రైవేటు కాలేజీల్లో 209 కళాశాలలకే అనుమతి ఇచ్చారు

## 16 జిల్లాల్లో ఒక్క ప్రైవేటు జూనియర్ కాలేజీకి గుర్తింపు ఇవ్వలేదు

## మే 31తో ముగిసిన ఇంటర్ అడ్మిషన్ల గడువు

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న 436 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 302 జూనియర్ కాలేజీలకు మాత్రమే ఇంటర్ బోర్డు 2026-27 విద్యా సంవత్సరానికి అనుమతి ఇచ్చింది. ఇంకా 134 ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు ఇంటర్ బోర్డు ఈ ఏడాది అనుబంద గుర్తింపును ఇవ్వలేదు. రాష్ట్ర వ్యాప్తంగా 17 జిల్లాల్లో 209 ప్రైవేటు జూనియర్ కాలేజీలకు అనుమతి ఇవ్వగా.. 16 జిల్లాల్లో ఒక్క ప్రైవేటు జూనియర్ కాలేజీకి కూడా ఇంటర్ బోర్డు గుర్తింపును ఇవ్వలేదు. 2026-27 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరడానికి ఇంటర్ బోర్డు ప్రకటించిన అడ్మిషన్ షెడ్యూల్ మే 31(ఆదివారం)తో ముగిసింది. అయినప్పటికీ రాష్ట్రంలో కొనసాగుతున్న కొన్ని ప్రభుత్వ జూనియర్ కాలేజీలతో పాటు ఎక్కువ సంఖ్యలో ప్రైవేటు జూనియర్ కాలేజీలకు సైతం ఇంటర్ బోర్డు ఈ ఏడాది అనుబంధ గుర్తింపును ఇప్పటి వరకు మంజూరు చేయలేదు.
2025-26 విద్యా సంవత్సరంలో ఇంటర్ బోర్డు 430 ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు అనుబంధ గుర్తింపును ఇచ్చింది. ఈ ఏడాది ఆదివారం(మే31) సాయంత్రం నాటికి 302 కాలేజీలకు మాత్రమే అనుబంధ గుర్తింపును ఇచ్చినట్టు బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లో ప్రచురించింది. అలాగే ప్రైవేటు జూనియర్ కాలేజీలకు సంబంధించి 2025-26 విద్యా సంవత్సరంలో 1405 కాలేజీలకు అనుమతి ఇవ్వగా మే 31 నాటికి కేవలం 209 కాలేజీలకు మాత్రమే గుర్తింపును ఇచ్చింది. గుర్తింపు పొందని కాలేజీలు అనుబంధ గుర్తింపు కోసం సరైన పత్రాలు సమర్పించకపోతే గుర్తింపు ప్రక్రియ పెండింగ్‌లో ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అనుబంధ ప్రక్రియ అనేది నిరంతరమైన, నిబంధనల పాటింపుతో కూడిన ఒక ప్రక్రియ అని,కేవలం వేగం కోసం దీనిని కుదించడం గానీ, దాటవేయడంగానీ సాధ్యం కాదని చెబుతున్న ఇంటర్ బోర్డు అధికారులు.. అనుబంధ గుర్తింపు మంజూరు చేయడానికి ముందు ప్రతి సంస్థ నిర్దేశించిన విద్యా, మౌలిక సదుపాయాల, పరిపాలనా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే లోపు ఈ ప్రక్రియ సకాలంలో పూర్తయ్యేలా చూసేందుకు బోర్డు తనిఖీ బృందాలు చురుకుగా క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహిస్తూ, దరఖాస్తులను ప్రాధాన్యతా క్రమంలో పరిశీలిస్తున్నాయని అధికారులు ప్రకటించినప్పటికీ.. అడ్మిషన్ల గడువు మే 31తోనే ముగియడంతో ఇటు ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు, అటు ప్రైవేటు జూనియర్ కాలేజీలకు పూర్తిస్థాయిలో అనుబంధ గుర్తింపు లేకపోవడంతో ఎక్కడా చేరాలనే సందిగ్ధంలో విద్యార్థులు, వారిని ఎక్కడా చేర్పించాలనే మీమాంశలో తల్లిదండ్రులు ఉన్నారు. రాష్ట్రంలోని 134 ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు ఇంటర్ బోర్డు అనుబంధ గుర్తింపు ఎందుకు ఇవ్వలేదో తెలుసుకోవడం కోసం ఇంటర్ బోర్డు అధికారులను వార్త ప్రతినిధి సంప్రదించగా.. వారు సమాధానం ఇవ్వలేదు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల కోసం మే 11న ఇంటర్ బోర్డు షెడ్యూల్‌ను జారీ చేసింది. మే 12 నుంచి అడ్మిషన్లను చేసుకోవడానికి అనుమతిస్తూ ఉత్తర్వులిచ్చింది. అనుమతి ఉన్న కాలేజీల్లోనే చేరాలని ఇంటర్ బోర్డు స్పష్టంగా పేర్కొంటూ.. అనుమతి లేని కాలేజీల్లో చేరి విద్యార్థులు ఇబ్బందులు పడొద్దని ఇంటర్ బోర్డు విద్యార్థులకు, తల్లిదండ్రులకు సూచించింది. మే 12 నుంచి 31 వరకు దరఖాస్తులను స్వీకరించాలని ఇంటర్ బోర్డు ప్రకటించింది. మే 31 సాయంత్రం 7 గంటల వరకు రాష్ట్రంలోని 17 జిల్లాల్లో కేవలం 209 ప్రైవేటు జూనియర్ కాలేజీలకు మాత్రమే అనుమతి ఉన్నట్టు ఇంటర్ బోర్డు వెబ్‌సైట్‌లో ప్రకటించింది. వాటిలో హైదరాబాద్‌లో 40 కాలేజీలకు, రంగారెడ్డిలో 46 కాలేజీలకు, మేడ్చల్ జిల్లాలో 58 కాలేజీలకు అనుమతి ఇచ్చింది. ఈ మూడు జిల్లాల్లోనే 144 కాలేజీలకు అనుమతి ఇవ్వగా.. మిగిలిన 14 జిల్లాల్లో 65 కాలేజీలకు అనుమతి ఇచ్చారు. మిగిలిన 16 జిల్లాల్లో ఒక్క ప్రైవేటు జూనియర్ కాలేజీకి కూడా ఇంటర్ బోర్డు అనుమతి ఇవ్వలేదు. 2026-27 సంవత్సరానికి ఇంటర్ బోర్డు అనుబంధ గుర్తింపు ఇప్పటి వరకు రానప్పటికీ చాలా కాలేజీల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్లను పూర్తి చేశాయని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇంటర్ బోర్డు అడ్మిషన్ల నోటిఫికేషన్‌ను కాలేజీలకు అనుబంధ గుర్తింపును ఇవ్వకుండానే జారీ చేసిందని.. ఇపుడు విద్యార్థులు చేరిన కాలేజీలకు ఈ ఏడాది ఇంటర్ బోర్డు గుర్తింపు రాకపోతే వారి పరిస్థితి ఏమిటని విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.

# గుజరాత్‌పై గర్జించిన ఆర్సీబీ వరుసగా రెండో ట్రోఫీ

**క్వాలిఫయర్-1 ఫలితమే ఫైనల్లో మరోసారి రిపీటైంది. తుది పోరులో.. గుజరాత్ టైటాన్స్‌పై గర్జించింది. మొదట బౌలింగ్, ఆ తర్వాత బౌలింగ్‌లో ఆర్సీబీ మెరవడంతో ఫైనల్ వన్‌సైడ్ వార్‌గా మారింది. డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూర్ కప్ నిలబెట్టుకుంది. 2025లో మొదటిసారి ఐపీఎల్ ట్రోఫీ నెగ్గిన పాటిదార్ సేన లీగ్ స్టేజ్ నుంచి క్వాలిఫైయర్, ఫైనల్ వరకూ దుమ్మురేపింది. అహ్మదాబాద్ వేదికగా వరుసగా రెండోసారి ఐపీఎల్ ట్రోఫీ ఎత్తింది. వరుసగా రెండుసార్లు ఐపీఎల్ ట్రోఫీ నెగ్గిన మూడో జట్టుగా నిలిచింది. చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ సరసన చేరింది.**



**అహ్మదాబాద్:** గుజరాత్ తమ సొంత వేదికగా కప్ అందుకోవాలన్న ఆశలను ఆర్సీబీ కల్లలు చేసింది. మరోసారి బ్యాటింగ్‌లో విఫలమైన గుజరాత్ టైటాన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 155 పరుగులు చేసింది. ఈ స్వల్ప లక్ష్యాన్ని ఆడుతూ పాడుతూ ఛేధించిన ఆర్సీబీ మరో రెండు ఓవర్లు మిగిలి ఉండగానే 5 వికెట్లు కోల్పోయి అందుకుంది. ఫైనల్లో గుజరాత్‌పై 5 వికెట్ల తేడాతో నెగ్గి రెండోసారి ఐపీఎల్ ఛాంపియన్‌గా ఆవిర్భవించింది. కాగా మూడో సారి ఫైనల్ చేరిన గుజరాత్ టైటాన్స్‌కు ట్రోఫీ అందని ద్రాక్షలాగే మిగిలింది.

156 పరుగుల స్వల్ప లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఆర్సీబీకి ఓపెనర్లు వెంకటేశ్ అయ్యర్(16 బంతుల్లో 32, 4 ఫోర్లు, 2 సిక్సులు), ఛేజింగ్ కింగ్ విరాట్ కోహ్లి(42 బంతుల్లో 75 నాటౌట్; 9 ఫోర్లు, ఆ సిక్సులు) ధాటిగా ఆరంభించారు. రబడ వేసిన రెండో ఓవర్లో వెంకటేశ్ అయ్యర్ 4, 6, 4, 4తో 18 రన్స్, నాలుగో ఓవర్లో విరాట్ కోహ్లి 4, 4, 6, 4తో 19 రన్స్ సాధించారు. 3.3 ఓవర్లకే ఆర్సీబీ స్కోరు 50 పరుగులకు చేరుకుంది. ఈ దశలో వెంకటేశ్‌ను సిరాజ్ అవుట్ చేశాడు. క్రీజ్‌లోకి వచ్చిన దేవదత్ పడిక్కల్(1)ను మరో ఓవర్లో రబడ అవుట్ చేశాడు. ఒక పరుగు తేడాతో ఈ రెండు వికెట్లు కోల్పోయింది. రజత్ పాటిదార్(13 బంతుల్లో 15) కూడా ఎక్కువ సేపు క్రీజ్‌లో నిలవలేదు. పాటిదార్‌తో పాటు కృనాల్ పాండే(1)ను రషీద్ ఖాన్ వెంటవెంటనే పెవిలియన్‌కు పంపి ఆర్సీబీని బ్యాక్ స్టెప్‌లో నిలిపాడు.

ఛేజింగ్‌ను ఇష్టపడే విరాట్ కోహ్లి మరో ఎండ్‌లో ధాటిగా ఆడాడు. అర్షద్ ఖాన్ బంతిని బౌండరీకి తరలించి 25 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సులతో హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. ఈ ఐపీఎల్ సీజన్‌లో అయిదో హాఫ్ సెంచరీని ఓవరాల్‌గా 68వ ఫిఫ్టీని సాధించాడు. టీమ్ డేవిడ్(17 బంతుల్లో 24, 3 ఫోర్లు, ఒక సిక్స్)తో కలిసి 5వ వికెట్‌కు 41 రన్స్ జోడించిన కోహ్లి... జితేష్ శర్మ(11 నాటౌట్)తో మిగతా పనిని పూర్తి చేశాడు. చివరి వరకు క్రీజ్‌లో నిలిచిన కోహ్లి.. మరో రెండు ఓవర్లు ఉండగానే ఆర్సీబీని గెలుపందించాడు. గుజరాత్ టైటాన్స్ బౌలర్లలో రషీద్ ఖాన్ రెండు వికెట్లు పడగొట్టాడు.




### గిల్, సుదర్శన్ ఔట్‌తో మొదలైన కష్టాలు

క్వాలిఫైయర్-2లో 150 ప్లస్ ఫ్లయింగ్ స్టార్ట్ ఇచ్చిన సాయి సుదర్శన్(12), శుభ్‌మన్ గిల్(10) గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్‌ను కాస్త దూకుడుగానే మొదలు పెట్టారు. తొలి ఓవర్లోనే బ్యాక్ టు బ్యాక్ ఫోర్లతో సుదర్శన్.. 13 పరుగులు పిండుకుని మంచి ఊపుమీద కనిపించాడు. ఈ జీటీ ఓపెనర్ల జోడీని బౌలింగ్‌కు వస్తూనే ఆర్సీబీ స్టార్ బౌలర్ హేజిల్‌వుడ్ విడదీశాడు. జట్టు స్కోరు 22 పరుగుల వద్ద ఉన్నప్పుడు రజత్ పాటిదార్ అద్భుత క్యాచ్‌తో శుభ్‌మన్ గిల్‌ను పెవిలియన్ పంపాడు. గిల్ అవుట్‌తో ఒత్తిడిలోకి వెళ్లిన గుజరాత్‌కు కోలుకునే టైం ఇవ్వకుండా.. మరో ఓపెనర్ సాయి సుదర్శన్‌ను భువనేశ్వర్ కుమార్ దెబ్బకొట్టాడు. భువి బౌలింగ్‌లో వికెట్ కీపర్ జితేష్ శర్మకు క్యాచ్ ఇచ్చి సుదర్శన్ మైదానం వీడటంతో గుజరాత్ కష్టాలు షురూ అయ్యాయి.

### బట్లర్ స్టంపౌట్.. రసిఖ్ మెరుపులు

ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన నిశాంత్ సింధు(20), జోస్ బట్లర్(19) కాసేపు వేగంగా ఆడే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ప్రమాదకరంగా మారుతున్న నిశాంత్‌ను పడిక్కల్ క్యాచ్‌తో రసీఖ్ సలామ్ పెవిలియన్‌కు పంపాడు. ఆ కాసేపటికే స్టార్ బ్యాటర్ జోస్ బట్లర్‌ను కృనాల్ పాండ్యా బోల్తా కొట్టించాడు. షాట్ ఆడేందుకు ఫ్రంట్‌ఫుట్ వెళ్లిన బట్లర్‌ను జితేష్ మెరుపు స్టంప్ చేశాడు. ఈ దశలో ఫిఫ్త్ డౌన్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన అర్షద్ ఖాన్ కాసేపు చెలరేగి ఆడాడు. జాకబ్ డఫీ వేసిన ఓ ఓవర్లో 4, 4, 6తో ఏకంగా 16 రన్స్ కొట్టిన అర్షద్.. ఆ తర్వాత జోష్ హేజిల్‌వుడ్ బౌలింగ్‌లో అవుటై డగౌట్‌కు చేరాడు. అనంతరం వచ్చిన రాహుల్ తెవాటియా(7) మరోసారి ఘోరంగా విఫలమయ్యాడు. కేవలం 7 రన్స్ మాత్రమే చేసి రసీఖ్ సలామ్ దార్ బౌలింగ్‌లో క్యాచ్ అవుట్ అయ్యాడు. హేజిల్ వుడ్ ఖాతాలో ఈ వికెట్ చేరింది. ఓ వైపు వికెట్లు పడడంతో గుజరాత్ స్కోరు నత్తనడకగా నడిచింది. 15వ ఓవర్లో కానీ స్కోరు వంద దాటలేదు.

### వాషింగ్టన్ సుందర్ ఒంటరి పోరాటం

చివర్లో వచ్చిన జేసన్ హోల్డర్ కూడా ఎక్కువ సేపు క్రీజులో నిలవలేకపోయాడు. కేవలం 7 పరుగులే చేసి భువనేశ్వర్ కుమార్ బౌలింగ్‌లో హేజిల్‌వుడ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఆ తర్వాత వచ్చిన రషీద్ ఖాన్ ఓ భారీ సిక్స్ కొట్టినప్పటికీ, ఆ మరుసటి బంతికే రసీఖ్ సలామ్ దార్ బౌలింగ్‌లో క్యాచ్ అవుట్ అయ్యాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా.. మరో ఎండ్‌లో మొండిగా నిలబడిన వాషింగ్టన్ సుందర్(37 బంతుల్లో 50 నాటౌట్; 5 ఫోర్లు) అద్భుతమైన హాఫ్ సెంచరీతో ఆదుకున్నాడు. దీంతో గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 155 పరుగులైనా చేయగలిగింది. ఆర్సీబీ బౌలర్లలో రసీఖ్ సలామ్ దార్ 3 వికెట్లు పడగొట్టగా.. భువనేశ్వర్ కుమార్, జోష్ హేజిల్‌వుడ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు.

### టాస్ రూపంలో ఆర్సీబీని వరించిన అదృష్టం

టాస్ నెగ్గిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూర్ కెప్టెన్ రజత్ పాటిదార్ బౌలింగ్ చేయాలని నిర్ణయించాడు. అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ స్టేడియం పిచ్‌పై మొదటగా గుజరాత్ టైటాన్స్‌కు బ్యాటింగ్ అప్పగించాడు. ఈ మ్యాచ్ కోసం ఎలాంటి మార్పులు లేకుండాన ఆర్సీబీ బరిలోకి దిగింది. వెంకటేశ్ అయ్యర్‌ను ఇంఫాక్ట్ ప్లేయర్‌గా కొనసాగించింది. ఇక గుజరాత్ టైటాన్స్ ఒక మార్పుతో బరిలోకి దిగింది. సాయి కిశోం స్థానంలో అర్షద్ ఖాన్‌ను తుది జట్టులోకి తీసుకుంది.




### గుజరాత్‌పై మరోసారి గర్జించిన ఆర్సీబీ పేస్ త్రయం

**గుజరాత్‌ను మరోసారి ఆర్సీబీ పేస్ అటాక్ భువనేశ్వర్ కుమార్, హేజిల్‌వుడ్, రసిఖ్ సలామ్ కుప్పకూల్చింది. క్వాలిఫయర్ మ్యాచ్‌లో 162 పరుగులకు ఆలౌట్ చేసిన ఆర్సీబీ బౌలర్లు ఫైనల్లో మరింతగా విజృంభించారు. హేజిల్ వుడ్ వికెట్ల పతనం మొదలుపెడితే దాన్ని భువనేశ్వర్, రసిఖ్ సలామ్ అందుకున్నారు. గుజరాత్ బ్యాట్స్‌మెన్‌ను పదునైన బంతులతో బెంబేలెత్తించారు. భువనేశ్వర్ స్వింగ్ బంతులకు ఎదురులేకపోయింది. క్వాలిఫయర్-2లో చెలరేగిన గుజరాత్ బ్యాటింగ్.. ఫైనల్లో వీరి ముందు కుదేలైంది. చాలా స్వల్ప స్కోరుకే ఆర్సీబీ బౌలర్లు పరిమితం చేసి అక్కడే తమ జట్టు విజయానికి బాటలు వేశారు. గుజరాత్ 8 వికెట్లు కోల్పోతే ఏడు వికెట్లు ఈ పేస్ త్రయం ఖాతాలోనే చేరాయి. రసిఖ్ మూడు వికెట్లు పడగొడితే... భువీ, హేజిల్ వుడ్ చెరో రెండేసి వికెట్లు తీశారు.**

### ఆరెంజ్ క్యాప్



**వైభవ్ సూర్యవంశీ**
**16 మ్యాచ్‌లు, 776 రన్స్**
**సెంచరీలు: 1, హాఫ్ సెంచరీలు: 5**
**స్ట్రయిక్ రేట్ 237.30, సగటు :48.50**

### పర్పుల్ క్యాప్



**కగిసో రబడ**
**17 మ్యాచ్‌లు, 29 వికెట్లు**
**బెస్ట్: 3-25, ఎకానమీ: 9.68**
**ఓవర్లు: 65, రన్స్: 626**

### ఫైనల్ మ్యాచ్ స్కోర్ బోర్డు

**గుజరాత్ ఇన్నింగ్స్:** సాయి సుదర్శన్ (సి) జితేశ్ శర్మ (బి) భువనేశ్వర్ 12, శుభ్‌మన్ గిల్ (సి) పాటిదార్ (బి) హేజిల్‌వుడ్ 10, నిశాంత్ సింధు (సి) పడిక్కల్ (బి) రసిఖ్ సలామ్ 20, జోస్ బట్లర్ (స్టంప్డ్) జితేశ్ శర్మ (బి) కృనాల్ పాండ్య 19, వాషింగ్టన్ సుందర్ నాటౌట్ 50, అర్షద్ ఖాన్ (సి) రసిఖ్ (బి) హాజిల్‌వుడ్ 15, రాహుల్ తెవాటియా (సి) పాటిదార్ (బి) రసిఖ్ సలామ్ 7, జాసన్ హోల్డర్ (సి) హాజిల్‌వుడ్ (బి) భువనేశ్వర్ 7, రషీద్ ఖాన్ (సి) షెఫర్ట్ (బి) రసిఖ్ సలామ్ 7, కగిసో రబడా నాటౌట్ 3; **ఎక్స్‌ట్రాస్: 5**(నోబ్స్ 1, వైడ్స్ 4); **మొత్తం : 155/8(20 ఓవర్లలో)**

**వికెట్ల పతనం:** 1-22(శుభ్‌మన్ గిల్, 2.2), 2-26(సాయి సుదర్శన్, 3.4), 3-55(నిశాంత్, 7.6), 4-73(బట్లర్, 12.1), 5-99(అర్షద్, 14.1), 6-115(తెవాటియా, 16.1), 7-142(హోల్డర్, 18.3), 8-151(రషీద్, 19.2)

**బౌలింగ్:** జాకబ్ డఫీ 4-0-38-0, భువనేశ్వర్ 4-0-29-2, హాజిల్‌వుడ్ 4-0-37-2, రసిఖ్ సలామ్ 4-0-27-3, కృనాల్ పాండ్యా 4-0-23-1

**రాయల్ ఛాలెంజర్స్ బెంగళూర్:** వెంకటేశ్ అయ్యర్ (సి) రబడా (బి) సిరాజ్ 32, విరాట్ కోహ్లి నాటౌట్ 75, దేవదత్ పడిక్కల్ (సి) అర్షద్‌ఖాన్ (బి) రబడ 1, రజత్ పాటిదార్ (సి) రబడ (బి) రషీద్ ఖాన్ 15, కృనాల్ పాండ్యా (ఎల్బీడబ్ల్యు)(బి) రషీద్ ఖాన్ 1, టిమ్ డేవిడ్ (సి) బట్లర్ (బి) అర్షద్ ఖాన్ 24, జితేష్ శర్మ నాటౌట్ 11; **ఎక్స్‌ట్రాస్:** 2(ఎల్బీ 1, వైడ్స్ 1)

**మొత్తం: 161/5(18 ఓవర్లలో)**

**వికెట్ల పతనం:** 1-62(వెంకటేశ్ అయ్యర్, 4.3), 2-63(పడిక్కల్, 5.1), 3-89(రజత్ పాటిదార్, 8.2), 4-91(కృనాల్ పాండ్యా, 8.5), 5-132(టిమ్ డేవిడ్, 13.6)

**బౌలింగ్:** మహ్మద్ సిరాజ్ 4-0-36-1, కగిసో రబడ 3-0-44-1, జేసన్ హోల్డర్ 2-0-16-0, రషీద్ ఖాన్ 4-0-25-2, అర్షద్ ఖాన్ 4-0-32-1, ప్రసిద్ధ్ కృష్ణ 1-0-7-0

**గుజరాత్ టైటాన్స్‌పై రాయల్ ఛాలెంజర్స్ బెంగళూర్ 5 వికెట్ల తేడాతో విజయం**



## ఫ్రెంచ్ ఓపెన్‌లో సంచలనాల పర్వం

# గాఫ్, స్వియాటెక్ ఔట్

**పారిస్:** ఫ్రెంచ్ ఓపెన్‌లో సంచలన ఫలితాలు కొనసాగుతున్నాయి. డిఫెండింగ్ ఛాంపియన్ కోకా గాఫ్, నాలుగు సార్లు ఛాంపియన్ ఇగా స్వియాటెక్ ఓటములతో టోర్నీ నుంచి నిష్క్రమించారు. మరోవైపు ప్రపంచ నంబర్ వన్ సబలెంకా, మాజీ ప్రపంచ నంబర్ వన్ నయోమి ఒసాకా విజయాలతో దూసుకెళ్లారు. ప్రీక్వార్టర్ పోరుకు సిద్ధమయ్యారు.

పోలాండ్ స్టార్ ఇగా స్వియాటెక్‌కు నాలుగో రౌండ్‌లో అనూహ్య ఓటమి ఎదురైంది. ఉక్రెయిన్‌కు చెందిన 15వ సీడ్ మార్టా కోస్టుక్ అద్భుత ఆటతీరుతో 7-5, 6-1 తేడాతో స్వియాటెక్‌ను ఓడించి తొలిసారి ఫ్రెంచ్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. క్లే కోర్ట్‌పై ఆధిక్యం చాటే స్వియాటెక్ ఆరంభంలో ఆధిక్యం కనబరిచినా.. కీలక సమయంలో వరుస డబుల్ ఫాల్ట్‌లు, అనవసర తప్పిదాలతో భారీ మూల్యం చెల్లించుకుంది. అవకాశాన్ని అందిపుచ్చుకున్న కోస్టుక్ గ్రౌండ్‌స్ట్రోక్స్‌తో ఒత్తిడి పెంచింది. తొలి సెట్‌ను 7-5తో గెలుచుకున్న ఉక్రెయిన్ స్టార్.. రెండో సెట్‌లో మరింత దూకుడు ప్రదర్శించి అలవోకగా ముగించింది. ఇక డిఫెండింగ్ ఛాంపియన్ కోకో గాఫ్‌కు అనస్టాసియా పొటోపొవా షాకిచ్చింది. 4-6, 7-6, 6-4తో గెలుపొందింది. తొలి సెట్ నెగ్గిన కోకో గాఫ్.. రెండో సెట్‌లోనూ ఆధిక్యం కనబరిచింది. ఓ దశలో మ్యాచ్ పాయింట్‌పై కాచుకున్న గాఫ్.. తర్వాత లయ కోల్పోయి వరుసగా రెండో సెట్‌తో పాటు మూడో సెట్ కూడా చేజార్చుకుంది. మ్యాచ్ అనంతరం గాఫ్ నిరాశ వ్యక్తం చేసింది. కోర్టులో తన అత్యుత్తమ ఆటను కనబరచలేకపోయానని అంగీకరించింది.



# సాత్విక్, చిరాగ్ జోడీకి డబుల్స్ టైటిల్

**సింగపూర్:** భారత్‌జోడీ సాత్విక్ సాయిరాజ్- చిరాగ్ షెట్టి జోడీ సింగపూర్ ఓపెన్‌లో సత్తా చాటింది. ఒక గేమ్ వెనుకబడ్డా.. పట్టువదలని పోరాటంతో చరిత్ర సృష్టించింది. తమ క్లాస్ కనబరిచింది పురుషుల డబుల్స్ కైవసం చేసుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్లో ఇండోనేషియా జోడీ ఫజర్ అల్ఫియాన్ -మహ్మద్ ఫిక్రిపై 18-21, 21-17, 21-16 తేడాతో సాత్విక్-చిరాగ్ జోడీ గెలుపొందింది. నాలుగో సీడ్ భారత జోడీకి ఇది రెండేళ్ల తర్వాత తొలి టైటిల్. 2024లో థాయిలాండ్ ఓపెన్ టైటిల్ నెగ్గిన తర్వాత పలుమార్లు ఫైనల్స్‌కు చేరినా ట్రోఫీ మాత్రం అందలేదు. అయితే ఈసారి సింగపూర్ వేదికగా రెండేళ్ల నిరీక్షణకు తెరపడింది. అలాగే సింగపూర్ ఓపెన్‌లో డబుల్స్ టైటిల్ గెలిచిన తొలి భారత జోడీగానూ సాత్విక్ సాయిరాజ్ -చిరాగ్ షెట్టి కొత్త చరిత్ర రాశారు.

ఫైనల్ ప్రారంభంలో ఇండోనేషియా జోడీ దూకుడు కనబరిచింది. తొలి గేమ్‌లో భారత జోడీ పోరాడినా కీలక సమయాల్లో చేసిన చిన్నపాటి తప్పిదాలు మూలంగా గేమ్ చేజారింది. కానీ రెండో గేమ్ నుంచి సాత్విక్ స్మాష్‌లు, చిరాగ్ నెట్ వద్ద చాకచక్యమైన షాట్లతో మ్యాచ్‌ను పూర్తిగా తమ వైపు తిప్పుకున్నారు. సుదీర్ఘ ర్యాలీల్లో ఆధిపత్యం చెలాయిస్తూ ప్రత్యర్థులను ఒత్తిడిలోకి నెట్టారు. ఇప్పటికే సెమీస్‌లో ప్రపంచ ఛాంపియన్స్లు, టాప్ సీడ్ దక్షి ణ కొరియా జోడీని మట్టికరిపించిన భారత జోడీ.. అదే జోష్‌ను ఫైనల్లోనూ కొనసాగించింది. చివరి పాయింట్ సాధించిన వెంటనే కోర్టులోనే భారత జోడీ సంబరాలు చేసుకుంది. ఈ విజయంతో భారత బ్యాడ్మింటన్‌కు మరో గర్వకారణం చేరింది. ప్రపంచ బ్యాడ్మింటన్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ శకం ఇంకా ముగియలేదని, పెద్ద వేదికలపై ఇంకా ఎన్నో విజయాలు తమవేనని ఘనంగా చాటిచెప్పింది.



# నార్వే చెస్ టైటిల్ రేసులో గుకేష్: ప్రజ్ఞానందపై విక్టరీ




**ఓస్లో:** భారత గ్రాండ్ మాస్టర్, ప్రపంచ ఛాంపియన్ గుకేష్... నార్వే చెస్ టైటిల్ రేసులో నిలిచాడు. 20వ పుట్టినరోజు ముగిసిన మరుసటి రోజే అద్భుతంగా పుంజుకుని భారత్‌కే చెందిన ప్రజ్ఞానందపై కీలక విజయం సాధించాడు. ఓస్లోలో జరిగిన ఈ ఉత్కంఠభరిత క్లాసికల్ పోరులో గుకేశ్ చివరి క్షణాల్లో అద్భుత సంయమనంతో ప్రత్యర్థిని మట్టికరిపించి మూడు పూర్తి పాయింట్లు సొంతం చేసుకున్నాడు. ఇప్పటివరకు ఆశించిన ఫలితాలు రాక కొంత నిరాశలో కనిపించిన గుకేష్.. ఈ విజయంతో మళ్లీ చిరునవ్వు చిందించాడు. ప్రస్తుతం 6.5 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచిన గుకేష్.. టోర్నీలో మిగిలిన రౌండ్లకు గట్టి పోటీదారుగా మారాడు. ఈ ఆల్ ఇండియన్ పోరు మొదటి నుంచి చివరి వరకు రసవత్తరంగా సాగింది. తొలి దశలో ప్రజ్ఞానందకు స్వల్ప ఆధిక్యం కనిపించింది. 40వ ఎత్తు దగ్గర ఇద్దరూ టైమ్ ప్రెజర్‌లోకి వెళ్లడంతో మ్యాచ్ మరింత ఉత్కంఠగా మారింది. అదే సమయంలో ప్రజ్ఞానంద చేసిన చిన్న పొరపాటును గుకేశ్ అద్భుతంగా అందిపుచ్చుకుని చెక్‌మేట్ దాడిగా మార్చేశాడు. విజయం తర్వాత గుకేశ్ ఆనందం వ్యక్తం చేశాడు. చాలా క్లిష్టమైన గేమ్. చివరికి ఎత్తుగడలు తనకు అనుకూలించాయని గుకేష్ తెలిపాడు. ఇక టోర్నీలో అగ్రస్థానంలో అలిరెజా 10 పాయింట్లతో కొనసాగుతుండగా.. అమెరికాకు చెందిన వెస్లే 8.5 పాయింట్లతో రెండో స్థానానికి చేరుకున్నాడు. వెస్లీ సో చేతిలో ఓటమితో కార్ల్‌సెన్ 4.5 పాయింట్లతో చివరి స్థానంలో నిలిచాడు. మహిళల విభాగంలో భారత యువ క్రీడాకారిణి దివ్య దేశ్‌ముఖ్ తన అద్భుత ప్రదర్శనతో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. దీంతో నార్వే చెస్‌లో భారత చెస్ అభిమానులకు ఈ రౌండ్ మరింత ఉత్సాహాన్ని ఇచ్చింది. ఇప్పుడు అందరి చూపు ఆరో రౌండ్‌పైనే ఉంది. గుకేశ్ మరో క్లాసికల్ విజయం సాధిస్తే.. అగ్రస్థానానికి దగ్గరయ్యే అవకాశం ఉంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.